thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 333 కరీంనగర్ ఆదివారం, 8 ఫిబ్రవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఆరో తరం ఫైటర్ జెట్‌పై భారత్ దృష్టి

న్యూఢిల్లీ : అత్యాధునిక ఆరో తరం ఫైటర్ జెట్‌ల అభివృద్ధిపై భారత్ దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి యునైటెడ్ కింగ్‌డమ్(యూకే), జపాన్, ఇటలీ సంయుక్తంగా నిర్వహిస్తున్న గ్లోబల్ కాంబాట్ ఎయిర్ ప్రోగ్రామ్ (జీసీఏపీ) ప్రాజెక్టులో చేరేందుకు భారత్ ఆసక్తి చూపిస్తోంది. కానీ, రక్షణ రంగంలో భారత్, రష్యా మధ్య ఉన్న బలమైన బంధం నేపథ్యంలో జీసీఏపీలో భారత్‌ను చేర్చుకునే అంశంలో జపాన్ ఓ నిర్ణయానికి రాలేకపోతోంది. జపాన్ మీడియాలో ఈ మేరకు కథనాలు వెలువడ్డాయి. ఆరో తరం ఫైటర్ జెట్‌లను కలిసి అభివృద్ధి చేసేందుకు యూకే, జపాన్, ఇటలీ.. 2022 డిసెంబరులో జీసీఏపీ ప్రాజెక్టును చేపట్టాయి. 2035 నాటికి అత్యాధునిక ఫైటర్ జెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలనేది లక్ష్యం.

## మోదీ ఫోటో పెట్టుకుని ఓట్లడుగుతున్నరు...

# సమస్యలు వస్తే మోదీ తీరుస్తరా!?

## బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందాలు : సీఎం రేవంత్ రెడ్డి




హైదరాబాద్: బీజేపీపై సీఎం రేవంత్ రెడ్డి సెటైర్లు వేశారు. ప్రధాని మోడీని చూసి బీజేపీకి ఓటేయాలని తెలంగాణ బీజేపీ నేతలు అంటున్నారు. ఎక్కడైనా పెళ్లి పెద్దను చూసి పిల్లను ఇస్తామా అని ఎద్దేవా చేశారు. బీజేపీకి ఓటేస్తే ఢిల్లీ నుంచి మోడీ వచ్చి సమస్యలు తీర్చుతారా అని ప్రశ్నించారు. మోడీని చూసి ఓటేస్తే ఇక్కడి బోడీలు పని చేయరని టీ బీజేపీ నేతలను విమర్శించారు. శనివారం (ఫిబ్రవరి 7) 'ప్రజా పాలన – ప్రగతి బాట' కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లా పరిగి మండలం నారాయణపూర్‌లో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. అనంతరం బహిరంగా సభలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించేందుకు బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నాయని ఆరోపించారు. పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఏనాడు ప్రజల సమస్యలు పరిష్కరించలేదన్నారు. నిజంగా కేసీఆర్ పని చేసి ఉంటే ఇవాళ ఓట్లు అడుక్కునే పరిస్థితి రాకపోవన్నారు. బీఆర్ఎస్‌కు ఎప్పుడూ ఓట్లే కావాలని కానీ ప్రజల సమస్యలు వద్దని విమర్శించారు. పదేండ్లు అధికారంలోకి ఉండి రంగారెడ్డి జిల్లాకు కేసీఆర్ గోదావరి జలాలు ఇవ్వలేదన్నారు. రంగారెడ్డి జిల్లాలకు గోదావరి జలాలు అందించేందుకు ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్?కు ఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. గోదావరిలో ఏటా 3 వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తాయని స్వయంగా కేసీఆరే అసెంబ్లీలో చెప్పారు.

**తెలంగాణ, మహారాష్ట్ర మధ్య నీటి గొడవలు లేవు...** 3 వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తుంటే కళ్లప్పగించి చూశారని విమర్శించారు. ప్రాణహిత ద్వారా 300 టీఎంసీలు ఇచ్చి ఉంటే రంగారెడ్డి జిల్లాకు తాగునీరు వచ్చేదన్నారు. రంగారెడ్డికి గోదావరి జాలలను ఎందుకు అడ్డుకున్నారని.. రంగారెడ్డి జిల్లా అభివృద్ధి కోసమని కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్?లో సబితా ఇంద్రారెడ్డి దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సబితా పార్టీ మారిన తర్వాత రంగారెడ్డి జిల్లాలో ఏం డెవలప్మెంట్ జరిగిందని ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్ట్ కడతామని కనీసం భూసేకరణ కూడా చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్ట్ ను కేసీఆర్ ఎందుకు కట్టలేదని ప్రశ్నించారు. త్వరలోనే లక్ష్మీదేవిపల్లి దగ్గర ప్రాజెక్ట్ కడతామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో లక్ష కోట్లతో కాళేశ్వరం కడితే మూడేండ్లోనే కూలేశ్వరం అయ్యిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ తో ఒకాయనకు జన్వాడలో ఫాం హౌస్ వచ్చిందని ఆరోపించారు. పదేండ్లు దోచుకున్న సొమ్ముతో పేపర్లు, టీవీలు పెట్టుకున్నారని ఆరోపించారు. పదేళ్లలో కనీసం రేషన్ కార్డ్ ఇవ్వాలనే ఆలోచన కూడా చేయలేదని నిప్పులు చెరిగారు.

**మున్సిపల్ ఎన్నికలు క్లీన్ స్వీప్ చేయబోతున్నం...** గోదావరి జలాలను తీసుకొచ్చి తాండూరు, పరిగి, చేవెళ్లకు నీళ్లు ఇస్తామన్నారు. తాండూరుకు కాగ్నా నది నీళ్లు ఇస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో దళితుల ఆత్మగౌరవం నిలబెట్టామన్నారు. మొఖం చెల్లక కేసీఆర్ అసెంబ్లీకి రావట్లేదని విమర్శించారు. రెండేళ్ల పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చాం. గత పాలకులు చేసిన తప్పులను సరిదిద్దుకుంటూ ముందుకెళ్తున్నామని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలంతా ఆలోచించి ఓటేయాలని సూచించారు.

**కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ :**'మాజీ సీఎం చంద్రశేఖర్‌రావు ఎన్నికుట్రలు ఈ కుట్రలు, కుతంత్రాలు చేస్తారు? అప్పుడే దిగిపో అంటున్నారు.. ఐదేళ్లకోసం అధికారంలోకి వచ్చాం.. మరో ఐదేళు మేమే అధికారంలోకి వస్తాం.. చంద్రశేఖర్‌రావు.. కల్వకుంట్ల కిషన్ రావు(కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఉద్దేశించి) ఈరోజు నుంచి రాసిపెట్టు కోండి.. రాబోయే 8 సంవత్సరాలు తెలంగాణలో ఇందిరమ్మ పాలన కొనసాగుతుంది.. నువ్వు, నీ తాతలు ఎవరెవరు ఎన్నికల్లో అడ్డం వస్తారో రండి.. ఏ కుట్రలు చేస్తారో చేయండి.. చూద్దాం..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్ చేశారు. ఇవాళ 'ప్రజా పాలన – ప్రగతి బాట' కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లా పరిగిలో ముఖ్యమంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. రెండేళ్ల ప్రజాపాలనలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగిస్తున్నామన్నారు. స్థానిక సమస్యలు పరిష్కరించేందుకు బీఆర్ఎస్, బీజేపీ ప్రయత్నించడం లేదని విమర్శించారు. కేటీఆర్‌కు ఇన్నాళ్లు వికారాబాద్, తాండూర్ ఎందుకు గుర్తురాలేదు.? రంగారెడ్డికి గోదావరి నీళు ఇవ్వాలన్న ఆలోచన కేసీఆర్‌కు ఎందుకు రాలేదని నిలదీశారు.

**చంద్రబాబుకు సలహాలు తప్ప నీళ్లివ్వలేదు..** గోదావరి జలాల్లో 3 వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని వాటిని తరలించుకుపోవాలని నాడు చంద్రబాబుకు కేసీఆర్ సలహాలు ఇచ్చారని సీఎం రేవంత్ దుయ్యబట్టారు. 3 వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తుంటే కళ్లప్పగించి చూసిన కేసీఆర్.. అందులో 300 టీఎంసీలు రంగారెడ్డి జిల్లాకు ఇస్తే 30 లక్షల ఎకరాలకు సాగు నీరు వచ్చి ఉండేది కదా అని ప్రశ్నించారు. ఏం పాపం చేశామని నిర్లక్ష్యం చేశారని నిలదీశారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు కోసం రూ. 38 వేలకోట్లతో నాటి సీఎం రాజశేఖర్‌రెడ్డి పూనున్నారన్నారు. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం మూడేళ్లలో కూలేశ్వరం అయిందని, దాని వల్ల కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు ఫామ్‌హౌస్‌లు వచ్చాయని ఆరోపించారు. గోదావరి జలాల ముసుగులో వేలకోట్లు కొల్లగొట్టారని మండపడ్డారు.

**లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పూర్తి చేస్తాం...** సబితా ఇంద్రారెడ్డికి అన్ని పదవులు ఇచ్చినా ఆమె పార్టీ ఫిరాయించారని, నాడు రంగారెడ్డి జిల్లా అభివృద్ధి కోసమే పార్టీ ఫిరాయిస్తున్నానని చెప్పిన ఆమె.. ఎందుకు ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ఎందుకు నిధులు, అనుమతులు తీసుకురాలేకపోయారో ప్రజలకు సమాధానం చెప్పాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. చేసిన ద్రోహానికి ప్రజలను కలిసేందుకు సబితా ఇంద్రారెడ్డికి నైతిక హక్కు లేదని విమర్శించారు. పదేళ్లు కేసీఆర్, కేటీఆర్ మున్సిపాలిటీల వైపు చూడలేదని, కానీ తాము గోదావరి జలాలు తెచ్చి తాండూరు, వికారాబాద్ పరిగి ప్రజల కాళు కడుగుతామన్నారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్?కు భూసేకరణ చేసి త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామన్నారు. తాండూరుకు కాగ్నా నది నీళ్లు ఇస్తామన్నారు. కేసీఆర్ నిర్లక్ష్యానికి రంగారెడ్డి జిల్లా బలైందని ధ్వజమెత్తారు.




మేడ్చల్ : మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అలియాబాద్ మున్సిపల్ పరిధి లాల్‌గడి మలక్‌పేటలో శుక్రవారం చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి స్పందించారు. శనివారం నాడు బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తామంతా ప్రశాంతంగా కూర్చుని ఉన్న సమయంలో, సుమారు 100 మంది కాంగ్రెస్ గుండాలు కావాలనే గొడవ సృష్టించారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రచార రథాలపై పెద్ద శబ్ధంతో పాటలు పెట్టి, ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టి గొడవకు దిగారని ఫిర్యాదులో పేర్కొన్నారు.




## సిద్దిపేట జిల్లాలో పులి సంచారం.. భయం గుప్పిట్లో ప్రజలు.!

సిద్దిపేట: సిద్దిపేట జిల్లాలోని దూల్మిట్ట మండలం కూటిగల్, భైరన్‌పల్లి శివారులో పులి సంచారం తీవ్ర కలకలం రేపింది. మద్దూర్ మండలం లద్నూర్, అమ్మాపూర్ గ్రామాల్లో పులి.. లేగ దూడలపై దాడిచేసి చంపడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫారెస్ట్ అధికారులు.. పులి పాదముద్రలను పరిశీలించారు. పులి పాదముద్రల ఆధారంగా యాదాద్రి జిల్లా నుంచి సిద్దిపేటలోకి ప్రవేశించినట్లు అటవీ అధికారులు గుర్తించారు. దూల్మిట్ట, మద్దూర్ మండలాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని, సాయంత్రం వేళ బయటకు రావొద్దని హెచ్చరించారు. ప్రస్తుతం పాదముద్రల ఆధారంగా పులి జాడ కోసం అధికారులు అన్వేషిస్తున్నారు.

## కేసీఆర్‌పై చర్యలు తీసుకుంటామంటే.. రేవంత్‌రెడ్డిని అడ్డుకున్నదెవరు?: కిషన్‌రెడ్డి



హైదరాబాద్: మాజీ సీఎం కేసీఆర్‌పై చర్యలు తీసుకుంటామంటే.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎవరు అడ్డుకున్నారో చెప్పాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చర్యలు తీసుకోవాల్సింది సీఎం కాదా? ప్రశ్నించారు. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రికి చేతగాక.. బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ తమకు అవసరం అని చెప్పుకోవాలి కానీ.. కిషన్ రెడ్డి మీదనో, కేంద్ర ప్రభుత్వం మీదనో నిందలు వేయొద్దని హితవు పలికారు. కిషన్‌రెడ్డిని అడ్డుపెట్టి సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కువ రోజులు తప్పించుకోలేరన్నారు.

కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలని ఏ ఒక్క రోజైనా రాహుల్‌గాంధీ.. రేవంత్ రెడ్డిని ఆదేశించారా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌పై చర్యలకు రాహుల్ గాంధీ అడ్డుపడకుంటే తక్షణమే చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని అడ్డుకోవడం కోసం సోనియా కుటుంబం, కేసీఆర్ కుటుంబం ఏకమయ్యాయని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. బీఆర్ఎస్, కాంగ్రెస్.. ఎవరు అధికారంలో ఉంటే వారు మజ్లిస్‌ను ప్రసన్నం చేసుకుంటున్నారని ఆరోపించారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు ఈ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

# మార్చి నుండే!

## మహిళలకు రూ.2,500, పింఛన్ల పెంపు అప్పటినుండే..




# ఇది కదా శుభవార్త అంటే!!

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల పోరు కొనసాగుతోంది. ఈ మున్సిపల్ ఎన్నికల్లో అమీతుమీ తేల్చుకోవడానికి కాంగ్రెస్, బీఆర్ఎస్, బిజెపి నేతలు ప్రజాక్షేత్రంలోకి వెళ్తున్నారు. తమ పార్టీల కోసం ప్రజల మద్దతును కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇక ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రజలకు ఆరు హామీలను ఇచ్చి ఆ హామీలను నెరవేర్చలేదని బిజెపి, బిఆర్ఎస్ టార్గెట్ చేస్తున్నాయి.

**రేవంత్ రెడ్డి హామీలపై ప్రతిపక్షాలు టార్గెట్...** కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఏ ప్రాంతాలు అభివృద్ధి చెందలేదని, రేవంత్ రెడ్డి పాలన ఫెయిల్యూర్ పాలన అని పదేపదే ప్రజలకు చెప్పే ప్రయత్నం చేస్తున్నాయి. ముఖ్యంగా పింఛన్ల పెంపు నాలుగు వేల రూపాయలకు పెంచుతామని ఇచ్చిన హామీని, తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి మహిళకు 2500 రూపాయలను ఇస్తామన్న హామీని ప్రశ్నిస్తున్నాయి.

**ఏఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ కీలక వ్యాఖ్యలు...** కాంగ్రెస్ పార్టీ తరపున ప్రచారం చేస్తున్న వారు ప్రత్యర్థులను ఎదుర్కోవడానికి ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి అమలు చేస్తున్న పథకాలను గురించి చెబుతూనే, పెండింగ్ పథకాలను త్వరితగతిన అందిస్తామని హామీ ఇస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ఏఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు.

**సంపత్ కుమార్ చెప్పిందిదే...** పింఛన్ల పెంపు, మహిళలకు 2500 పథకాల పైన గద్వాల జిల్లా ఐజలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొన్న ఆయన మార్చి తర్వాత పింఛన్లను నాలుగు వేల రూపాయలకు పెంచుతామని, మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం రూ. 2500 ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వం వల్ల దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను సీఎం రేవంత్ రెడ్డి చక్కదిద్దుతున్నారని పేర్కొన్నారు.

**మహిళలకు ఆర్థిక సాయం, పెన్షన్ ల పెంపుపై తీపికబురు....** ఇప్పటికే ఉచిత బస్సు, ఇందిరమ్మ ఇళ్లు వంటి హామీలను అమలు చేశామని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇక తాజాగా మార్చి తర్వాత పింఛన్ల పెంపు జరుగుతుందని, మహిళలకు 2500 రూపాయలు ఆర్థిక సహాయం అందుతుందని ఆయన చేసిన ప్రకటన ఆసక్తికరంగా మారింది. మరి నిజంగానే కాంగ్రెస్ ప్రభుత్వం మార్చి తర్వాత వీటిని అమలు చేస్తుందా? లేదా అన్నది తెలియాల్సి ఉంది.




## హరీశ్‌రావుకు నిరసన సెగ.. డౌన్ డౌన్ అంటూ హోరెత్తిన నినాదాలు

సిద్దిపేట : గజ్వేల్ – ప్రజ్ఞాపూర్‌లోని ముంపు గ్రామాల్లో శనివారం మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి వెళ్లిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు నిరసన సెగ తగిలింది. హరీశ్ రావు రాకముందే.. ఆర్ అండ్ ఆర్ కాలనీ ముంపు గ్రామాల ప్రజలు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా నిరసనకారులు 'హరీశ్‌రావు డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. మరోవైపు బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా ప్రతి నినాదాలు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ముంపు గ్రామాల బాధితులు, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య పోటా పోటీ నినాదాలు కొనసాగాయి. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారి, ఇరువర్గాలు ఒకరిపై ఒకరు చెప్పులు విసురుకోవడంతో స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు.. ఇరువర్గాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు స్వల్పంగా లాఠీఛార్జ్ చేయడంతో ఉద్రిక్తత కొంతమేర తగ్గింది. ఈ పరిణామాల నేపథ్యంలో హరీశ్‌రావు.. గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లోనే నిలిచిపోయినట్లు సమాచారం. ప్రస్తుతం అక్కడ భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## కాంగ్రెస్‌ను ఓడించేందుకు భాజపా, బీఆర్ఎస్ చీకటి ఒప్పందం: సీఎం రేవంత్‌రెడ్డి



పరిగి: రెండేళ్ల ప్రజాపాలనలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. వికారాబాద్ జిల్లా పరిగిలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో సీఎం ప్రసంగించారు. "గత పాలకులు చేసిన తప్పులను సరిచేస్తూ పాలన కొనసాగిస్తున్నాం. రెండేళ్ల ప్రజాపాలనలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగిస్తున్నాం. అప్పులున్నా.. ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. ఎన్నికల్లో నిలబడి కొట్లాడాలి కానీ, చీకటి ఒప్పందాలు చేసుకొని ఫెవికాల్ బంధంతో భాజపా, బీఆర్ఎస్ పార్టీలు కాంగ్రెస్‌ను ఓడించాలని కుట్రలు చేస్తున్నాయి. బీఆర్ఎస్‌ను ప్రజలు బొందపెట్టారు. కాంగ్రెస్‌తో పోరాడటం మావల్ల కాదని భాజపాతో బీఆర్ఎస్ కలిసిపోయింది. భాజపా అభ్యర్థుల బీఫామ్‌లు బీఆర్ఎస్ పార్టీలో ఇచ్చే దుస్థితి ఏర్పడింది. స్థానిక సమస్యలు పరిష్కరించేందుకు బీఆర్ఎస్, భాజపా ప్రయత్నించలేదు. ప్రధాని మోదీని చూసి ఓటేయాలని భాజపా నేతలు అడుగుతున్నారు. పెళ్లి పెద్దను చూసి పిల్లను ఇస్తే.. పిల్లగాడు పనికి రాకపోతే ఏం చేయాలి?మోదీని చూసి ఓటేస్తే.. గల్లీ భాజపా నేతలు పనిచేయకపోతే మోదీని అడగలేము కదా? పదేళ్లలో సమస్యలు పరిష్కరించి ఉంటే బీఆర్ఎస్, భాజపా నేతలు వంగి వంగి దండాలు పెట్టాల్సిన పరిస్థితి ఉండేది కాదు. అడగకుండానే ప్రజలు ఓటేసేవారు. ఓట్లు కావాలి కానీ, ప్రజల సమస్యలను ఏనాడైనా పట్టించుకున్నారా? ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టు కోసం రూ.38వేల కోట్లతో నాటి సీఎం రాజశేఖర్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. కేసీఆర్ సీఎం అయ్యాక రంగారెడ్డి జిల్లాలోని ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారు.

తెలంగాణ ఉద్యమ నాయకుడినని చెప్పుకొని కేసీఆర్.. రంగారెడ్డి జిల్లాలకు గోదావరి జలాలను ఎందుకు అడ్డుకున్నారు. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం.. మూడేళ్లలో కూలేశ్వరం అయ్యింది. కాళేశ్వరం వల్ల కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు ఫామ్‌హౌస్ లు వచ్చాయి. గోదావరి జలాల ముసుగులో రూ.వేల కోట్లు కొల్లగొట్టి ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు. గోదావరి జలాలను తీసుకొచ్చి తాండూరు, పరిగి, వికారాబాద్, చేవెళ్ల ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే బాధ్యత మాది" అని సీఎం హామీ ఇచ్చారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి శ్రీధర్‌బాబు స్థానిక నేతలు సభలో పాల్గొన్నారు.

## హుస్నాబాద్ అభివృద్ధే లక్ష్యం: మంత్రి పొన్నం



సిద్దిపేట : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. శనివారం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్.. 3, 4, 15, 16 వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఈ సందర్భంగా ఓటర్లకు విజ్ఞప్తి చేశారాయన. ప్రచారంలో మంత్రి మాట్లాడుతూ.. తనను ఒకసారి ఎంపీగా ఎన్నుకుని పంపితే.. తెలంగాణ కోసం గొడవపడి ప్రత్యేక రాష్ట్రం తెచ్చిన వ్యక్తిగా ముఖ్యమంత్రి ప్రశంసిస్తున్నారని చెప్పారు. ఈ ఊరు ముఖం తెలియని వ్యక్తి కూడా ఇక్కడకు వచ్చి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 'నేను శాసనసభ్యుడిని.. నన్ను రారా, పోరా అంటున్నారు.. బిడ్డా! పొలిమేర కూడా దాటనివ్వను' అని పొన్నం హెచ్చరించారు. హుస్నాబాద్ అభివృద్ధిపై చర్చకు రావాలని ప్రత్యర్థులకు సవాల్ విసిరారు మంత్రి పొన్నం. సిద్దిపేట, వరంగల్‌ను మించి హుస్నాబాద్‌ను అభివృద్ధి చేయాలనే ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు. పదేళ్ల క్రితం తమ హయాంలోనే శాతవాహన యూనివర్సిటీ వచ్చిందని.. మళ్లీ పదేళ్ల తర్వాత ఇప్పుడు ఇంజినీరింగ్, లా కాలేజీలు వచ్చాయని పేర్కొన్నారు. హుస్నాబాద్‌కు కరీంనగర్‌తో తల్లి పేగు సంబంధం ఉందని, దానిని బలవంతంగా సిద్దిపేటలో కలిపారని విమర్శించారు. ఆనాడు సీఎం.. పీసీసీ హోదాలో హుస్నాబాద్‌ను మళ్లీ కరీంనగర్‌లో కలుపుతామని చెప్పారని, ఆ బాధ్యత తనదేనని అన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తిచేసి హుస్నాబాద్ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని ప్రకటించారని, కుర్చీలు వేసుకుని ఆ నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పి ఎందుకు కట్టలేదని ప్రశ్నించారు. ఏడాది క్రితం హుస్నాబాద్‌కు వచ్చినవారు ఇప్పుడు చూస్తే 'ఇది మా హుస్నాబాదేనా' అనేలా మార్పు తెచ్చామని మంత్రి చెప్పారు. హుస్నాబాద్ అభివృద్ధి కావాలనుకునే వారు.. కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి అభ్యర్థులను గెలిపించాలని మంత్రి ప్రభాకర్ కోరారు.

## కేంద్రంపై పిచ్చి ప్రేలాపనలు మానుకో.. సీఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి వార్నింగ్




హైదరాబాద్, ఫిబ్రవరి 7 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటరిచ్చారు. తమను విమర్శించే ముందు సీఎం రేవంత్ ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవు పలికారు. శనివారం కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. రేవంత్ తనను కల్వకుంట్ల కిషన్ రావు అని విమర్శించారని.. తానెలా కల్వకుంట్ల కిషన్ రావు అవుతాను? అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబాన్ని కాపాడాల్సిన అవసరం తనకు ఎందుకుంటుందని నిలదీశారు.

**పిచ్చి ప్రేలాపనలు చేయొద్దు..** పనికిరాని, పసలేని ఆరోపణలు చేయడం రేవంత్ రెడ్డికి బాగా అలవాటైందని కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. రేవంత్ చెత్త విమర్శలకు తాను చాలాసార్లు కౌంటరిచ్చానని అన్నారు. మళ్లీ మళ్లీ ఆయన పిచ్చి ప్రేలాపనలు చేయొద్దని.. ఈ విషయాన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కేంద్రంపై అనవసరంగా మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి నాడు ఇందిరాగాంధీని గెలిపిస్తే.. ఆ జిల్లా ప్రజలకు, తెలంగాణకు ఆమె ఏం చేశారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

**ప్రచారానికి పవన్ కల్యాణ్.?...** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక దేశంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని కిషన్ రెడ్డి వివరించారు. తమ ఎంపీలకు మోదీ సమ ప్రాధాన్యం ఇస్తారని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత కేంద్రం తెలంగాణకు ఏం చేసిందో చెబుతామని తెలిపారు. ఈ ఎన్నికల ప్రచారానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వచ్చే అంశంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉందని కిషన్ రెడ్డి తెలిపారు.




## విజయశాంతి రెడ్డి సూసైడ్ కేసు.. అసలు నిజాన్ని బయటపెట్టిన పోలీసులు..

హైదరాబాద్, ఫిబ్రవరి 7: హైదరాబాద్ శివారులోని చర్లపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో జరిగిన తల్లీపిల్లల సూసైడ్ కేసులో మిస్టరీ వీడింది. డిప్రెషన్‌తోనే విజయశాంతి రెడ్డి ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసుల విచారణలో నిర్ధారణ అయింది. కొన్నాళ్లుగా ఆమె మానసిక ఒత్తిడితో బాధపడుతున్నట్టు గుర్తించారు. ఈ కేసుపై మరింత లోతుగా విచారణ చేపట్టారు పోలీసులు. మొదటి నుంచీ పిల్లలు తల్లి మాట తూచా తప్పకుండా పాటించేవారని తెలుస్తోంది. పిల్లలపై ఉన్న ఆ కంట్రోల్‌తోనే విజయశాంతి రెడ్డి వారిని వెంట తీసుకెళ్లారు. తల్లి ఏం చెప్పినా చేసేందుకు సిద్ధమైన పిల్లలు.. ఆమెతో కలిసి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ ఘటనలో రెండో ఫోన్ వాడారనే ప్రచారంలో నిజం లేదని పోలీసులు తెలిపారు. చనిపోవడానికి ముందు వారం రోజుల కాల్ డేటాపై విచారణ జరిపిన పోలీసులు.. ఎలాంటి అనుమానాస్పద అంశాలూ లభించలేదని తేల్చారు. కాగా.. జనవరి 30న రాత్రి చర్లపల్లి– ఘట్‌కేసర్ మధ్య రైల్వే ట్రాక్‌లపై సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని విజయ శాంతి రెడ్డి (38), ఆమె కుమార్తె చేతన రెడ్డి (18), కుమారుడు విశాల్ రెడ్డి (17)లు గూడ్స్ రైలు కింద పడి మృతి చెందారు. ఘటనా స్థలంలో విజయశాంతి రెడ్డి కారులో సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తనకు జీవించాలని లేదని, పిల్లలను ఒంటరిగా వదలి వెళ్లలేను.. అంటూ రాశారు. ఈ కేసు విచారణలో భాగంగా విజయ ఫోన్, ల్యాప్‌టాప్‌లను ఫోరెన్సిక్ అనాలిసిస్‌కు పంపించారు. చివరకు డిప్రెషన్‌తోనే ఆమె తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.




హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్‌లో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ల్యాబ్ భవనం మొదటి అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో దట్టమైన పొగ అలుముకుంది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులు ఘటనాస్థలికి చేరుకుని, రెండు ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపుచేసే ప్రయత్నం చేస్తున్నారు. ఆ ప్రాంతమంతా పొగలు కమ్ముకోవడంతో సహాయ చర్యలకు తీవ్ర అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అగ్నిమాపక సిబ్బంది ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, ఘటనపై పూర్తి వివరాలను దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేదు. పోలీసులు ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ, ఎవరినీ ల్యాబ్ లోపలికి వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. కాగా.. ఉదయం 10:00 గంటల ప్రాంతంలో మొదటి ఫ్లోర్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో మంటలు చెలరేగాయి. దీంతో ఆ ఫ్లోర్‌లోని కంప్యూటర్లు, ఫోరెన్సిక్ సంబంధిత కెమికల్స్‌తో సహా కీలకమైన పత్రాలు కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనలో పలు ముఖ్యమైన కేసులకు సంబంధించిన ఫోరెన్సిక్ రిపోర్టులు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ మంటల్లో ఫోన్ ట్యాపింగ్‌కు కేసుకు సంబంధించిన హార్డ్ డిస్కులూ కాలిపోయినట్లు సమాచారం.

## కాంగ్రెస్, బీజేపీలను నమ్మొద్దు: హరీశ్‌రావు



సిద్దిపేట జిల్లా, ఫిబ్రవరి 7 : కాంగ్రెస్, బీజేపీలపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. రెండున్నరేళ్లలో గజ్వేల్ అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదని ఆయన ఫైర్ అయ్యారు. శనివారం గజ్వేల్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో హరీశ్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో గజ్వేల్ రోడ్డుకు గుంతలు కూడా పూడ్చలేదని విమర్శించారు. కేసీఆర్ హయాంలోనే గజ్వేల్‌ని అభివృద్ధి చేశామని.. కాంగ్రెస్ చేసిందేమీ లేదని ఆక్షేపించారు.

**భూముల ధరలు పెరిగాయి..** నిన్న ఓ బీజేపీ ఎంపీ గజ్వేల్‌కు వచ్చి కేసీఆర్ హయాంలో రూ.50వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని.. మిషన్ కాకతీయ గురించి నోటికొచ్చినట్లు మాట్లాడారని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చాక గజ్వేల్‌లో భూముల ధరలు పెరిగాయని.. కానీ రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక బంగారం ధర పెరిగి, భూముల ధరలు పడిపోయాయని ఎద్దేవా చేశారు. మొత్తం తెలంగాణను కేసీఆర్ బ్రహ్మాండంగా అభివృద్ధి చేశారని.. రెండేళ్ల పాలనలో రేవంత్ రెడ్డి ఏం చేశారని ప్రశ్నించారు.

**బీజేపీ ప్రభుత్వంలో పాల ధరలు, జీఎస్టీలు పెరిగాయి..** కేసీఆర్ హయాంలో కట్టిన బిల్డింగ్‌లకు రేవంత్‌రెడ్డి ఇప్పుడు రిబ్బన్ కటింగ్‌లు చేస్తున్నారని, బీఆర్ఎస్ ఇచ్చిన పథకాలనే ప్రారంభించారని హరీశ్‌రావు సెటైర్లు గుప్పించారు. బీజేపీ ప్రభుత్వం పాల ధరలు, జీఎస్టీలు పెంచింది తప్ప.. చేసిందేమీలేదని విమర్శించారు.

ఎన్నికలు వస్తే పైసలు బాగా పంచుతారని ఎద్దేవా చేశారు. కరోనా సమయంలో ప్రజా సమస్యలను తాను పరిష్కరించానని.. బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఏమీ చేయలేదని చెప్పుకొచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎవరెన్ని పైసలిచ్చినా, కాళ్లు మొక్కినా సరే.. బీఆర్ఎస్ అభ్యర్థులకే ఓటువేయాలని ఈ సందర్భంగా హరీశ్‌రావు పిలుపునిచ్చారు.

## జూబ్లీహిల్స్ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల బ్రోచర్ విడుదల



హైదరాబాద్: జూబ్లీహిల్స్‌లోని తితిదే వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు విడుదల చేశారు. ఆలయ ఆరో బ్రహ్మోత్సవాలు ఈ నెల 17 నుంచి 25 వరకు జరుగుతాయని చెప్పారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించి.. జరుగుతున్న పనులపై ఆరాతీశారు. నగరంలో ఉన్న భక్తులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. తితిదే తరఫున సహాయ సహకారాలు జూబ్లీహిల్స్ వేంకటేశ్వర స్వామి ఆలయానికి అందిస్తామని వెల్లడించారు.




## ప్రియురాలి నోట్లో పురుగుల మందు పోసిన ప్రియుడు

విజయవాడ, ఫిబ్రవరి 7: విజయవాడలోని అజిత్‌సింగ్ నగర్‌లో దారుణం జరిగింది. ప్రియురాలిపై అనుమానం పెంచుకున్న ప్రియుడు.. ఆమె నోట్లో పురుగుల మందు పోశాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. ప్రస్తుతం.. బాధిత యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. గతేడాది ఏప్రిల్‌లో ఆ యువతికి వేరే వ్యక్తితో వివాహం జరిగింది. అయితే భవానీ శంకర్ అనే వ్యక్తి.. ఆమెను ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డాడు. ఆమె అంగీకరించకపోవడంతో అతడు.. ఆమె భర్తకు అనుమానాలు కలిగేలా గొడవలు సృష్టించాడు. దీంతో సదరు యువతి భర్తకు దూరంగా ఉంటోంది. ఈ క్రమంలో యువతిని 'పెళ్లి చేసుకుంటాను' అని నమ్మించి తన గదికి తీసుకొచ్చాడు భవానీ శంకర్. అక్కడ ఆమె మహేశ్ అనే వ్యక్తితో తరచూ ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు తెలుసుకున్నాడు. ఈ విషయంపై ఆమెతో వాగ్వాదానికి దిగాడు. ఆగ్రహంతో ఊగిపోయిన శంకర్.. యువతి నోట్లో బలవంతంగా పురుగుల మందు పోశాడు. ఆ తర్వాత అతనే ఆమెను ఆసుపత్రిలో చేర్పించి.. అక్కడి నుంచి పరారయ్యాడు. బాధిత యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్ నగర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు భవానీ శంకర్‌ను పట్టుకునేందుకు పోలీసులు గాలిస్తున్నారు.


చురకలు



# నిజాం లొంగుబాటు లో కె ఎం. మున్షీ అసమాన ప్రతిభ

## – ఫిబ్రవరి 8...కె. ఎం. మున్షీ వర్థంతి

నిజాం కబంధ హస్తాల నుండి హైదరబాదు సంస్థానం విముక్తి పొందడానికి ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయి పటేల్ ఉక్కు సంకల్పం గురించి తెలియని తెలంగాణ వారుండరు. తెలంగాణ విమోచన లేదా విలీన ప్రక్రియ వెనక మరో మేధావి, కార్యసాధకుని అకుంఠిత కృషి గురించి చాలా మందికి తెలియదు. ఆయనే కె. ఎం. మున్షీ. బ్రిటీష్ పాలకులు స్వాతంత్ర్యం ఇచ్చిన సమయంలో ... మూడు సంస్థానాలు ఇండియాలో కలవలేదు. అవి కాశ్మీర్, జునాఘడ్, హైదరాబాద్ (నైజాం). ఆ పరిస్థితు ల్లో ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్... ప్రత్యేక శ్రద్ధ పెట్టి... జునా ఘడ్ సంస్థానాన్ని భారత్‌లో కలిసేలా చేశారు. నైజాం నవాబ్ మాత్రం విలీనానికి ఒప్పుకోలేదు. అప్పట్లో రాజాకార్ల పేరుతో ప్రత్యేక సైన్యాన్ని తయారుచేసిన ఖాసిం రజ్వీ... మారణకాండకు తెగ బడ్డారు. ఈ క్రమం లోనే "ఆపరేషన్ పోలో," పేరుతో నాటి భారత హోం మంత్రి, ఉక్కు మనిషి సర్దార్ పటేల్ నేతృత్వంలో " పోలీసు చర్య" చేపట్టడం జరిగింది. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, కె. ఎం. మున్షీకి హైదరాబాద్ రాచరిక రాష్ట్రంలో ట్రేడ్ ఏజెంట్ (ఏజెంట్-జనరల్) పదవి ఇవ్వ బడింది. మున్షీ జనవరి 5, 1948న హైదరాబాద్‌కు రావడంతో హైదరాబాద్ స్టేట్ రిసెప్షన్ మరియు బోలారమ్‌లోని ఇండియన్ ఆర్మీ యూనిట్ల గౌరవ గార్డుతో ఘనంగా జరిగింది. ఈ సమయంలో నిజాం తన రాష్ట్రాన్ని ఇండియన్ యూనియన్ నుండి స్వతంత్రంగా ఉంచడానికి ప్రయత్ని స్తున్నాడు, సహాయం కోసం కొత్తగా సృష్టించబడిన పాకిస్తాన్‌కు రహస్య సంకేతాలను కూడా పంపాడు. ఇటువంటి కుట్రలు భారత యూని యన్‌కు ఎదురయ్యే అనివార్యమైన ప్రమాదాన్ని తెలుసుకున్న డాక్టర్ మున్షీ, నిజాం చేస్తున్న చర్యల గురించి సర్దార్ పటేల్‌కు తెలియ జేసేవారు. భారత గూఢచార దళం అంత పటిష్టంగా లేక. నిజాం సైనిక దళాలను గురించి సరైన అంచనా వేయలేక పోయారు. ఈ పనిని ఏజెంట్ "జనరల్ కే.ఎం. మున్షీ" సుగమం చేశారు. వారు, హైదరా బాద్ సైన్యంలోని ఒక అధికారిని లోబరచుకొన్నారు. అతని ద్వారా హైదరాబాద్ సైన్యపు వివరాలను స్పష్టంగానూ – ఖచ్చితంగానూ తెలిశాయి. ఈ సమాచారం భారత సైన్యానికి ఎంతో ఉపకరించింది. అంతే కాదు "జే.ఎన్. చౌదరి"కి హైదరాబాద్ సునాయాసంగా జయించగలం అన్న సంపూర్ణ విశ్వాసం ఏర్పడింది. కె.ఎం. మున్షీ స్వాతంత్ర్య సమరయోధుడు, రాజకీయవేత్త మరియు భారతీయ విద్యాభవన్ స్థాపకుడు ప్రజాదరణ పొందిన నవలా రచయిత. కన్నయలాల్ మాణిక్‌లాల్ మున్షీ (డిసెంబరు 30, 1887 – ఫిబ్రవరి 8, 1971) డిసెంబరు 30, 1887న ఇప్పటి గుజరాత్ రాష్ట్రంలోని బారుచ్‌లో జన్మించారు. బారుచ్, వడోదరలలో అభ్యసించి జాతీయో ద్యమంలో ప్రవేశించారు. 1937లో బొంబాయి రాష్ట్ర మంత్రిగా పదవి నిర్వహించారు. అంబేద్కర్ అధ్యక్షతన భారత రాజ్యాంగాన్ని రూపొందించిన కమిటీలో సభ్యుని గా మున్షీ డా. అంబేద్కర్‌తో కలిసి 'ప్రాథమిక హక్కుల' సూత్రాన్ని వ్యక్తీకరించిన ముసాయిదాను సంయుక్తంగా రాయడం ద్వారా తన ముద్రను వేశారు. సంస్థానాల విలీనీకరణ సమయం లో మొండికేసిన హైదరాబాదు నిజాంపై చర్యలు తీసుకోవడానికి భారతప్రభుత్వ దూతగా వచ్చిన మున్షీ సమస్యను చక్కగా పరిష్కరించి ప్రసిద్ధి చెందారు. భారత రాజ్యాంగ రచనలో కూడా భాగస్వాము లైనారు. ఆ తర్వాత జవహార్‌లాల్ నెహ్రూ




మంత్రివర్గం లో ఆహార,వ్యవసాయ శాఖ మంత్రిగా, ఉత్తరప్రదేశ్ గవర్నరుగా పని చేశారు. చివరి దశలో కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చి రాజగోపాల చారితో కల్సి స్వతంత్రపార్టీని స్థాపించారు. సాహితీవేత్తగా రాణిస్తూ భారతీయ విద్యాభవన్‌ను ప్రారంభించారు. 1948 ఫిబ్రవరిలో నిజాం ప్రభుత్వాన్ని హస్తగతం చేసు కోవడానికి ప్రణాళికకు "పోలో" అని నామకరణం చేశారు. హైదరాబాద్ "పోలో" అనే ఒక క్రీడకు ప్రసిద్ధి. అందువల్ల దానికి "పోలో" ఆటలా సైనిక చర్య జరుపుతామని ఆ పేరు పెట్టారు. 1948 జూలై నెల చివరికంతా "ఆపరేషన్ పోలో" ఏర్పాట్లు – ప్రణాళిక సర్వమూ సిద్ధమ య్యాయి. 22వేల సైన్యానికి 22 రోజులకు సరిపడా ఆహార పదార్థాలు సిద్ధమయ్యాయి. మేజర్ "జనరల్ జయంత్ నాథ్ చౌదరి" ఈ సైనిక చర్య నిర్వహణ కోసం ప్రత్యేకంగా నియమితులయ్యారు. పోలీసు చర్య ఐదు రోజుల్లో ముగిసింది. భారత సైన్యం 10 మంది సైనికులను కోల్పోయింది. 1373 మంది రజాకార్లు హతమయ్యారు. మరో 1911 మంది బందీలుగా పట్టుబడ్డారు. హైదరాబాదు సైన్యంలో 807 మంది చనిపోగా, 1647 మంది పట్టు బడ్డారు. తాను ఓటమి అంచుల్లో ఉ న్నట్లు గమనించి నిజాం నవాబు దిక్కుతోచని స్థితిలో లేక్‌వ్యూ అతిథి గృహంలో బంధించిన భారత ఏజెంట్ మున్షీని కలిసి లొంగిపోతున్నట్లు ప్రకటించాడు. దీనితో ఆపరేషన్ పోలో విజయవంతమైంది. సెప్టెంబర్ 13న జె.ఎన్.చౌదరి నాయకత్వాన ప్రారంభమైన దాడి సెప్టెంబర్ 17న నిజాం నవాబు లొంగిపోవడంతో పూర్తయింది. ఆతని ప్రధానమంత్రి మీర్ లాయిక్ ఆలీ, రజాకార్ల నాయకుడు ఖాసిం రజ్వీ అరెస్టయ్యారు. సెప్టెంబర్ 23న భద్రతా సమితిలో తన ఫిర్యాదును నిజాము ఉపసంహరించు కున్నాడు. హైదరాబాదు భారతదేశంలో విలీనం అయినట్లుగా ప్రకటించాడు. మున్షీ 56 గ్రంథాలను రాశారు. వెర్ని వసూలత్, స్నేహసంభ్రమ, భగ్న పాదుక, తపస్విని ఈ నవలలను మన దేశ భాషలకే కాక ఇతర దేశ భాషల్లోకి అనువదించారు. కాంగ్రెస్ పార్టీలో సర్దార్ వల్లభాయ్ పటేల్ , మహాత్మగాంధీ, జవహర్ లాల్ నెహ్రూ లాంటి ప్రముఖుల అభిమానాన్ని చూరగొన్నారు. 1971ఫిబ్రవరి 8న మరణించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# కాశ్మీర్ ని మళ్ళీ కెలుకుతున్న పాక్-మధ్యలోకి ఐక్య రాజ్యసమితి




దాయాది పాక్ కి బుద్ధి మారదు అని అందరికీ తెలిసిందే. ఆ దేశం ఆకలితో దరిద్రంతో మట్టికొట్టుకునిపోయినా భారత్ మీద తన అక్కసు వెళ్లగక్కుతూనే ఉంటుంది. వేయ్యేళ్ళు భారత్ మీద అలుపెరగని యుద్ధం చేస్తామని ప్రకటించిన పాక్ నుంచి ఏమీ ఆశించకుండా ఉండడమే మేలు. ఆపరేషన్ సింధూర్ తో గత ఏడాది దారుణంగా దెబ్బ తిన్నా కూడా భారత్ మీద తన ఉక్రోషం అలా వ్యక్తం చేస్తూనే ఉంది. లేటెస్ట్ గా కాశ్మీర్ ని మరోసారి పాక్ కెలికింది.

**సంఘీభావ దినోత్సవం :** కాశ్మీర్ సంఘీభావ దినోత్సవం అని పాక్ నిర్వహించింది. ఇది తనకు తానుగా పాక్ పెట్టుకుని 1990 నుంచి నిర్వహిస్తున్న దినోత్సవం. కాశ్మీర్ సంఘీభావ దినోత్సవం అనేది ఇలా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 5న పాకిస్తాన్‌లో పాటించే ఒక జాతీయ సెలవుదినంగా ఉంది. భారత పరిపాలనలో ఉన్న జమ్మూ కాశ్మీర్ ప్రజలకు భారతదేశం నుండి విడిపోవడానికి ప్రయత్నిస్తున్న కాశ్మీరీ వేర్పాటువాదులకు పాకిస్తాన్ తన మద్దతును సంఘీభావాన్ని తెలియజేయడానికి ఈ రోజుని నిర్వహిస్తోంది. అలాగే ఈ సంఘర్షణలో మరణించిన కాశ్మీరీలకు నివాళు లర్పించడానికి దీనిని పాటిస్తారు. పాకిస్తాన్ పరిపాలనలో ఉన్న ఆజాద్ జమ్మూ కాశ్మీర్ భూభాగంలో సంఘీభావ ర్యాలీలు నిర్వహిస్తారు. తొలిసారిగా అపుడు : ఇక కాశ్మీర్ సంఘీభావ దినోత్సవాన్ని మొదటిసారిగా 1990లో జమాతే ఇస్లామీ పాకిస్తాన్‌కు చెందిన ఖాజీ హుస్సేన్ అహ్మద్ ప్రతిపాదించారు. దీనికి నాటి పాక్ పాలకుడు నవాజ్ షరీఫ్ మద్దతు ఇచ్చారు. షరీఫ్ అంతకు ముందు సంవత్సరంలో జమాత్ సహాయంతో అధికారంలోకి వచ్చారు ఈ ఒక్కటే కాదు జనవరి 19వ తేదీని పాక్ జమ్మూ కాశ్మీర్ వలస దినోత్సవంగా నిర్వహిస్తోంది. జూలై 13 వ తేదీని కాశ్మీర్ అమరవీరుల దినోత్సవంగా నిర్వహిస్తోంది.

**పాక్ వివాదాస్పద వ్యాఖ్యలు :** ఇక ఈ సందర్భంగా కాశ్మీర్ వివాదంపై పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ వివాదాస్పదమైన వ్యాఖ్యలే చేశారు. కాశ్మీర్ ని ఏకంగా తమ దేశంలో అంతర్భాగంగా ఆయన ప్రకటించారు. ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకుని . కాశ్మీర్ అంశాన్ని పరిష్కరించాలని ఆయన కోరారు. అప్పటిదాకా దక్షిణాసియాలో శాంతి అన్న మాటకు అర్థం లేదని అన్నారు. కాశ్మీర్ పేరుతో భారత్ ఉగ్రవాదాన్ని ఎగదోస్తోందంటూ దారుణమైన వ్యాఖ్యలనే షరీఫ్ చేయడం విశేషం.

**పాక్ సైన్యాధిపతి సైతం :** ప్రధాని ఈ విధంగా మంటెక్కించేలా మాట్లాడితే పాకిస్థాన్ సైన్యాధిపతి ఆసిమ్ మునీర్ ఊరుకుంటారా. ఆయన ఇంకా గట్టిగా మాట్లాడుతున్నారు. ఎప్పటికైనా కాశ్మీర్ తమ దేశంలో అంతర్భాగం అవుతుందని ఆయన కూడా అంటున్నారు. ప్రాంతీయ అస్థిరతకు కాశ్మీర్ ఒక కారణం అని ఆయన అంటూ భారత్ ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు కాశ్మీర్ పాకిస్థాన్ విదేశాంగ విధానంలో భాగంగా ఉందని కూడా ఆసిమ్ మునీర్ చెప్పుకున్నారు.

**మద్దతు ఎప్పుడూ ఉంటుందని :** కాశ్మీరీలకు తమ దేశం తరఫున నైతిక, రాజకీయ, దౌత్యపరమైన మద్దతు ఎప్పుడూ ఉంటుందని ఆసిమ్ మునీర్ ప్రకటించారు. భారత సైనియం కాశ్మీరీలను అణచివేస్తోంది అని ఆయన ఆరోపిస్తున్నారు. మానవ హక్కుల ఉల్లంఘన అని పెద్ద మాటలే వాడారు, భారత్ మీద అంతర్జాతీయ సమాజం ఒత్తిడి పెంచే కాశ్మీర్ విషయంలో పరిష్కారం చూపాలని ఆయన కోరడం మరో విశేషం. మొత్తానికి భారత్ ని మళ్ళీ కెలకాలని పాక్ నిర్ణయించుకున్నట్లుగా ఉంది.

# విద్యా రంగానికి జకీర్ హుస్సేన్ విశిష్ఠ సేవలు

## ఫిబ్రవరి 8... దివంగత రాష్ట్రపతి జకీర్ హుస్సేన్ జయంతి



భారత దేశపు మొదటి ముస్లిం రాష్ట్రపతి, పదవిలో మరణించిన మొదటి భారత దేశ ప్రథమ పౌరులు జాకీర్ హుస్సేన్ (ఫిబ్రవరి 8, 1897 – మే 3, 1969). ఆయన మే 13 1967 నుండి మరణించినంత వరకు రాష్ట్రపతి పదవిలో ఉన్నారు. భారత 3వ రాష్ట్రపతి జాకీర్ హుసేన్ హైదరాబాదు (భారత దేశం)లో జన్మించారు. ఇతని తండ్రి పఖ్తూన్ జాతికి చెందిన వారు. అయన హైదరాబాదు నుండి ఉత్తరప్రదేశ్ లోని ఫరూఖాబాద్ జిల్లా ఖాయిమ్ గంజ్ కు వలస వచ్చారు. హుస్సేన్ ప్రారంభ ప్రాథమిక విద్య హైదరాబాద్‌లో పూర్తయింది. హుసేన్ ఇటావా (ఉత్తరప్రదేశ్) లోని 'ఇస్లామియా ఉన్నత పాఠశాల' లో చదువుకున్నారు. లక్నో విశ్వ విద్యాలయం క్రిస్టియన్ డిగ్రీ కాలేజీ నుండి ఎకనామిక్స్ లో పట్టభద్రు డయ్యారు. ఉన్నతవిద్య అలీఘర్ లోని ఆంగ్లో మహమ్మడన్ ఓరియంటల్ కాలేజిలో అభ్యసించారు. ఇచట విద్యార్థి సంఘ నాయకునిగా గుర్తింప బడ్డారు. 18 సంవత్సరాల వయస్సులో, అయన షాజహాన్ బేగంను వివాహం చేసుకున్నారు. జాకీర్ హుస్సేన్ 23 సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడు, విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందంతో అయన నేషనల్ ముస్లిం విశ్వ విద్యాలయాన్ని స్థాపించారు. మొదట అలీఘర్లో 1920 అక్టోబర్ 29 శుక్రవారం స్థాపించ బడింది, తరువాత 1925 లో న్యూ ఢిల్లీ లోని కరోల్ బాగ్ కు మార్చబడింది. తరువాత మార్చి 1, 1935 న న్యూ ఢిల్లీలోని జామియా నగర్ కు మళ్లీ మార్చ బడింది. దీనికి జామియా మిలియా ఇస్లామియా (కేంద్ర విశ్వ విద్యాలయం) అని పేరు పెట్టారు. జాకీర్ విత్తశాస్త్రంలో పి. హెచ్.డి. చేసేందుకు, 'బెర్లిన్ విశ్వ విద్యాలయానికి (జర్మనీ) వెళ్ళారు. 1926 లో బెర్లిన్ విశ్వ విద్యాలయం నుండి ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్ పొందారు. జర్మనీలో ఉన్నప్పుడు గాలిబ్ (1797–1868) జీవితగాథ, కవితా సంగ్రహాలను క్రోడీకరించారు. 1927 లో మూసివేతను ఎదుర్కొంటున్న జామియా మిలియా ఇస్లామియాకు నాయకత్వం వహించడానికి అతను భారత దేశానికి తిరిగి వచ్చాడు. భారత దేశానికి తిరిగి వచ్చి, జామియా మిల్లియా ఇస్లామియాకు ఇరవై ఒక్క సంవత్సరాలు ఆయన పదవిలో కొనసాగారు. మార్గ దర్శకులుగా మారారు. ముహమ్మద్ ఆంగ్లో ఓరియంటల్ కళాశాల (ఇప్పుడు అలీఘర్ ముస్లిం విశ్వ విద్యాలయం) వ్యవహారాల్లో ముఖ్యంగా చురుకుగా ఉన్నారు. మహమ్మద్ అలీ జిన్నా వంటి రాజకీయ ప్రత్యర్థుల ప్రశంసలను పొందారు. బ్రిటిష్ వారితో పోరాటానికి, మహాత్మా గాంధీతో చేతులు కలిపి, "బేసిక్ విద్య" పై కఠోర పరిశ్రమ చేశారు. భారతదేశంలో విద్యాభ్యుదయానికి శ్రమించారు. ఈ కాలంలో హుసేన్ ఉత్తమ దార్శనికుడిగా, భారత విద్యా విభాగ మార్గదర్శకునిగా గుర్తింపు పొందారు. తమ రాజకీయ ప్రత్యర్థియైన మహమ్మద్ అలీ జిన్నా చేత కూడా పొగడ బడ్డారు. తన వ్యక్తిగత సంపదనంతా భారతదేశానికి ధారబోసిన దేశ భక్తులు. భారత స్వాతంత్ర్యం తరువాత, అలీఘర్ ముస్లిం యూనివర్శిటి వైస్ ఛాన్సలర్ పదవిని అంగీకరించారు. స్వాతంత్ర్యం వచ్చిన ప్రథమ దశలో విద్యార్థుల ఉద్యమాలను, ముఖ్యంగా అలీఘర్ లో, అదుపులో ఉంచుటకు, అయన నియామకం ఎంతో ఉపయోగ పడింది. వైస్ ఛాన్సలర్ పదవీకాలం ముగిసిన తరువాత 1956 లో పార్లమెంటు సభ్యునిగా నామినేట్ చేయ బడ్డారు. 1957 లో బీహారు గవర్నరుగా నియమింప బడి, పార్లమెంటుకు రాజీనామా చేశారు. బీహారు గవర్నరుగా 1957 నుండి 1962 వరకు సేవలందించిన తరువాత 1962 నుండి 1967 వరకు భారత ఉప రాష్ట్రపతి పదవిని అలంకరించారు. తదనంతరం మే 13 1967 న భారత రాష్ట్రపతిగా ఎన్నుకో బడ్డారు. అయన ప్రథమ ఉపన్యాసంలో "మొత్తం భారత దేశం నా ఇల్లు, ప్రజలందరూ నా కుటుంబం" అని పేర్కొన్నారు. తన అధ్యక్ష పదవీ కాలంలో, హుస్సేన్ హంగరీ, యుగోస్లేవియా, యుఎస్ఎస్ఆర్ మరియు నేపాల్ లకు నాలుగు దేశాలకు పర్యటించారు. 1969 మే 3 న అయన మరణించగా, న్యూ ఢిల్లీ లోని జామియా మిలియా ఇస్లామియా క్యాంపస్‌లో ఖననం చేశారు. అత్యల్పకాలం రాష్ట్రపతి పదవి నిర్వహించిన మొదటి వ్యక్తి. రాష్ట్రపతి పదవిలో ఉండగా మరణించిన మొదటి వ్యక్తి కూడా ఆయనే. (ఇప్పటి వరకు ఇద్దరు రాష్ట్రపతులు పదవిలో ఉండగా మరణించారు – డా.జాకీర్ హుస్సేన్, ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ ). ఈయన చేసిన సేవలకు కేంద్ర ప్రభుత్వం 1963 లో 'భారతరత్న' పురస్కారాన్ని అందించింది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# ఏడాదిలో సాఫ్ట్‌వేర్ జాబ్‌లు మాయమవుతాయా?

సాఫ్ట్‌వేర్ రంగం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒక భారీ కుదుపుకు లోనవుతోంది. ఇప్పటివరకు ఆటోమేషన్, క్లౌడ్ టెక్నాలజీ వంటి మార్పులను చూసిన ఈ రంగం.. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రూపంలో అసలైన సవాలును ఎదుర్కోబోతోంది. తాజాగా ప్రముఖ ఏఐ సంస్థ ఆంత్రోపిక్ సీఈవో డారియో అమోడై చేసిన వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా ఐటీ నిపుణులను, ఇన్వెస్టర్లను ఉలిక్కిపడేలా చేస్తున్నాయి. 6 నుండి 12 నెలల్లోనే 'ఏఐ' ఇంజినీర్లు! డారియో అమోడై అంచనా ప్రకారం.. రాబోయే 6 నుంచి 12 నెలల్లోనే మానవ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల స్థానాన్ని భర్తీ చేయగల అత్యంత శక్తివంతమైన ఏఐ మోడల్స్ అందుబాటులోకి రానున్నాయి. ఇది కేవలం కోడింగ్ రాయడానికే పరిమితం కాదని ఆయన స్పష్టం చేశారు. ఒక ప్రాజెక్ట్‌కు సంబంధించి సాఫ్ట్‌వేర్ డిజైన్ చేయడం.. బగ్స్‌ను తప్పులను గుర్తించి సరిచేయడం.. టెస్టింగ్ , డిప్లాయ్‌మెంట్, నిరంతర మెయింటెనెన్స్ సహా ఈ పనులన్నింటినీ ఒకే ఒక ఏఐ ఏజెంట్ పూర్తి చేయగల స్థాయికి సాంకేతికత చేరుకుందని ఆయన పేర్కొన్నారు. ఇది కార్యరూపం దాల్చితే ఐటీ కంపెనీల పనితీరు పూర్తిగా మారిపోనుంది. కుదేలవుతున్న ఇండియన్ ఐటీ స్టాక్స్ ఆంత్రోపిక్ విడుదల చేసిన కొత్త ఏఐ ఏజెంట్ డెమో ప్రభావం భారతీయ స్టాక్ మార్కెట్‌పై స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా భారతీయ ఐటీ దిగ్గజాల భవిష్యత్తుపై ఇన్వెస్టర్లలో ఆందోళన మొదలైంది. "కోడింగ్ చేసే పనిని ఏఐ తక్కువ



ధరకే పూర్తి చేస్తే లక్షలాది మంది ఉద్యోగులున్న ఐటీ కంపెనీల పరిస్థితి ఏమిటి?" అన్న భయం మార్కెట్‌ను వెంటాడుతోంది. ముఖ్యంగా ఫ్రెషర్స్ ఎక్కువగా చేరే సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, మాన్యువల్ టెస్టింగ్, సపోర్ట్ విభాగాల్లో ఉద్యోగ కోత తప్పదని నిపుణులు విశ్లేషిస్తున్నారు. రాబోయే ఐదేళ్లలో ఎంట్రీ లెవెల్ వైట్‌కాలర్ ఉద్యోగాల్లో 50% కనుమరుగయ్యే ప్రమాదం ఉందని అమోడై హెచ్చరించారు. ముగింపు కాదు.. పరివర్తన! అయితే ఈ మార్పును ఒక ముగింపుగా చూడలేమని డారియో అమోడై అభిప్రాయపడ్డారు. పారిశ్రామిక విప్లవం వచ్చినప్పుడు శారీరక శ్రమ తగ్గినట్లే ఇప్పుడు ఏఐ వల్ల యాంత్రికమైన కోడింగ్ పని తగ్గుతుందని ఆయన విశ్లేషించారు. కేవలం కోడ్ టైప్ చేసేవారికంటే సమస్యను విశ్లేషించి పరిష్కారం కనుగొనే ఇంజినీర్లకు డిమాండ్ పెరుగుతుంది.ఏఐ మోడల్స్‌ను శిక్షణ ఇవ్వడం, సిస్టమ్ ఆర్కిటెక్చర్ రూపొందించడం వంటి విభాగాల్లో కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయి. యువత ఏం చేయాలి? మారుతున్న కాలానికి అనుగుణంగా భారతీయ యువత తమను తాము సిద్ధం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఏఐని శత్రువుగా కాకుండా ఒక శక్తివంతమైన టూల్‌గా వాడుకోవడం నేర్చుకోవాలి. ఒకే ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌కు పరిమితం కాకుండా డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్‌పై పట్టు సాధించాలి. మెషిన్ చేయలేని 'ఆలోచన'ను, సృజనాత్మకతను పదును పెట్టుకోవాలి. డారియో అమోడై వ్యాఖ్యలు ఒక హెచ్చరిక మాత్రమే కాదు.. ఒక కొత్త యుగానికి నాంది. పాత పద్ధతులకు స్వస్తి పలికి, ఏఐతో జతకట్టిన వారే ఈ భవిష్యత్ ఐటీ యుద్ధంలో విజేతలుగా నిలుస్తారు.

# ఏమిటీ బ్లూటూత్ ట్రెండ్..

## హనీమూన్ స్పాట్ కాస్తా హెచ్ ఐవీ సెంటర్

ఫిజీ.. పసిఫిక్ దేశంగా మాత్రమే కాదు పాపులర్ హనీమూన్ స్పాట్ కు కేరాఫ్ అడ్రస్ గా చెప్పేవారు. కొత్తగా వైవాహిక జీవితాన్ని స్టార్ట్ చేసినోళ్లు.. ఈ పాపులర్ టూరిస్టు స్పాట్ కు వెళ్లి కొన్ని రోజులు గడిపితే.. ఆ ఆనందమే వేరుగా చెప్పేశారు. నేచర్ ఒడిలో ఎంజాయ్ చేసే రోజులు జీవితంలో ఇస్పెషల్ గా మారతాయన్న భావన ఉండేది. అయితే.. ఇటీవల కాలంలో చోటు చేసుకుంటున్న పరిణామాలతో ఇప్పటివరకు పాపులర్ హనీమూన్ స్పాట్ గా ఉన్న ఫిజీ కాస్తా ఇప్పుడు హెచ్ ఐవీకి కేరాఫ్ అడ్రస్ గా చెబుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ రిపోర్టు.. అంతర్జాతీయ మీడియా రిపోర్టు ఆధారంగా చూస్తే.. 2024లో ఫిజీలో 1583 హెచ్ఐవీ కేసులు నమోదయ్యాయి. 2025 తొలి ఆర్నెల్లలో 1226 కేసులు వెలుగు చూడటం



గమనార్హం. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే రెట్టింపు సంఖ్యలో కేసులు నమోదు కావటం గమనార్హం. దీనికి బ్లూటూత్ ట్రెండ్ కూడా కారణమంటున్నారు. హెచ్ఐవీ కేసులు పెరిగిపోవటానికి ఈ పాడు ట్రెండ్ కూడా ఒక ప్రధాన కారణంగా పేర్కొంటున్నారు. డ్రగ్స్ కొనుక్కునేందుకు డబ్బులు లేని వాళ్లు.. అప్పటికే డ్రగ్స్ కిక్కులో మునిగితేలుతున్న వారి రక్తాన్ని తీసుకొని.. తమ ఒంట్లో ఎక్కించుకోవటమే ఈ బ్లూటూత్ ట్రెండ్ గా చెబుతున్నారు. ఎలా అయితే డేటాను ఒక ఫోన్ నుంచి మరో ఫోన్ లోకి ఎలా అయితే బదిలీ చేస్తారో.. అదే రీతిలో ఈ మత్తును ట్రాన్సర్ చేస్తారని చెబుతున్నారు. దీంతో హెచ్ఐవీ పాజిటివ్ కేసులు అంతకంతకూ పెరుగుతున్నట్లుగా చెబుతున్నారు. అందమైన బీచ్ లు..కట్టి పడేసే నేచర్.. వావ్ అనిపించే రిసార్టులతో ఫిజీ పర్యాటకుల్ని విపరీతంగా ఆకర్షిస్తోంది. గత ఏడాది ఆ దేశంలో 9.86 లక్షల మంది పర్యాటకులు పర్యటించటం చూస్తే.. ఫిజీ క్రేజ్ ఎంత ఉందో అర్థమవుతుంది. సో.. ఫిజీకి ప్లాన్ చేస్తే మాత్రం..కాస్తంత కేర్ ఫుల్ గా ఉండటం మంచిది.

చురకలు

## సంపాదకీయం

# లడ్డూ వివాదం.. తెగేదాకా లాగితే.. !

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగించారన్న వివాదం నానాటికీ ముదురుతోంది. దీనిపై సీబీఐ అధికారుల నేతృత్వంలో ఇప్పటికే 2024-2026 జనవరి వరకు విచారణ జరిగింది. దీనికి సంబంధించిన నివేదిక కూడా కోర్టుకు చేరింది. అయితే.. దీనిలో ప్రధానంగా నెయ్యి కల్తీ జరిగిందని సిట్ పేర్కొంది. అయితే.. దానిలో జంతువుల కొవ్వు కలిసిందా..? లేదా? అనేవిషయంలో సందేహం వ్యక్తం చేసింది. ఇక, ఈ నివేదిక తమకు అనుకూలంగా ఉందని.. జంతువుల కొవ్వు కలవలేదని సిట్ తమకు క్లీన్ చిట్ ఇచ్చిందని వైసీపీ నాయకులు ప్రచారం చేయడం ప్రారంభించారు. ఇక్కడ నుంచి మరోసారి లడ్డూ లడాయి పుంజుకుంది. అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్యుద్ధంతోపాటు.. దాడుల వరకు ఈ వ్యవహారం దారి తీసింది. ఈ నేపథ్యంలో వాస్తవానికి కూటమి ప్రభుత్వం.. ప్రస్తుత సీబీఐ నివేదిక కోర్టు పరిధిలో ఉంది కాబట్టి.. దీనిని తర్వాత తేల్చుకుంటామని చెప్పి ఉంటే ఇంత వివాదం ఉండేది కాదు. ఇదేసమయంలో వైసీపీ చేసే ఎదురుదాడికి విషయం ఆధారంగా కౌంటర్ ఇచ్చినా బాగుండేది. మరి కొన్ని రోజుల్లోనే బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న నేపథ్యంలో ఆదిశగా చర్చలను దారి మళ్లించి ఉన్నా.. ఈ వివాదం ఇక్కడితో ఆగిపోయేది. కానీ, ప్రభుత్వం అలా చేయడం లేదు. పైగా.. ఇప్పుడు ప్రత్యేక కమిషన్ వేసి.. వాస్తవాలు వెలుగు చూసేలా చేస్తామని ప్రకటించింది. కానీ, ఈ వ్యవహారం కూడా అంత తేలికగా ముగిసే పరిస్థితి లేదని తెలుస్తోంది. ప్రస్తుతం కోర్టులో ఉన్న సీబీఐ నివేదికపై విచారణ పూర్తి అయి.. కోర్టులు తీర్పులు ఇచ్చాక మాత్రమే ప్రత్యేక కమిషన్ వేసేందుకు రాష్ట్ర సర్కారుకు అవకాశం ఉంటుంది. కానీ, ఇది జరిగే సరికి మరో ఏడాది సమయం పట్టనుంది. ఆ తర్వాత.. కమిషన్ వేసినా.. అది కూడా నోటి మాటగా విచారణ పూర్తి చేసే అవకాశం లేదు. ఏదైనా కూడా ల్యాబులపైనా.. అవి ఇచ్చే నివేదికలపైనే ఆధారపడాల్సి ఉంటుంది. సో.. మొత్తంగా చూస్తే.. ఈ వ్యవహారాన్ని తెగేదాకా లాగితే.. సమయం వృథా తప్ప.. పెద్దగా కూటమికి ప్రయోజనం ఉంటుందా? అనేది చూడాలి.

# సాంప్రదాయ రీతిలో శ్రీనివాస మంగాపురం వెంకన్న బ్రహ్మోత్సవాలు



శ్రీనివాస మంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరి 7వ తేదీ సాయంత్రం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమై, ఫిబ్రవరి 8 నుండి 16వ తేదీ వరకు జరగనున్నాయి. ఉదయం 8 నుండి 9 గంటల వరకు, రాత్రి 7 నుండి 8 గంటల వరకు వాహనసేవలు నిర్వహిస్తారు. ఆలయ స్థలపురాణం ప్రకారం శ్రీనివాసుడు పద్మావతిని నారాయణవనంలో పరిణయం చేసుకున్న తర్వాత వెంకటేశ్వర స్వామి పద్మావతి సమేతుడై తిరుమల కొండకు బయలుదేరగా.. శాస్త్ర ప్రకారం పెళ్లయిన దంపతులు ఆరు నెలల వరకు కొండ ఎక్క కూడదని పుణ్యక్షేత్రాలకు కూడా వెళ్ళకూడదని అగస్త్య మహర్షి చెప్పారట. దీంతో స్వామివారు దేవేరితో కలిసి అగస్త్య ఆశ్రమంలోనే 6నెలలపాటు విడిది చేశారట. ఆరునెలల తర్వాత తిరుమల కొండకు పయనమైన స్వామివారు భక్తులకు రెండు వరాలను ప్రసరించారని పురాణాల కథనం. ఇక్కడ వేంకటేశ్వరుని ఆలయం చాల పెద్దది. విశాలమైనది. శ్రీ వారి ప్రధాన మూర్తి తిరుమలలో ఉన్న దాని కంటే పెద్దది.

తిరుమలలో జరిగే అన్ని పూజాదికాలు ఇక్కడ కూడా జరుగుతాయి. ఇక్కడ భక్తుల తాకిడి అంతగా లేనందున ప్రశాంతంగా దర్శనం చేసు కోవచ్చు. శ్రీ వారి మెట్టు ఇక్కడికి దగ్గరే. అక్కడి నుండే తిరుమల కొండ పైకి మెట్లదారి ఉంది. ఇది చాలా దగ్గర దారి. తిరుపతి అలిపిరి నుండే ఉండే మెట్ల దారి కంటే ఇది చాలా దగ్గర. సుమారు గంట లోపలే తిరుమల కొండ పైకి వెళ్లవచ్చు. ఫిబ్రవరి 7వ తేదీ శని వారం సాయంత్రం సేనాపతి ఉత్సవం అంకురార్పణ జరిగి, ఫిబ్రవరి 8వ తేదీ ఉదయం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఫిబ్రవరి 8న ఆదివారం ఉదయం 8.15 నుంచి 8.35 గంటల మధ్య కుంభ లగ్నంలో ధ్వజారోహణం జరగనుంది. అంతకుముందు తిరుచ్చి ఉత్సవం నిర్వహిస్తారు. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు పెద్దశేష వాహనసేవ జరుగనుంది. శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలకు ఫిబ్రవరి 18న ఉదయం 8.15 నుండి 8.40 గంటల మధ్య మీన లగ్నంలో ధ్వజారోహణం జరుగనుంది. అంతకుముందు తిరుచ్చి ఉత్సవం నిర్వహిస్తారు.

రాత్రి 7 నుండి 8 గంటల వరకు పెద్దశేష వాహనసేవ జరుగనుంది. 9న ఉదయం చిన శేష వాహనం, సాయంత్రం హంస వాహనం; 10న సింహ వాహనం, ముత్యపు పందిరి వాహనం; 11న కల్ప వృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, 12న పల్లకీలో మోహినీ అవతారోత్సవం, సాయంత్రం గరుడ వాహనం; 13న హనుమద్ వాహనం, సాలకట్ల వసంతోత్సవం, సాయంత్రం గజ వాహనం; 14న ఉదయం సూర్య ప్రభ వాహనం, సాయంత్రం చంద్ర ప్రభ వాహనం; 15న ఉదయం రథోత్సవం, సాయంత్రం అశ్వ వాహనం; 16న ఉదయం పల్లకీ ఉత్సవం, తిరుచ్చి ఉత్సవం, అవభృతం, చక్ర స్నానం, సాయంత్రం తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం నిర్వహించ నున్నారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, రాత్రి 7 నుంచి 8 గంటల వరకు వాహన సేవలు జరుగుతాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# తి.తి.దేవస్థానం ఆధ్వర్యంలో కపిలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు - 8వ తేదీన అంకురార్పణతో తొమ్మిది రోజుల ఉత్సవాలు

తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తిరుపతి కపిలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నెల 8వ తేదీన సాయంత్రం అంకురార్పణతో ఈ తొమ్మిది రోజుల బ్రహ్మోత్సవాలు ఆరంభం కానున్నాయి. కామాక్షి దేవితో కలిసి ఉన్న స్వామి కపిలేశ్వరుడి దివ్య నివాసం కొండల దిగువన ఉన్న కపిల తీర్థ సరస్సు ద్వారా ప్రాతినిధ్యం వహిస్తుంది. కొండ పట్టణానికి ప్రయాణించేటప్పుడు, యాత్రికులు తమ ప్రయాణాన్ని కొనసాగించే ముందు ప్రార్థన చేయడానికి మొదటగా కపిల తీర్థం ఉంటుంది. స్వామి శ్రీ వేంకటేశ్వర (విష్ణువు) ని స్తుతించే సహస్ర నామావళిలో ఈ పేరు కూడా ఉంది. వేంకటాచల మహాత్మ్యంలో స్వామి కపిలేశ్వరుడు ప్రస్తావించ బడ్డాడనేది వాస్తవం. శ్రీనివాసుడు, ఆకాశరాజు వద్దకు వెళ్లి తన వివాహానికి మధ్యవర్తి పాత్రను నెరవేర్చమని వకుళ మాతను అభ్యర్థిస్తున్నట్లు వ్రాయబడింది. వెంకటాచల మహాత్మ్యములో... శ్రీనివాసుడు, వకుళ మాతను కామాక్షి దేవితో ఉన్న కపిలేశ్వరునికి, యువ శ్రీనివాసుడు కామాక్షివరద ఆశీస్సులు కోరుతున్నాడని తెలియజేయమని కోరినట్లు కూడా ప్రస్తావించ బడింది. శ్రీనివాసుని కోరిక మేరకు, వకుళ మాత ఆకాశరాజు రాజ్యంలో ఉన్న నారాయణ వనానికి ప్రయాణమై, వివాహం కోసం వేడుకుంటుంది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో తిరుపతి కపిలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు , ఈ నెల 8వ తేదీన సాయంత్రం అంకురార్పణతో తొమ్మిది రోజుల బ్రహ్మోత్సవాలు ఆరంభం కానున్నాయి. కపిల తీర్థంలో ఈ నెల ఫిబ్రవరి 8 నుండి 17వ తేదీ వరకు వైభవంగా నిర్వహించ డానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 8న శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమం జరుగనుంది. 8న ఉదయం- ధ్వజారోహణం, రాత్రి హంస వాహనంపై స్వామివారు ఊరేగుతారు. 9న ఉదయం- సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై దర్శనం ఇస్తారు. 10న ఉదయం- భూత వాహనం, రాత్రి సింహ వాహనంపై కపిలేశ్వర స్వామివారు భక్తులను కటాక్షిస్తారు. 11న ఉదయం- మకర వాహనం, రాత్రి శేష వాహనం, 12న ఉదయం- తిరుచ్చి ఉత్సవం, రాత్రి- నంది వాహన సేవను నిర్వహిస్తారు. 13న ఉదయం- వ్యాఘ్ర వాహనం, రాత్రి గజ వాహనంపై కపిలేశ్వర స్వామివారిని ఊరేగిస్తారు. 14న ఉదయం- కల్పవృక్ష వాహనం, రాత్రి అశ్వ వాహన సేవలు ఉంటాయి. 15న ఉదయం రథోత్సవం కన్నుల పండువగా సాగుతుంది. రాత్రి నందివాహనంపై స్వామివారు ఊరేగుతారు.

16న ఉదయం పురుషా మృగవాహనం, సాయంత్రం కల్యాణోత్సవం ఉంటుంది. రాత్రి తిరుచ్చి ఉత్సవాన్ని నిర్వహిస్తారు. 17న ఉదయం త్రిశూల స్నానం, సాయంత్రం ధ్వజావరోహణం, రాత్రి రావణాసుర వాహనంపై స్వామివారిని ఊరేగిస్తారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై టీటీడీ ఉన్నతాధికారులు ఇదివరకే సమీక్షలను సైతం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యక్షంగా పనులను పర్యవేక్షించారు. ఆలయ పుష్కరిణిని పరిశుభ్రంగా ఉంచాలని, ఆకర్షణీయంగా పెయింటింగ్, రంగోలీలు, స్వామివారి వాహనాల మరమ్మత్తులు, పెయింటింగ్, విద్యుత్ కాంతులు, ఫ్లెక్సీలు, పటిష్టంగా క్యూలైన్లు, తిరుపతి నగరంలోని ప్రధాన కూడళ్లలో ఆర్చ్ లు ఏర్పాటు



చేయాలని సూచించారు. భక్తులకు వేసవి నేపథ్యంలో చలువ పందిళ్లు, తాగునీరు, అన్న ప్రసాదాలు అందించేందుకు వీలుగా సకాలంలో ఏర్పాట్లు పూర్తి చేయాలని కోరారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# అంగ రంగ వైభవంగా శ్రీశైల బ్రహ్మోత్సవాలు - ఫిబ్రవరి 8తేదీ నుండి 18 వరకు


తెలుగు నేలపై కొలువైన దివ్యక్షేత్రం శ్రీశైలం. జ్యోతిర్లింగం, శక్తి పీఠం ఒకే గిరి శృంగం మీద వెలసిన పరమ పవిత్ర స్థలంగా భాసిల్లుతున్న క్షేత్రం. పన్నెండు జ్యోతిర్లింగాలలో రెండవది, శ్రీభ్రమరాంబా దేవికి నెలవైన శక్తిపీఠం. శైవక్షేత్రాల్లో తలమానికం. మల్లికార్జున మహాలింగ చక్రవర్తి కొలువై ఉండి, సకల లోకారాధ్యంగా, త్రైలోక్య పూజితంగా విరాజిల్లు తున్నది. సంకల్ప, పూజా సందర్భాలలో శ్రీశైలానికి ఏ దిగ్భాగంలో ఉన్నామో భగవంతునికి తెలియ చేసుకునే సాంప్రదాయాన్ని బట్టి క్షేత్ర ప్రాధాన్యత స్పష్టం అవుతున్నది. పురాణాల్లో వర్ణితమైనఎనిమిది శృంగాలతో, నలభై నాలుగు నదులు, అరవై కోట్ల తీర్థరాజాలు, పరాశర, భరద్వాజాది మహర్షుల తపోవన సీమలతో, చంద్ర, సూర్య కుండాది పుష్కరిణులతో, లతలు, వృక్ష సంతతులు, అనేక లింగాలు, అద్భుత ఔషధాలు కలిగి శ్రీశైల మల్లన్న దేవుని సన్నిధికి చేర్చే దారి అత్యంత ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. బ్రహ్మగిరి, విష్ణుగిరి, రుద్రగిరి అనే మూడు పర్వతాలకు పాదాభివందనం చేస్తూ వేదఘోషను ప్రతిధ్వ నింప చేస్తూ, పాతాళగంగ నామాంకిత అయిన కృష్ణవేణీ నది ఈ ప్రదేశంలో ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్నది. అష్టాదశ పురాణాల్లోనూ భారత రామాయణాది ఇతిహాసా ల్లోనూ శ్రీశైల వైభవం వర్ణించ బడింది. కృతయుగంలో హిరణ్య కశిపుడు శ్రీశైలాన్ని తన పూజా మందిరంగా చేసుకొన్నాడు. పురాణాల ప్రకారం సీతారాములు ప్రతిష్ఠించిన సహస్ర లింగాలు, పాండవులు భక్తితో స్థాపించిన సద్యోజాత లింగం, పంచపాండవ లింగాలు పూజార్హత కలిగి అలరారు తున్నాయి. సంస్కృత, ఆంధ్ర, కన్నడ, మరాఠీ గ్రంథాల్లో ఈ క్షేత్రాన్ని గురించిన వర్ణనలున్నాయి. పలు భాషల కవులు క్షేత్ర ప్రాధాన్యతను అభివర్ణించారు. స్కాంద పురాణంలోని శ్రీశైల ఖండం, ఈ క్షేత్ర మహత్తును వివరిస్తోంది. ఈ క్షేత్ర ప్రశాంతతకు ముగ్ధులైన ఆది శంకరులు కొంత కాలం ఇక్కడ తపస్సు చేసి, శివానంద లహరిని రచించి, మల్లి కార్జునుడికి సమర్పించి. భ్రమరాంబ సన్నిధిలో శ్రీ చక్రాన్ని ప్రతిష్ఠించారు. దత్తావతార పరంపరలో భక్తుల పూజలందుకొనే నృసింహ సరస్వతీ స్వామి శ్రీశైల మహత్యాన్ని వివరి స్తూ తన పాదుకల్ని





పట్టుకొన్న తంతుడు అనే భక్తుడికి ఈ క్షేత్ర దర్శన భాగ్యాన్ని కలిగించినట్లు గురుచరిత్ర చెబుతోంది. నృసింహ సరస్వతి స్వామి ఇప్పటికీ కదలీవనంలో గుప్తరూపంలో ఉన్నట్లు దత్తాత్రేయ భక్తులు విశ్వసిస్తారు. శ్రీశైల క్షేత్రాన్ని దర్శించి ఇక్కడి మఠాలలో ఉన్న సాధకులు, యోగుల వసతి కోసం క్రీస్తుపూర్వం నుంచి అనేక రాజవంశాలు ఎన్నో దానాలను గావించి నట్లు శిలాశాసనాలు, చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఇక్ష్వాకులు, శాతవాహనులు, విష్ణుకుండినులు, పల్లవులు, రాష్ట్ర కూటులు, చాళుక్యులు, కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర సామ్రాజ్యాధీశులు, భ్రమరాంబికా సమేతులైన మల్లికార్జునుణ్ణి దర్శించి భక్తుల సౌకర్యాలకు ఎన్నో ఏర్పాట్లు, అశేష వస్తుసంపదలు సమర్పించారు. శ్రీశైలంలో పంచ మఠాలు ప్రాచీన మైనవి. మొదటిదైన ఘంటామఠం - శ్రీశైల ఆలయానికి వాయువ్య దిశగా ఉంది. శివ సాధకుడైన ఘంటాకర్ణ సిద్దేశ్వరుడు తన శిష్యులతో కలిసి దీనిని ఏర్పాటు చేశారు. రెండోదైన విభూతి మఠం, శ్రీకృష్ణ దేవరాయల కాలపు వీరశైవుడైన శాంతి మల్లయ్య అనే వ్యక్తి పేరు మీదుగా ఏర్పడినట్లు పరిశోధనలు వివరిస్తున్నాయి. మూడోదైన రుద్రాక్ష మఠాన్ని మల్లి శంకరస్వామి అనే భక్తుడు నిర్మించాడని తెలుస్తోం ది. ఇక్కడికి వచ్చే భక్తులకు అతడు రుద్రాక్షలను పంచిపెడు తుండేవాడని స్థానికులు చెబుతుంటారు. నాలుగోదైన సారంగ మఠాన్ని సారంగేశ్వరముని నిర్మించాడని చరిత్ర చెబుతోంది. దీనికి సంబంధించిన లిఖిత ఆధారంగా క్రీ.శ.1585 నాటి శాసనం మఠంలో లభ్యమైంది. అయిదోదైన నంది మఠంలో నందికేశ్వరుడు అనే యోగి సుదీర్ఘకాలం జీవించాడు. ఇది ఘంటా మఠానికి వైపు ఉండేది. ఇవే కాకుండా శ్రీశైలంలో పలు మఠాలు ఉండేవి. వాటిలో వీరశైవ సిద్ధాంత భిక్షావృత్తి మఠం ప్రసిద్ధమైంది. క్రీ.శ. 1518లో దీనిని సిద్ధ భిక్షావృత్తి భార్య, శిష్యుడు పర్వతయ్యలు ఏర్పాటు చేసినట్టుగా తెలుస్తోంది. దీనికి చాలాకాలం ముందే 3వ కుళోత్తుంగ చోళుడు ఒక మఠాన్ని క్రీ.శ. 1178-1216 మధ్య కాలంలో ఏర్పాటు చేసినట్టుగా చరిత్ర చెబుతోంది. వటసిద్ధి మఠం, చంద్రమఠం, కమరీ మఠం అనే మఠాలు భక్తులకు అన్నవసతి ఏర్పాటు చేసినట్టుగా తెలుస్తోంది. ఇంకా అనేక మఠాలు పదహారో శతాబ్దికి పూర్వం నుంచే ఇక్కడ ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న శ్రీశైల క్షేత్రంలో ఫిబ్రవరి 8తేదీ నుండి నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా 8న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అధికారులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శ్రీశైలం క్షేత్ర మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున సీఎం పట్టువస్త్రాలు అందజేస్తారు. 15వ తేదీన మహా శివరాత్రి ప్రత్యేక పూజా కార్యక్రమాలు. ప్రభోత్సవం, నంది వాహన సేవ. లింగోద్భవ కాలంలో మహారుద్రాభిషేకం, కళ్యాణోత్సవం నిర్వహించ నున్నారు. ఈ ఉత్సవాల్లో స్వామి వారు వివిధ వాహనాలను అధిరోహించి, తిరు వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అనుగ్రహం కలిగిస్తారు. ప్రత్యేకించి మహాశివరాత్రి నాడు స్వామి వారికి ప్రభోత్సవం, నందివాహన సేవలతో పాటు అనేక విశేష కార్యక్రమాలను నిర్వహిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ కారణంగా స్వామి వారి అలంకార దర్శనానికి మాత్రమే అనుమతి ఉంటుంది. జ్యోతిర్ముడి కలిగిన శివ స్వాములకు మాత్రమే నిర్దిష్ట వేళల్లో ఉచిత స్పర్శ దర్శనానికి అవకాశం ఉంటుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# పాత్రికేయ దిగ్గజం పొత్తూరి - ఫిబ్రవరి 8...పొత్తూరి వెంకటేశ్వరరావు జయంతి



పొత్తూరి వెంకటేశ్వరరావు... తెలుగు పత్రికా పాఠకులకు సుపరిచితమైన పేరు. అయిదు దశాబ్దాలకు పైగా పత్రికా రంగంలో మమేకమై, తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన తెలుగు జర్న లిజానికి సాధికారిక గుర్తు ఆయన. విలువలకు ప్రాధాన్యత ఇచ్చి, కట్టుబడి, ఎన్నడూ రాజీ పడని అరుదైన వ్యక్తిత్వం ఆయనది. ఒక ట్రెండ్ సెట్టర్ గా నేటి తరానికి అచ్చమైన స్వచ్ఛమైన మార్గదర్శి పొత్తూరి. 1934 ఫిబ్రవరి 8వ తేదీన గుంటూరులో జన్మించిన డాక్టర్ పొత్తూరి వెంకటేశ్వరరావు 1957లో ఆంధ్ర జనతా పత్రికలో తొలిసారిగా ఆయన పాత్రికేయుడిగా, తొలి అడుగు వేశారు. ధృఢ చిత్తులై, వృత్తి నిబద్ధత, నిజాయితీ, బాధ్యతల విషయంలో ఎన్నడూ వెనకడుగు వేయనే లేదు. ఈనాడు, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ, వార్త దినపత్రికల్లో ఎక్కడ పని చేసినా తన ప్రత్యేక ముద్రలు వేశారు. పొత్తూరి ఐదు దశాబ్దాలకు పైగా తెలుగు పత్రికా రంగంలో అనేక యాజ మాన్యాలను, సంఘటనలను, సందర్భాలను, పరిణామాలను, మార్పులను గమనించారు. తనదైన ప్రత్యేక శైలి సంపాదకీయాలు రాశారు. పొత్తూరి అంటే ఒక ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రెస్ అకాడమి అధ్యక్షుడిగా వ్యవహరించారు. తెలుగు భాషా వికాసానికి, సాహిత్యాభివృద్ధికి నిరంతర కృషి చేశారు. ఎందరో సాహితీ వేత్తలకు వెన్నుదన్నుగా నిలిచి నిలిచి భాషాభ్యున్నతికి చేయూత అందించారు. దాదాపు నూటయాభై యేళ్ళ తెలుగు పత్రికా చరిత్ర గురించి సంపూర్ణ అవగాహన కలిగి, స్వయంగా ఒక సకల విషయ సంగ్రహ నిధిగా నిలిచారు. పత్రికా రచనల పట్ల, తెలుగు సాహిత్యం పట్ల అయన అంకిత భావం సాటిలేనిది. అందుకే తెలుగు పత్రికా రంగంలో మేటి సంపాదకులుగా పొత్తూరి గుర్తింపు పొందారు. సాహిత్య, సాంస్కృతిక, సాంఘిక, చమత్కార, జ్ఞాన, విజ్ఞాన, రాజకీయ ఒక్కటేమిటి పాత్రికేయులకు ఉండాల్సిన అన్ని అంశాలలో అపారమైన జ్ఞాన సంపన్నులుగా అసమాన ప్రతిభ కనబరిచారు. "నాటి పత్రికలు విలువలు పాటించేవి. సంపాదకులు నడిపించేవారు. నేడు పరిస్థితి వేరు. యజమానులే నడిపిస్తున్నారు. పత్రికల ప్రతులు ఎక్కువ సంఖ్యలో అమ్ముకోవడానికి తాపత్రయ పడుతున్నారు. విలువలు పడి పోయాయని" తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తుండే వారు. యాజమాన్యాల భావజాలాలు అనుగుణంగా కాకుండా, సర్వ స్వతంత్రులుగా వ్యవహరించే వారు. కొన్ని సందర్భాలలో యాజమాన్యం ఆంక్షలు విధించితే, రాజీ పడక, రాజీనామా చేసి వెళతానని నిక్కచ్చిగా చెప్పేవారు పొత్తూరి వెంకటేశ్వరరావు. ఆయన వ్యాస పరంపర ఎంతో విలువైన సమాచారాన్ని విలువ కలిగిన సమాచార యుక్తంగా సామాన్య భాషలో, సూటిగా ఆకర్షణీయంగా ఉండేవి. తుదిశ్వాస వరకు జర్నలిజం విలువలకు కట్టుబడి తనదైన విలక్షణ వ్యక్తిత్వానికి దర్పణంగా నిలిచిన ధన్యజీవి పొత్తూరి. నాటి పత్రికల మేటి విలువలు , చింతన, చిరస్మరణీయులు, కాశీనాధుని నాగేశ్వరరావు, పారమార్థిక పదకోశం తదితర రచనలు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం నక్సలైట్లతో జరిపిన చర్చల్లోపౌర స్పందన వేదిక సభ్యుడిగా పొత్తూరి క్రియాశీల పాత్ర పోషించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణలకు గౌరవ సంపాదకత్వం కూడా వహించారు. లోకాయుక్త కమిటీలో జ్యుడీషల్ సభ్యుడిగా, సలహాదారుగా పొత్తూరి పనిచేశారు. పొత్తూరి వెంకటేశ్వరరావు బ్రిటీష్ లైబ్రరి సభ్యత్వం కలిగి ఉన్న అపురూప గౌరవం దక్కించు కున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పొత్తూరి రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక రాష్ట్ర వాదనకు ఆయన మద్దతు తెలిపారు. 2020 మార్చి 5న పొత్తూరి లోకాన్ని వదిలి వెళ్లారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# ఎంజీయూకు పాలకమండలి ఎప్పుడో?

నల్గొండ : నల్గొండ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయానికి చాలా కాలంగా పాలకమండలి లేక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. గత పాలకమండలి(ఈసీ) పదవీకాలం 2024 ఫిబ్రవరితో ముగిసింది. రెండేళ్లయినా ప్రభుత్వం నూతనంగా నియమించలేదు. దీంతో వర్సిటీలో సమస్యలు- అభివృద్ధిపై చర్చించే అవకాశం లేకుండా పోయింది. ఈసీ లేని కారణంగా బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు చేపట్టకపోవడం, నూతన భవన నిర్మాణాలు, ప్రమోషన్లు, నిబంధనల రూపకల్పనలు, విధానపరమైన కీలక నిర్ణయాలు పూర్తిస్థాయిలో తీసుకునే అవకాశం లేకుండా పోయింది. గత రెండేళ్లలో దోస్త్ ప్రవేశాల ప్రక్రియలో భాగంగా ఆయా కోర్సుల్లో ఆశించిన స్థాయిలో ప్రవేశాలు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. వీటితో విద్యా ప్రమాణాలు తగ్గడంతోపాటు విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశాలున్నాయని పలువురు విద్యావేత్తలు, విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

**వర్సిటీలో 22 కోర్సులు..:** ఎంజీయూ 2007లో ఏర్పాటైంది. న్యాక్ బీప్లస్ గ్రేడ్‌తో కొనసాగుతోంది. ప్రస్తుతం ఇక్కడ సైన్స్, ఆర్ట్స్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఇంజినీరింగ్ కళాశాలలున్నాయి. సుమారు 22 కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో 2వేలకు పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందినవారు వర్సిటీ హాస్టల్స్‌లో ఉండి చదువుకుంటున్నారు. ఏటా వందలాది మంది డిగ్రీ పట్టాలతో బయటకు వస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యం గల వర్సిటీకి పాలకమండలి అవసరం ఎంతో కీలకం.

13 మందితో..: వర్సిటీ పాలకమండలిలో మొత్తం 13 మంది సభ్యులుంటారు. వర్సిటీ వీసీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. మండలిలో పలువురు రాష్ట్ర ఉన్నతాధికారులు, అధ్యాపకులు, ప్రముఖులు ఉ




ంటారు. వీరంతా మూడేళ్లపాటు ఈసీలో బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఎప్పటికప్పుడు సమావేశాల ద్వారా పలు నిర్ణయాలు, చర్చలు కొనసాగించి విశ్వవిద్యాలయ పురోగతికి తోడ్పడుతుంటారు.

**త్వరగా నియమించాలి: హనుమాన్, ఎంజీయూ ఎమ్మెస్సీ విద్యార్థి**
ఈసీ ఉంటే వర్సిటీలో అభివృద్ధి మరింత వేగవంతం అయ్యే ఆస్కారం ఉంటుంది. విశ్వవిద్యాలయాలు అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలంటే ప్రభుత్వం తక్షణమే విశ్వవిద్యాలయాలకు పాలకమండలిలను నియమించాలి.

**ప్రభుత్వం చేతిలోనే: ప్రొఫెసర్ అల్తాఫ్ హుస్సేన్, ఎంజీయూ వీసీ**
వర్సిటీల పాలకమండలి నియామకం ప్రభుత్వం చేతుల్లోనే ఉంటుంది. రెండేళ్లుగా ఎంజీయూకు ఈసీ లేదు. వర్సిటీకి త్వరగా ఈసీని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులను పలుమార్లు కోరాం. ఈసీ ఏర్పాటుకు ఎంత సమయం పడుతుందో తెలియదు.

# పేరు గొప్ప.. సమస్యల దిబ్బ

సూర్యాపేట : పంచాయతీలను పట్టణాలుగా ఉన్నతీకరించడంతో ఆ ప్రాంత ప్రజలు సంబరపడ్డారు. మట్టి రోడ్లు సీసీగా అవుతాయన్న ఆశ.. మురుగు సమస్య తీరుతుందన్న నమ్మకం.. తాగునీటి కొరత సమస్య ఉండదన్న భరోసా.. ఇలా సకల సదుపాయాలతో తమ పల్లెలకు పట్టణ రూపురేఖలు వస్తాయని విలీన గ్రామాల ప్రజలు మురిశారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో 2018లో పలు గ్రామాలు విలీనమయ్యాయి. పలు ప్రాంతాల్లో పర్యటించింది. అభివృద్ధి అనేది పంచాయతీగా ఉన్నప్పుడు బాగుందా?.. విలీనం తర్వాత బాగుందా?.. అనే తదితర అంశాలపై అక్కడి ప్రజలతో ముచ్చటించింది. చాలా మంది పంచాయతీలుగా ఉన్నప్పుడే తమకు ప్రయోజనకరంగా ఉందనే అభిప్రాయాన్ని వ్యక్తపర్చడం గమనార్హం.

**తాగునీటికి తండ్లాట..:** కేసారం పంచాయతీ పరిధిలో 850 ఓటర్లున్న కుసుమవారిగూడెం 2018లో సూర్యాపేట పట్టణంలో విలీనమై ఎనిమిదో వార్డులో చేరింది. పంచాయతీ పాలనలోనే సీసీ రోడ్లు, నిత్యం నీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాలు ఉన్నప్పటికీ పట్టణ హోదా వచ్చిన తర్వాత అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగడం లేదని స్థానికులు వాపోతున్నారు. వీధిదీపాలు సకాలంలో అమర్చకపోవడం, నీటి సరఫరా తక్కువగా ఉండటం, పైపులైన్ల లీకేజీల సమయంలో ట్యాంకర్లపైనే ఆధారపడటం ఇబ్బందిగా మారింది. ఉపాధిహామీ పనులు దూరమవడంతో జీవనోపాధి సమస్యలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలే అధికం..: 2018లో ఆలేరు పురపాలిక ఆరోవార్డులో 887 మంది ఓటర్లు కలిగిన బహద్దూరుపేట పంచాయతీ విలీనమైంది. ఎనిమిదేళ్లు గడిచినా అభివృద్ధి ఛాయలు కనిపించడం



లేదని స్థానికులు వాపోతున్నారు. పట్టణంగా మారడంతో పన్నుల భారం పెరిగి, ఉపాధిహామీ పనులు నిలిచిపోవడంతో సుమారు 400 మంది కూలీలు ఉపాధిని కోల్పోయారు. రూ.2.5 కోట్ల వరకు నిధులు కేటాయించినప్పటికీ స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ, వైకుంఠధామం నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. లైట్లు కాలిపోతే కొత్తవి అమర్చడానికి రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తుందని, తిరిగి గ్రామపంచాయతీగా ఏర్పాటు చేస్తేనే మేలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**ఏం కోరుకుంటున్నారంటే..** ఉపాధిహామీ పథకాన్ని కొనసాగించాలి. వీధిదీపాల ఏర్పాటు త్వరితగతి న చేపట్టాలి. నీటి సరఫరాకు పంచాయతీ సమయంలోని బోర్లు, బావులను వినియోగంలోకి తీసుకురావాలి. అవసరమున్న చోట సీసీరోడ్లు, డ్రైనేజీ, శ్మశానవాటికల నిర్మాణం చేస్తూ, పట్టణ రూపురేఖలు వచ్చేలా మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిపెట్టాలి. క్రమం తప్పకుండా చెత్త సేకరణ చేస్తూ, మురుగు కాలువలు, వీధులు శుభ్రం చేయాలి.

# రోగాలు తగ్గిస్తారా... కొత్తవి అంటిస్తారా!



కరీంనగర్ : జబ్బు చేసి, గాయపడి కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వస్తే కొత్త వ్యాధులు అంటుకునే ప్రమాదముంది. అక్కడి పరిసరాలు, నిర్వహణ తీరు ఇందుకు నిదర్శంగా నిలుస్తున్నాయి. గాయాలను శుభ్రపరిచే గదిలో (డ్రెస్సింగ్‌రూం) సరైన ఏర్పాట్లు లేక క్షతగాత్రులు, శస్త్రచికిత్స అయిన రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

**ఇలా జరుగుతుంది..**
ప్రమాదాల్లో, ఇన్‌ఫెక్షన్ సోకిన వారికి సర్జరీలు చేయడం, కుట్లు వేయడంతోపాటు రెండు రోజులకోకసారి ఆ గాయాన్ని శుభ్రపరిచి పట్టి కట్టాల్సి ఉంటుంది. ఇక్కడికి వివిధ రకాల రోగాలతో వస్తుంటారు. గది మొత్తం అపరిశుభ్రంగా ఉంది. రోగులకు ఇతర వ్యాధులు వ్యాపించే అవకాశముంది. రోగులు కూర్చొవడానికి ఏర్పాట్లు లేవు. ఒకరి తర్వాత ఒకరికి చేసే వరకు నిల్చొని ఉండాలి. ఆసుపత్రిలో సరిపడా వార్డుబాయ్స్ లేకపోవడంతో గాయాలను శుభ్రపరిచి కట్లు కట్టడంలాంటివి ఆసుపత్రి, పారిశుద్ధ్య సిబ్బంది చేస్తున్నారు.

**పరికరాలను శుద్ధి చేయడంలేదు**
గాయాలకు పట్టి తీసే సమయంలో రోగులకు రక్తస్రావమవుతుంది. రక్తం అంటకుండా వివిధ రకాల పరికరాలను పట్టుకొని శుభ్రపరుస్తుంటారు. వాటిని మళ్లీ మరో రోగికి వాడే క్రమంలో ఆటోక్లేవ్ చేయాలి. అయితే ఇక్కడ అలాంటి ఏర్పాట్లు లేకపోవడంతో మాములు నీళ్లతో చేస్తున్నారు. రోగి పడుకునే మంచంపై వేసిన బెడ్‌షీట్‌ను ఏరోజుకు ఆరోజు మార్చడంలేదు. కుట్లు వేసే దారం కూడా సరిగా లేదు. గదిలో కరెంట్ స్విచ్‌బోర్డు పగిలి, కరెంటు షాక్ తగిలేలా ఉంది. సరైన శుభ్రత పాటించకపోతే రోగుల పరిస్థితి ఏంటని వైద్య బృందంకే తెలియాలి మరీ.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం**
తప్పనిసరిగా పరికరాలను ఆటోక్లేవ్ చేసి వాడాలి. శస్త్రచికిత్స గదిలో ఈ సౌకర్యం ఉంది. ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని సిబ్బందికి ఆదేశించాం. డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న సమస్యలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం. కుట్లు వేయడానికి వాడే సామగ్రి అందుబాటులో ఉన్నాయి. డాక్టర్ వీరారెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్

# గొంతు తడపని పథకాలు



రాయికల్ : రాయికల్ పట్టణంలో తాగునీటి సమస్య దశాబ్దాల తరబడి పరిష్కారానికి నోచుకోవడం లేదు. 30 ఏళ్ల కిందట పంచాయతీగా ఉన్నప్పుడు స్థానికంగా బావుల ద్వారా ట్యాంకుల్లోకి ఎక్కించి ఉదయం, సాయంత్రం రెండు విడతలుగా సరఫరా చేసేవారు. సక్రమంగా జరిపేవారు. పట్టణం విస్తరిస్తున్న దృష్ట్యా ఫిల్టర్‌బెడ్, మిషన్ భగీరథ పథకాలు అందుబాటులోకి వచ్చినా నాగారాంవాడ, పోచమ్మవాడ, అంబేద్కర్‌నగర్, ఎంపీడీవో కార్యాలయం, మహేశ్వరి థియేటర్ ప్రాంతాల్లో ఎద్దడి తలెత్తుతోంది.

**రూ.కోట్లు వెచ్చిస్తున్నా..**
సమగ్ర నీటి పథకం కింద సుమారు రూ.6 కోట్లతో పట్టణంతో పాటు రామాజిపేట, భూపతిపూర్, కుమ్మరిపెల్లి, ఇటిక్యాల, చెర్లకొండాపూర్ గ్రామాలకు శుద్ధ జలం అందించడమే లక్ష్యంగా 2007లో రాయికల్‌లో ఫిల్టర్‌బెడ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

పనులు నత్తనడకన సాగడంతో పూర్తి కావడానికి ఏడేళ్ల సమయం పట్టింది. 2014 జనవరి 11న ఫిల్టర్‌బెడ్ అందుబాటులోకి వచ్చినా కొద్ది రోజులే నీటి సరఫరా జరిగింది.

గత ప్రభుత్వ ఆధ్వర్యంలో మిషన్ భగీరథ పథకం రావడంతో ఫిల్టర్‌బెడ్ నిరుపయోగంగా మారింది. రెండేళ్ల కిందట ప్రభుత్వం సుమారు రూ.3 కోట్లు మంజూరు చేయడంతో ఫిల్టర్‌బెడ్ పునరుద్ధరణ పనులు ప్రారంభమయ్యాయి.

గతేడాది వేసవిలో ఏప్రిల్, మే నాటికి పనులు పూర్తి చేసి నీటి సరఫరా ప్రారంభించాల్సి ఉండగా ఇప్పటికీ పనులు కొనసా..గుతున్నాయి. మరోవైపు అమృత్ పథకంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.15.20 కోట్లు మంజూరయ్యాయి.

మిషన్ భగీరథ పథకంలో పాత ట్యాంకులకు నీటిని సరఫరా చేస్తున్నా పూర్తి స్థాయిలో పైప్‌లైన్లు, నల్లా కనెక్షన్లు లేకపోవడం, నీటి ఒత్తిడి లేకపోవడంతో సరఫరా కొన్ని ప్రాంతాలకే పరిమితమైంది.

**ఇప్పటికీ స్థల సేకరణ లేదు**
అమృత్ 2.0 పథకం కింద పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి 16 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకు, 2.5 లక్షల సామర్థ్యం కలిగిన సంపు నిర్మాణానికి కనీసం 20 గుంటల స్థలం అవసరం. స్థానికంగా ప్రభుత్వ భూమి అందుబాటులో లేక ఇప్పటికీ భూ సేకరణ జరగలేదు. 15 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ నిర్మించి, 1500 కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటివరకు పాక్షికంగా పనులు పూర్తి చేశారు. త్వరలో కొలువుదీరనున్న కొత్త పాలకవర్గమైనా సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# ఇంజినీ'రింగు'.. అవినీతి 'రంగు'



హైదరాబాద్ : చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపునకు సంబంధించి.. రూ.1.4 కోట్ల బిల్లు చెల్లించేందుకు రూ.40లక్షలు కమీషన్ డిమాండ్ చేశారనే ఆరోపణలతో.. రూ.15లక్షల లంచం తీసుకుంటూ కూకట్‌పల్లి జోన్ సూపరింటెండెంట్ ఇంజినీరు(ఎస్‌ఈ) చిన్నారెడ్డి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు.

జీహెచ్‌ఎంసీలో పనిచేస్తున్న కొందరు అవినీతి ఇంజినీర్లు.. గుత్తేదారులతో జతకట్టి నాసిరకం పనులతో ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారు. ఏటా కాలనీ రోడ్ల నిర్మాణం, వరద కాలువల మరమ్మతులు, పూడికతీత, పండగలు, ఉత్సవాలకు ఏర్పాట్లు, ఇతరత్రా చిన్నపాటి పనులకు రూ.800కోట్లు ఖర్చు చేస్తుండగా.. అందులో 30శాతం వరకు ఖర్చవుతోంది. మిగిలిన నిధులు గుత్తేదారులు, నేతలు, అధికారుల జేబుల్లోకి వెళ్తోందనే ఆరోపణలు ఉన్నాయి.

**రూ.150 కోట్ల నకిలీ బిల్లులు**
ఏడాదిన్నర కిందట అప్పటి కమిషనర్ ఇలంబర్తికి వింత పరిస్థితి ఎదురైంది. పాత కాలం నాటి బిల్లులు పెద్దయెత్తున ఆయన ఆమోదం కోసం వచ్చాయి. అనుమానాస్పదంగా ఉన్న రూ.400కోట్ల బిల్లులపై విజిలెన్స్ విచారణకు ఆదేశించగా.. రూ.150కోట్ల బిల్లులు నకిలీవని తేలింది. అందులో కూడళ్ల సుందరీకరణ, పండగల ఏర్పాట్లు, పంద్రాగస్టు, జనవరి 26 వేడుకలు, రాష్ట్ర అవతరణ దినోత్సవం వంటి పనులు ఉండటం గమనార్హం.

**కేంద్ర కార్యాలయం వరకు..**
ఇటీవలి వరకు ఖైరతాబాద్ ఎస్‌ఈగా పని చేసిన ఇంజినీరింగ్ అధికారిపై రూ.40లక్షల అవినీతి ఆరోపణలు చేస్తూ.. ఏకంగా కమిషనర్ ఆర్వీ.కర్ణన్‌కు గుత్తేదారు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఆ ఇంజినీరు కేంద్ర కార్యాలయంలో ఉన్నత స్థానంలో పని చేస్తున్నారు. ఇటీవల దోమల నియంత్రణ టెండర్లలోనూ బినామీ గుత్తేదారుకు పని దక్కేలా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా కమిషనర్ అదే ఇంజినీరింగ్ విభాగానికి దోమల నియంత్రణ బాధ్యతలు, పారిశుద్ధ్య విభాగాన్ని అప్పగించారు.

ఎవరెవరి వాటా ఎంతంటే.. పనులకు బిల్లు కావాలంటే.. గుత్తేదారు వర్క్ ఇన్‌స్పెక్టరుకు 3శాతం, డీఈకి 2-3శాతం, ఈఈకి 1-3శాతం, హెచ్‌డీకి 0.5, డీఏవోకు 0.5, ఎస్‌ఈకి 1, ఆడిట్‌లో 1, ఎఫ్ఏకు 1, రాజకీయ నేతలకు 2, గల్లీ లీడర్లకు 2శాతం లంచం ఇవ్వాల్సిందే.

**రోడ్లు వేయకుండానే..**
ఏడాది కిందట ఐఎస్ సదన్ డివిజన్‌లోని సైదాబాద్‌లో సీసీ రోడ్డు వేయకుండా రూ.9.9లక్షల బిల్లు తీసుకున్నారు. ఈ ఘటనలో డిప్యూటీ ఇంజినీరుపై సస్పెన్షన్ వేటు పడింది. సహాయ ఇంజినీరును విధుల్లోంచి తొలగించారు. అదే డివిజన్‌లో వరద కాలువకు మరమ్మతులు చేయకుండా మరో రూ.10లక్షలు కొల్లగొట్టారు.

పనుల్లో నాణ్యత ధ్రువీకరించాల్సిన అధికారులే ఏసీబీ దాడుల్లో పట్టుబడ్డారు. నాణ్యత నియంత్రణ విభాగం దొడ్డిదారిలో సర్టిఫికెట్లు ఇస్తోందని విమర్శలు ఉన్నాయి.

## మున్సి'పల్స్' పట్టుకుంటారా..?

హైదరాబాద్, చేవెళ్ల, మేడ్చల్ పట్టణం, శామీర్‌పేట, న్యూస్‌టుడే: రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల మున్సిపల్ ఎన్నికల్లో పట్టభద్రులైన యువత బరిలో దిగారు. వారిలో కొందరికి రాజకీయ నేపథ్యం ఉంది. మరికొందరు కొత్తవారు. రెండు జిల్లాలోని తొమ్మిది పురపాలికల్లో 25 శాతం మంది డిగ్రీ, ఎంబీఏ పూర్తి చేశారు. మహిళా అభ్యర్థుల్లో నలుగురు ఛైర్మన్ పదవులను ఆశిస్తున్నారు. తమ చుట్టూ ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు రాజకీయాల్లోకి అడుగుపెట్టామని, గెలుపే లక్ష్యంగా ప్రచారం చేస్తున్నామన్నారు. వారితో పాటు వార్డు సభ్యులుగా పోటీచేస్తున్న మరికొందరు యువకులు తమను గెలిపిస్తే మౌలిక వసతులు కల్పిస్తామని చెబుతున్నారు. స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం : బండారు శైలజ అగిరెడ్డి, అభ్యర్థి, బీఈడీ, చేవెళ్ల చేవెళ్ల మున్సిపాలిటీలోని మా వార్డులో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు, సరైన రహదారులు నిర్మించేందుకు ప్రణాళికలను రూపొందించుకున్నాం. తండా రూపురేఖలు మారుస్తా : ఎల్.శ్రీదేవి, బీటెక్, ఎల్లంపేట్ సైదోనిగడ్డ తండాలో అంతర్గత మురుగు కాలువలు, సీసీ రోడ్లు, మంచినీటి సౌకర్యం కల్పిస్తా. రూపురేఖలు మారుస్తా. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం : బండి లక్ష్మి, బీఏ, అలియాబాద్ ఉపాధ్యాయురాలిగా పని చేశా. ప్రజా సేవకు అవకాశం కల్పిస్తే అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తా.

# జాతర ముగిసె.. సవాళ్లు మిగిలె!

రెబ్బెన :జాతరలో ప్రధాన సమస్యగా గంగాపూర్ రైల్వేగేటు మారింది. ప్రతి అయిదు నిమిషాలకు ఓసారి రైళ్ల రాకపోకలు కొనసాగుతుండటంతో.. గేట్ మూసేస్తుంటారు. ఒక్కోసారి మూడు, నాలుగు రైళ్లు పోయేంత వరకు మూసేసి ఉంటుంది. దీంతో అర కిలోమీటర్‌మేర వాహనాలు రెండువైపులా నిలిచిపోతుంటాయి. ఇక్కడ పైవంతెన నిర్మిస్తే సమస్య తీరనుంది. ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గంగాపూర్ శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి జాతర సోమవారం వైభవంగా ముగిసింది. అధికారులు నెల రోజుల పాటు సదుపాయాలపై దృష్టి సారించి కసరత్తు చేశారు. భక్తులు విశేషంగా హాజరుకావడంతో.. కొన్ని విషయాల్లో అవస్థలు పడక తప్పలేదు. అయితే జాతర ఎన్నో సవాళ్లు, కొత్త అవకాశాలను కల్పించినట్లయింది. వాటిపై దృష్టిపెట్టి తగిన ప్రణాళికలు రూపొందించుకుని ముందుకుసాగితే వచ్చే ఏడాది జాతర నాటికి ఇబ్బందులు తప్పనున్నాయి. వీఐపీలకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఆలయం లోపలికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో కొంతమంది ఎదురుగా లోపలికి వెళ్తుండటంతో ప్రతిసారి సమస్యగా మారుతోంది. అదే మెట్ల సమీపంలో ఉన్న ఖాళీ



స్థలం నుంచి క్యూలైన్ ఏర్పాటు చేసి ఆలయం లోపలికి వెళ్లేందుకు మార్గం చేస్తే సమస్య తీరనుంది. జాతర జరిగే రోజుల్లో నెట్‌వర్క్ సమస్య తలెత్తుతోంది. గుట్టపై ఒక టవర్ ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తొలగనున్నాయి. గంగాపూర్ రైల్వేగేటు నుంచి ఉన్న బీటీ రోడ్డు వెడల్పు తక్కువగా ఉండటంతో ఏటా రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతూనే ఉన్నాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. మహిళలు, వృద్ధులు, పిల్లలు వాహనాలను నిలిపి వేసి బ్యాగులు మోసుకుని సుమారు 4 కి.మీ. దూరంలోని ఆలయం వరకు నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. వచ్చే ఏడాదిలోపు రెండు వరుసల రహదారిగా నిర్మించాల్సిన అవసరం ఉంది. ఆలయానికి వెళ్లేందుకు వాగుపై వంతెన లేక పెద్ద సమస్యగా మారింది. జాతర సమయంలో మట్టితో తాత్కాలికంగా రోడ్డు వేస్తున్నారు. ఇది వర్షాకాలంలో వరద తాకిడికి కొట్టుకుపోతోంది. ఇక్కడ లక్నవరంలో ఏర్పాటు చేసిన విధంగా వంతెన ఏర్పాటు చేస్తే అవస్థలు తప్పడంతోపాటు ఆలయానికి కొత్త కళ సంతరించుకుంటుంది. జాతర లేని సమయాల్లోనూ ఆలయానికి భక్తుల తాకిడి ఉంటుంది. వాగులో స్నానాలు చేసి దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు నిర్మించాలి.

# బొక్కివాగు తీరం.. విహంగాల స్వర్గధామం

రెబ్బెన :ఇటీవల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.హరిత ఈ ప్రాంతాన్ని సందర్శించి, ఇక్కడి ప్రకృతి అందాలను పక్షుల ఆవాసాలను స్వయంగా వీక్షించారు. ప్రాజెక్టు విశిష్టతను గుర్తించిన ఆమె దీనిని పర్యాటకంగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలించారు. ఈ క్రమంలోనే ఎల్లూరు గ్రామ పంచాయతీ ఒక అడుగు ముందుకేసి ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని చిత్తడి నేలగా గుర్తించాలని తీర్మానించింది.

నీటి అలల సవ్వడి.. చుట్టూ పచ్చని అడవి.. వేల మైళ్ల దూరం నుంచి వచ్చిన విదేశీ పక్షుల కిలకిలారావాలు.. ఇవన్నీ ఎక్కడో అనుకుంటున్నారా.. కుమురంభీం జిల్లా పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్లూరు బొక్కివాగు ప్రాజెక్టు తీరంలో కనిపించే సుందర దృశ్యాలు. ప్రస్తుతం ఒక అద్భుతమైన 'పక్షి సామ్రాజ్యం'లా విరాజిల్లుతోంది. కేవలం పొలాలకు నీరిచ్చే ప్రాజెక్టుగానే కాకుండా ప్రకృతి ప్రేమికులను మైమరిపించే పర్యాటక ప్రాంతంగా ఇది రూపుదిద్దుకుంటోంది. దేశ సరిహద్దులు దాటి వస్తున్న అరుదైన పక్షులకు ఈ జలాశయం ఒక సురక్షితమైన ప్రాంతంగా మారింది.

**పర్యాటకంగా అభివృద్ధి చేస్తే..**
ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే బహుళ ప్రయోజనాలు చేకూరనున్నాయి. నీటి సంరక్షణతోపాటు పక్షుల ఆవాసాలకు మరింత భద్రత చేకూరుతుంది. రవాణా అభివృద్ధితో పాటు స్థానిక యువతకు ఉపాధి లభిస్తుంది.

**దూర ప్రాంతాల నుంచి...**
ఈ ప్రాంతాన్ని విదేశీ పక్షులు ఆవాసంగా మార్చుకున్నాయి. ముఖ్యంగా ఇక్కడికి ఏటా డిసెంబరు నుంచి ఆగస్టు, సెప్టెంబర్ వరకు పక్షులు సందడి చేస్తాయి. ప్రాజెక్టు చెంత దాదాపు 70కి పైగా పక్షులు ఆవాసం ఏర్పరుచుకోగా.. పెంచికల్‌పేట్ మండలవ్యాప్తంగా 300 రకాల పక్షులు కనువిందు చేస్తాయి.

**పక్షుల రక్షణే ధ్యేయం** బొక్కివాగు ప్రాజెక్టు పక్షులకు ఎంతో అనువైన ప్రాంతం. సుదూర దేశాల నుంచి ఇక్కడికి వలస వచ్చే విహంగాల రక్షణే మా ధ్యేయం. స్థానిక ప్రజల భాగస్వామ్యంతో ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. అనిల్‌కుమార్, ఎఫ్ఆర్వో

# వెలుగులోకి గోండు రాజులనాటి ఆలయం

ఆసిఫాబాద్ : ప్రకృతి సోయగాలు, అటవీ సంపదకు నిలయమైన కుమురం భీం జిల్లాకు ఘనమైన చరిత్ర ఉంది. 16వ శతాబ్దం వరకు గోండురాజులు పాలించిన ఈ ప్రాంతానికి నాటి చారిత్రక ఆనవాళ్లు చెక్కు చెదరకుండా నేటికీ దర్శనమిస్తున్నాయి. ఆసిఫాబాద్ పట్టణానికి 12 కిలోమీటర్ల దూరంలోని దేవదుర్గం కొండపై రాతికట్టడంలో ఉన్న శివాలయం నాటి శిల్పకళా వైభవానికి ప్రతీక. ఇప్పటి వరకు బయటి ప్రపంచానికి దూరంగా ఉన్న ఈ శివాలయాన్ని తాజాగా హైదరాబాద్‌కు చెందిన టీవీ దర్శకుడు దండనాయకుల మానస్ ఆధ్వర్యంలో.. డాక్యుమెంటరీ చిత్రీకరణ బృందం గోండు పూజారి ఆత్రం పాండు, స్థానికుల సహకారంతో దర్శించింది.

**12వ శతాబ్దపు నిర్మాణ ఆనవాళ్లు** మహారాష్ట్రలోని చాందా గోండురాజుల సామ్రాజ్య పరిధిలోని ఆసిఫాబాద్ ప్రాంతం 16వ శతాబ్దం వరకు పాలించినట్లు చరిత్ర చెబుతోంది. ఆసిఫాబాద్‌లోని అంకమరాజు సమాధి ఇందుకు నిదర్శనం. ఆసిఫాబాద్‌లోని బాలేశ్వరాలయం అంకమరాజు పాలనలో ప్రసిద్ధికెక్కిందని చెబుతుంటారు. అదే సమయంలో దేవదుర్గం శివాలయం కూడా ప్రాచుర్యం పొంది ఉంటుందని భావిస్తున్నారు. దేవదుర్గం ప్రాంతాన్ని ఏలిన 12వ శతాబ్దం నాటి రాజు అక్కడ ఒకే రాత్రిలో ఆలయాన్ని నిర్మించినట్లు స్థానికులు చెబుతున్నారు. కాలక్రమంలో అక్కడి ప్రజలు వలసలు వెళ్లడంతో ఆలయాన్ని పట్టించుకునేవారు లేక మరుగునపడి శిథిలావస్థకు చేరినట్లు డాక్యుమెంటరీ దర్శకుడు మానస్ తెలిపారు. ఇక్కడి నుంచి అప్పటి రాజులు మహారాష్ట్రలోని చాంద వరకు సొరంగ మార్గాన్ని ఏర్పాటు చేసుకున్న ఆనవాళ్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

చురకలు



# వ్యాపారులదే ఎ'జెండా'!

ఖమ్మం : ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు తేజరకం ఎండు మిరప పోటెత్తింది. ఈ సీజన్‌లోనే అత్యధికంగా సుమారు 30వేల బస్తాలకు పైగా రావటంతో యార్డు మొత్తం ఎర్రబంగారంతో నిండింది. మరోవైపు ధరలు పతనమవటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మార్కెట్‌కు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, సూర్యాపేట, నల్గొండ జిల్లాలు, ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు సరకు తెచ్చారు. ఇక్కడ రోజురోజుకూ నిల్వలు పెరుగుతున్నప్పటికీ ధరలు ఆశాజనకంగా లేకపోవటం అన్నదాతలను కుంగదీస్తోంది.

**ధర అమాంతం తగ్గించి..**

మార్కెట్‌లో క్వింటా మిరప జెండా పాట రూ.19,700గా నిర్ణయించారు. కనిష్ఠ ధర రూ.12వేలు, నమూనా ధర రూ.19వేలు, తాలుమిరప గరిష్ఠ ధర రూ.11,800, కనిష్ఠ ధర రూ.8వేలు, నమూనా ధర రూ.10వేల చొప్పున కొనుగోలు చేస్తామని వ్యాపారులు ప్రకటించారు. కానీ ధర అమాంతం తగ్గించి కొనుగోలు చేశారు.



డిమాండ్ లేదని చెప్పి జెండా పాట కంటే క్వింటాకు రూ.4వేల నుంచి రూ.5వేల వరకు తగ్గించారు. క్వింటా కనీసం రూ.18వేల నుంచి రూ.19వేల మధ్య కొనుగోలు చేస్తారని ఆశించిన అన్నదాతలు భంగపడ్డారు. విపణిలో వ్యాపారులు ఎప్పటి మాదిరిగానే జెండా పాటను పెంచటం, ఆ తరువాత తగ్గించి కొనుగోలు చేయటం పరిపాటిగా మారింది.

**విదేశాల నుంచి ఆర్డర్లు లేవంటూ..**

విదేశాల నుంచి ఆర్డర్లు లేవని, దేశీయంగానే విక్రయించాల్సి ఉన్నందున ఎక్కువ ధర పెట్టి కొనుగోలు చేయలేమని వ్యాపారులు చెబుతున్నారు. ఎన్నో కష్టాలు పడి పంట పండించిన రైతులు మార్కెట్‌కు వచ్చిన తరువాత ధర విషయంలో దగా పడుతున్నారు. ఇబ్బడిముబ్బడిగా పెట్టుబడులు పెరగటం, ప్రతికూల పరిస్థితుల వల్ల దిగుబడులు తగ్గటం.. పైగా వ్యాపారుల మాయాజాలంతో మిరప రైతులకు తీరని నష్టం వాటిల్లుతోంది.

# దిగుబడి తగ్గినా.. ధర మురిపిస్తోంది!

మేళ్లచెరువు : జిల్లాలో పత్తి తర్వాత ఎక్కువ విస్తీర్ణంలో సాగయ్యే వాణిజ్య పంట మిరప. ఈ సంవత్సరం నల్లి దెబ్బకు దిగుబడి సగం తగ్గింది. ఈ దశలోనే ధర అమాంతం రెండింతలైంది. గత మూడేళ్లలో పోలిస్తే ఈసారి రైతుకు సంతృప్తినిస్తోంది. ధర ఆశాజనకంగా ఉండటంతో కోసిన మిరప కాయల్ని కల్లాల వద్దే విక్రయిస్తున్నారు. గతేడాది ధరల్లేక శీతల గోదాంలలో నిల్వ చేసిన రైతుల ముఖాల్లో కాస్త కళ కన్పిస్తోంది. ఈసారి ధర పెరగడం తమకు ఆర్థిక ఉపశమనం కలిగించినట్టేనని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఎక్కువగా సూర్యాపేట జిల్లా కృష్ణపట్టి ప్రాంతాల్లోనే మిరప సాగు చేస్తారు. గతేడాది ధరల ప్రభావంతో జిల్లాలో ఈసారి సగం విస్తీర్ణంలో సాగు తగ్గించారు. నల్లి దెబ్బకు దిగుబడులూ సగానికి పడిపోయాయి.

**దేశీయంగానే డిమాండ్:**

స్థానిక వినియోగదారులు, కారంపొడి కంపెనీల నుంచి వచ్చే ఆర్డర్ల వల్ల కిలో ఎండు మిర్చి ధర రూ.300 పైనే పలుకుతోంది. ప్రస్తుతం విదేశీ ఆర్డర్ల కంటే దేశీయ కొనుగోళ్లే ఎక్కువగా ఉన్నందున ధరలు ఇప్పట్లో తగ్గేలా లేవని చెబుతున్నారు. మన దగ్గర పండించిన మిరప గుంటూరు, ఖమ్మం, వరంగల్ మార్కెట్లకు వెళ్తుంది. అక్కడ్నుంచి చైనా, బంగ్లాదేశ్, తైవాన్, మలేసియా తదితర దేశాలకు ఎగుమతి అవుతుంది. ఈసారి ఆర్డర్లున్నప్పటికీ దిగుబడులు తగ్గడం, స్థానిక డిమాండ్‌తో ఎగుమతిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఫిబ్రవరిలో క్వింటా ధర రూ.20 వేలు పైనే పెరిగే అవకాశాలున్నాయని వ్యాపార వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. అయినా ఇప్పుడున్న ధరలూ ఆశాజనకంగా ఉండటంతో కల్లాల మీదనే కాయల్ని అమ్ముకుంటున్నారు.

**రెండెకరాల్లో వేశా: శ్రీను, మేళ్లచెరువు**

గతేడాది 25-30 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అప్పుడు ధర రూ.8-9 వేలకు మించలేదు. దిగుబడి వచ్చినా ధరలేక నష్టపోయాం. ఈసారి రెండెకరాల్లో సాగు చేశాను. దిగుబడి 10-15 క్వింటాళ్లే వచ్చింది. ధర బాగుంది. దిగుబడి రాలేదనే బాధనిపిస్తోంది.

# ఇందూర్.. కావాలి మరో ఇండోర్

సుభాష్‌నగర్ : ఆదర్శ నగరాలంటే ఎత్తైన భవనాలు, మెరిసే రోడ్లు మాత్రమే కాదు. ప్రజల మెరుగైన జీవన ప్రమాణాలను పెంచే వ్యవస్థలే అసలైన ప్రతీకలు. ఇది పాలకులు, అధికార యంత్రాంగం చిత్తశుద్ధి ప్రజా భాగస్వామ్యంతోనే సాధ్యం. శుభ్రత, మౌలిక సదుపాయాలు, వినూత్న అంశాల్లో అగ్రపథాన దూసుకెళ్లే మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరాన్ని ఇందూరు ఆదర్శంగా తీసుకోవాలని ఓటర్లు కోరుతున్నారు. దేశంలోనే ఖ్యాతిగాంచిన ఆ క్లీనెస్ట్ సిటీని ఎలా ఆదర్శంగా నిలుస్తుందంటే...'స్వచ్ఛ సర్వేక్షణ్'లో... గత ఏడేళ్లలో ఇండోర్ నగరానిదే దేశవ్యాప్త ప్రథమ ర్యాంకు. ఎక్కడా చెత్త కనిపించదు. కూడళ్లలో చెత్త డబ్బాలనేవి ఉండవు. ఇళ్ల వద్దే వంద శాతం చెత్త సేకరణ జరుగుతుంది. ఈ విషయంలో నిజామాబాద్ మెరుగుపడాలి. 90 శాతం మంది తడి, పొడి చెత్త కలిపి ఇస్తున్నారు. కూడళ్లల్లో వ్యర్థాలు పారబోస్తున్నారు. కానీ, ఇండోర్‌లో తడి, పొడి, బయో, శానిటరీ అంటూ ఆరు రకాలుగా నివాసాల్లోనే చెత్త వేరుచేసి ఇస్తూ చైతన్యం చాటుతున్నారు. పౌర భాగస్వామ్యం ఉంటే.. ఏ ప్రాజెక్టు తలపెట్టినా సత్ఫలితాలు సాధ్యమే. వంద శాతం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సాధ్యపడాలంటే ఇండోర్ తరహాలో శుభ్రత, అవగాహన కార్యక్రమాల్లో ప్రజా సహకారం మెరుగవ్వాలి. ఫీడ్‌బ్యాక్, ప్రోత్సాహకాలతో వారిలో మార్పు తేవాలి. కమ్యూనిటీలు, కాలనీ సంక్షేమ సంఘాల భాగస్వామ్యంతో జవాబుదారీతనం పెరగాలి.

వ్యవస్థల సమన్వయం.. నగర పాలనలో శాఖల సమన్వయం చాలా కీలకం. నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) ప్రణాళికలో భాగంగా కొత్త డ్రైనేజీలను నిర్మించడమే కాకుండా.. రహదారులు, తాగునీటి సరఫరా, సీవరేజీ వ్యవస్థలను అనుసంధానించాలి. శాఖల సమన్వయంతో సమస్యలకు సత్వర పరిష్కారం చూపడంలో ఇండోర్ మార్గదర్శిగా నిలుస్తోంది.

బృహత్తర ప్రణాళిక.. ఇదెంత సమర్థంగా అమలైతే కేంద్ర ప్రభుత్వ 'స్మార్ట్ సిటీ' లక్ష్యం అంత దగ్గరవుతుంది. రింగు రోడ్డు, నీటి పారుదల వ్యవస్థ ఆధునికీరణ, జల వనరుల సమృద్ధికి మన నగరంలో సరైన దిశలో ప్రయత్నం సాగాలి. ఇన్‌ఫ్రాలో పీపీపీ విధానంతో ఇండోర్ సాధించిన ప్రగతి మనకూ అనుసరణీయమే. నిరంతర సమీక్ష.. ఈ విషయంలో కలెక్టర్, కమిషనర్ నేతృత్వంలోని యంత్రాంగంతో పాటు త్వరలో ఎన్నికయ్యే నూతన పాలకవర్గం జట్టుగా సాగాలి. పథకాల అమలు, పాలన, వసతుల కల్పనకు వార, మాసాంతపు సమీక్షలు పక్కాగా నిర్వహించాలి. అప్పుడే ఇందూర్ మరో ఇండోర్ అవ్వాలనే చిరకాల కల సాకారమవుతుంది.

# శవాగారం.. సమస్యల జాగారం




హైదరాబాద్ : ప్రభుత్వ ఆసుపత్రుల్లోని శవాగారాల్లో సమస్యలు తిష్ఠవేశాయి. మార్చురీల లోపలకు అడుగు పెట్టాలంటే భయపడే పరిస్థితి. మృతదేహాలను భద్రపరిచే ఫ్రీజర్ బాక్సులు తరచూ పనిచేయక పోవడంతో త్వరగా పాడవుతున్నాయి. నగరంలో ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లోనే పోస్టుమార్టం చేస్తుంటారు. సమీప జిల్లాల నుంచి కూడా ఇక్కడికే వాటిని తరలిస్తుంటారు. పోస్టుమార్టం తర్వాత వాటిని ఫ్రీజర్లలో భద్రపరుస్తారు. ప్రస్తుతం ఈ రెండు దవాఖానాల్లో సగానికి పైగా ఫ్రీజర్ బాక్సులు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. కరెంటు లేనిసమయంలో బ్యాటరీలు పనిచేయక పోవడం వల్ల ఆగిపోతున్నాయి.

**పలుమార్లు మరమ్మతులు**

గాంధీ ఆసుపత్రి మార్చురీలో ఆరు మృతదేహాల చొప్పున ఉంచేందుకు తొమ్మిది ఫ్రీజర్ బాక్సులు, నాలుగేసి మృతదేహాలను భద్రపరిచేందుకు నాలుగు బాక్సులు ఉన్నాయి. మొత్తం 70 మృతదేహాలను ఇక్కడ భద్రపరిచేందుకు సామర్థ్యం ఉంది. కరోనా సమయంలో కొత్త బాక్సులను సమకూర్చారు. నిత్యం 20కి పైగా శవాగారాలకు తరలిస్తుంటారు. రెండేళ్లుగా ఫ్రీజర్ బాక్సులు తరచూ పాడవుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. కొన్నిసార్లు ఎక్కువ మృతదేహాలు వస్తే.. వాటిని ఎక్కడ పెట్టాలో తెలియక నేలపై ఉంచుతున్నారు. రెండు, మూడు రోజుల వరకు అంత్యక్రియలు జరగకపోవడంతో దుర్గంధం వ్యాపిస్తోంది.

**ఉన్నవి 40.. సేవలు అంతంతే..**

ఉస్మానియాలో 40 ఫ్రీజర్ బాక్సులు ఉండగా...30 వరకు పనిచేస్తున్నాయి. శవాగారానికి ప్రత్యేకంగా జనరేటర్ లేకపోవడంతో.. కరెంటు పోయిన సందర్భంలో బ్యాటరీలపై ఇవి నడుస్తున్నాయి. కొన్ని బాక్సులకు సంబంధించి బ్యాటరీలు పనిచేయడం లేదు. చనిపోయిన వారికి బంధువులు ఇతర సంబంధీకులు ఉంటేనే వారి వినతి మేరకు ఫ్రీజర్ బాక్సుల్లో పెడుతున్నారు. అనాథ మృతదేహాలైతే సిబ్బంది దారుణంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి వాటికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం అక్కడ ఉన్న పఫ్‌రూమ్‌కు తరలిస్తారు. రెండు, మూడు రోజుల తర్వాత జీహెచ్ఎంసీ సిబ్బందికి అప్పగించి ఖననం చేస్తున్నారు. కొన్నిసార్లు పఫ్‌రూంలో మృతదేహాలు బాగా కుళ్లిపోయిన వరకు ఉండిపోతున్నాయి.

# అగ్నిమాప'కాలే'..




హైదరాబాద్: చాంద్రాయణగుట్ట ఫైర్‌స్టేషన్, లంగర్‌హౌజ్, జూబ్లీహిల్స్, అంబర్‌పేట్ సహా మరికొన్ని ఫైర్‌స్టేషన్లకు శాశ్వత భవనాలు లేవు. సామగ్రి, అగ్నిమాపక పరికరాలను ఇరుకైన గదుల్లో భద్రపరచటం కష్టంగా ఉంది. నీటిసంపు, ఇతర సౌకర్యాలు కూడా లేవు. రోగుల సంఖ్య ఎక్కువగా ఉండే ఉస్మానియా ఆసుపత్రిలో ప్రమాదాల నివారణకు అగ్నిమాపక శాఖ.. యాకుత్‌పురాలో ఏర్పాటు చేసే స్టేషన్‌ను ఆసుపత్రికి మార్చింది. తాత్కాలికంగా స్థలం ఇవ్వగా షెడ్డులో ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. కనీస వసతులు లేవు.

ఆపదలో ఆదుకునే అగ్నిమాపక సిబ్బంది ఫైర్‌స్టేషన్లలో సౌకర్యాలు లేక సతమతం అవుతున్నారు. భవనాలు లేకపోవటంతో చాలా స్టేషన్లకు రేకుల షెడ్లే దిక్కయ్యాయి. ఫైరింజన్లయినా కండీషన్‌లో ఉన్నాయా అంటే అదీ లేదు. ఫలితంగా ప్రమాద స్థలికి చేరుకునేసరికే పుణ్యకాలం పూర్తవుతోంది. గ్రేటర్‌లో అగ్ని ప్రమాదమంటే జనం హడలెత్తిపోతున్నారు. నాంపల్లిలోని ఫర్నిచర్ షాప్, గుల్జార్‌హౌజ్ ఘటనల తర్వాత రానున్న వేసవిలో ఉంటుందోనని మరింత ఆందోళన వ్యక్తమవుతోంది.

**మరమ్మతుల్లో తీవ్ర జాప్యం..**

ఫైరింజన్లు పాడయితే మరమ్మతులు చేయడానికి నెలలు పడుతోంది. ఫ్యాబ్రికేషన్‌తో పాటు పంపింగ్ మరమ్మతులు చేపట్టే సంస్థలు ఎక్కువగా లేకపోవడమే ఇందుకు కారణం.

గ్రేటర్‌లో ఐదంతస్తుల కంటే ఎత్తయిన భవనాలు లక్షకు పైనే ఉన్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడల్లా ఫైరింజన్లలోని బ్యాక్ మౌంటెడ్ పంపులతో అధిక పీడనంతో నీటిని కొడుతూ మంటలు ఆర్పుతున్నారు. ఈ కారణంగా తరచూ సమస్యలు వస్తున్నాయి.

గ్రేటర్‌లో నీటి సేకరణ సవాల్‌గా మారింది. గ్రేటర్‌లో మొత్తం 33 ఫైర్‌స్టేషన్లు ఉండగా 50 శాతం స్టేషన్లలో నీటి సంపులు లేవు.

మంటలను త్వరగా అదుపులోకి తెచ్చే అగ్ని నిరోధక బాంబులు నగరంలోని ఏ ఫైర్‌స్టేషన్‌లోనూ లేవు.

3 స్టేషన్లకు రూ.2 కోట్ల చొప్పున నిధులు..

వేసవికి అగ్నిమాపక శాఖ సిద్ధంగా ఉంది. తాత్కాలిక భవనాల్లోని జూబ్లీహిల్స్, చాంద్రాయణగుట్ట, అంబర్‌పేట్ ఫైర్ స్టేషన్లకు రూ.2కోట్ల చొప్పున మంజూరయ్యాయి. భూములు కేటాయిస్తే నిర్మాణం చేపడతాం. లంగర్‌హౌజ్ ఫైర్‌స్టేషన్‌ను బాపూఘాట్‌కు తరలించాం. చాంద్రాయణగుట్ట ఫైర్‌స్టేషన్ న్యాక్ భవనంలో ఉంది.

వెంకన్న, హైదరాబాద్ జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి

# ఏళ్ల తరబడి.. అదే ఒరవడి



కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో వర్షాకాలం వచ్చిందంటే చాలు ప్రధాన రహదారులు జలమయం అవుతున్నాయి. ఏటా ఈ సమస్య ఇబ్బందికరంగా మారుతున్నా శాశ్వత పరిష్కారం మాత్రం కనిపించడంలేదు. మూడేళ్ల కిందట రూ.132 కోట్లతో అంతర్గత, ప్రధాన వరద కాలువలు నిర్మించారు. అత్యధిక శాతం ప్రాంతాల్లో వరద నీటి సమస్య తప్పింది. ఆర్అండ్‌బీ రహదారులపై మాత్రం వదిలేయడంతో ప్రధాన రహదారులు నదులను తలపిస్తున్నాయి.

**వీధుల్లో జల ప్రవాహం**

ప్రభుత్వాసుపత్రి, మంచిర్యాల చౌరస్తాలో వరదతో నిండుతోంది. ఆదర్శ నగర్, కోర్టు చౌరస్తా మీదుగా వచ్చే నీటితో కూడలిలో నిలిచి శర్మనగర్ వైపు పరుగులు పెడుతోంది. దాంతో సమీప ఇళ్లలోకి ముంపు సమస్య ఎదురవుతోంది. నాకా చౌరస్తా నుంచి పెద్దపల్లి రోడ్డులో ఓ ప్రైవేటు ఆసుపత్రి ఎదురుగా కల్వర్టు వంకలు తిరగడం, ఎగువ నుంచి వచ్చే వరదతో హుస్సేనీపుర వీధుల్లోకి వరద ప్రవహిస్తోంది. లోతట్టులో ప్రాంతంలో ఉన్న ఇళ్లు మునుగుతున్నాయి. మంకమ్మతోట రెండో పోలీసుస్టేషన్ పక్కనున్న వరద కాలువ గుండా వరద ఆశించిన స్థాయిలో ప్రవహించడం లేదు.

**పరిష్కారానికి హామీ ఇస్తారా?**

ఏళ్ల తరబడి ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన రహదారులు నీట మునుగుతుండగా దాని పరిష్కారానికి నేతలు హామీ ఇస్తారా అంటూ నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. మరి నగరపాలక ఎన్నికలలో నేతల వాగ్దానాలు ఎలా ఉంటాయో చూడాల్సిందే.

ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు లోతట్టు ప్రాంతాల గుండా నదిలోకి వెళ్లేందుకు ప్రధాన కాలువలు ఉన్నాయి. అయితే రహదారులు, భవనాల శాఖ రోడ్లపై ఉన్న డ్రైనేజీలు ఇరుకుగా ఉండటం, కల్వర్టులు నిర్మించకపోవడం, ఉన్న చోట్ల శిథిలం కావడంతో సమస్యలు వస్తున్నాయి. ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం, ప్రణాళికలు చేసినా నిధుల కొరత కారణంగా ప్రజలు అవస్థలు పడుతున్నారు.

ఆర్టీసీ వర్క్‌షాప్ ఎదురుగా ఎగువ ప్రాంతాల నుంచి వరదతో రహదారి నిండుతోంది. వరద నీరు వెళ్లేందుకు సరైన స్థాయిలో కాలువలు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వెళ్లే వాహనాలు కొన్ని గంటలపాటు దారి మళ్లించాల్సిన పరిస్థితి వస్తోంది.

డివిజన్లు : 66

నగర జనాభా : 4.50 లక్షలు

నగర ఓటర్లు : 3,40,580

# కొత్తింటి ఆశతో ఉన్న గూడును కూల్చారు

పాల్వంచ : ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ భూక్యా ప్రమీలా. తోగ్గూడెం గ్రామం. ఆమెకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైంది. 30 రోజుల్లో ఇంటిని ఎంతో సంతోషంతో అప్పటి వరకు నీడ కల్పించిన గూడును కూల్చారు. కొత్త ఇంటికి వాస్తు ప్రకారం నిర్మించుకున్నారు. పునాదులు, బేస్‌మెంట్ లెవల్ వరకు కట్టుకొని బిల్లులు కోసం ఫొటో తీసే క్రమంలో ఇందిరమ్మ ఇంటి యాప్‌లో రిజెక్టు అయినట్లు చూపింది. దీంతో ఆమె లబోదిబోమంటోంది. టేకులపల్లి మండలం, దాసుతండా గ్రామానికి చెందిన ధరావత్ రమ్యాశిల్పాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఇందిరమ్మ యాప్‌లో రిజెక్టు అయ్యింది. ఆమె ఎల్3లో పేర్లు ఉన్నట్లు ఆమె పేరు రిజెక్టు అయ్యింది. దీంతో ఆమెకు రూ.లక్ష బిల్లురాక ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న ఇల్లు తొలగించుకొని వేరే ఇంట్లో అద్దెకు ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. ఒక్క ప్రమీల, రమ్యాశిల్పానే కాదు.. జిల్లా వ్యాప్తంగా 856 మంది బాధితులు ఉన్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని సంతోషపడ్డారు. అధికారులు తొందరపెట్టడంతో ఉన్న ఇంటిని తొలగించి కొత్త ఇంటి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వాస్తులు చూసి పునాదులు కట్టారు. తీరా బిల్లులు మంజూరయ్యే క్రమంలో మీరు అనర్హులంటూ ఇంటి బిల్లులు నిలిపివేశారు. దీంతో ఏం చేయాలో అర్థంకాక లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 22 మండలాల్లో 856 లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో రిజెక్టు అయినట్లు నివేదికలు చెబుతున్నాయి. వీరిలో అధికంగా పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన పంచాయతీలే వారే ఉండటం గమనార్హం. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఎల్ 1 (ఇంటి స్థలం ఉన్న అర్హులు), ఎల్ 2 (స్థలం లేని అర్హులు), ఎల్3 (ఉద్యోగం, ఫోర్‌వీలర్ ఉన్న అనర్హులు) సర్వే చేశారు. కొందరు అధికారులు, ఇందిరమ్మకమిటీ సభ్యులు అనర్హులను, అర్హులుగా తేల్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించారు. కానీ గృహనిర్మాణ ఎండీ.. ఇందిరమ్మ



ఇళ్లజాబితా.. ఉద్యోగులు జాబితా, ఆర్టీఏ అధికారుల వద్ద వాహనాల జాబితాను తీసుకొని ఏఐ (ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్)తో సర్వే చేయడంతో అనర్హులకు వచ్చినట్లు నివేదిక వచ్చింది. అప్పటికే వీరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరై బేస్‌మెంట్ వరకు కట్టుకోవడంతో బిల్లులు రిజెక్టయ్యాయి.

**160 ఇళ్లు శాశ్వతంగా రద్దు..**

ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో తిరస్కరణకు గురైన (రిజెక్టు) 856 ఇళ్లల్లో 160 ఇళ్లను రద్దు చేశారు. వీరు పక్కా అనర్హులుగా తేల్చి వీరిని రిజెక్టు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మిగిలిన ఇళ్లకు మాత్రం మళ్లీ అధికారులు విచారణ చేసి నివేదికలు తయారు చేస్తున్నారు. సర్వేలో లోపమా.. ఫొటోలు తీయడంలో లోపమా.. తదితర అంశాలతో స్థానిక గృహనిర్మాణ ఏఈ, పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో సర్వేలు చేసి జిల్లాస్థాయి అధికారులకు, రాష్ట్రస్థాయి అధికారులకు పంపతున్నప్పటికీ సమస్య తీరట్లేదు. దీనిపై గృహనిర్మాణ పీడీ రవీంద్రనాథ్ వివరణ కోరగా రిజెక్టు అయిన ఇళ్లకు మళ్లీ విచారణ నిర్వహించి ఆ నివేదికను రాష్ట్రస్థాయి అధికారులకు పంపిస్తామన్నారు.

# ఇల్లు కట్టుకో.. ఉపాధి పట్టుకో..!

రాజపేట : ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపులో ప్రభుత్వం తాజాగా కొన్ని నూతన మార్పులు చేసింది. మొదటి, రెండు, నాలుగు విడతలు మినహా మిగిలిన మూడో విడత బిల్లుల చెల్లింపుల్లో మార్పులు చేపట్టింది. దీనిని వీబీ జీరామ్‌జీ పథకానికి అనుసంధానం చేయడంతో మార్పు అనివార్యంగా మారిందని అధికారులంటున్నారు. ముఖ్యంగా జాబ్‌కార్డు కలిగి ఉన్న ఇందిరమ్మ లబ్ధిదారులకు 90 రోజులు పని కల్పించి, ఆ వేతనం డబ్బులను వారి ఖాతాల్లో జమ చేయనున్నారు.

**జాబితా తయారీలో నిమగ్నం**

రెండేళ్లుగా ఉపాధిహామీలో కొత్తగా జాబ్‌కార్డుల జారీ నిలిచిపోయిన విషయం తెలిసిందే. అయితే ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారిలో జాబ్‌కార్డులు లేనివారు చాలా మంది ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు. ఈ పథకాన్ని వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడిందనే చెప్పవచ్చు. వారికి ప్రత్యేకంగా జాబ్‌కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం జాబితాలను తయారు చేసి పంపించారు. వీరిలో కొందరికి ఈ పాటికే నూతన జాబ్‌కార్డులు అందించగా, త్వరలోనే ప్రక్రియ పూర్తి చేయనున్నట్లుగా సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

**బిల్లుల చెల్లింపు క్రమం ఇలా..**

ఒక్కో ఇంటికి ప్రభుత్వం రూ.5 లక్షలు చెల్లిస్తున్న విషయం తెలిసిందే. పునాది వరకు పూర్తి చేస్తే రూ.లక్ష, గోడలు నిర్మించిన తర్వాత రూ.లక్ష, స్లాబ్ వేసిన తర్వాత రూ.1.40 లక్షలు, పని పూర్తయిన తర్వాత రూ.లక్ష చొప్పున మొత్తం రూ.4.40 లక్షలు చెల్లించనున్నారు. తర్వాత ఉపాధిహామీ కింద రోజుకు రూ.307 చొప్పున 90 రోజులకు రూ.27,630, స్వచ్ఛభారత్ మిషన్ కింద శౌచాలయం నిర్మించుకుంటే రూ.12వేలు, ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజన కింద రూ.21వేల చొప్పున మొత్తం రూ.60 వేలను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు.

**జిల్లా సమాచారం..**

మంజూరైన మొత్తం ఇళ్లు : 10,056

ప్రారంభించినవి : 7,315

జాబ్‌కార్డు లేనివారు : 4,938

కొత్తగా జారీ చేసింది : 4,053

ఇంకా చేయాల్సింది : 885

చురకలు



## సీఎండీకే 'షాక్'

హైదరాబాద్: విద్యుత్తు సంస్థలో కొందరు సిబ్బంది, అధికారుల అక్రమాలపై ఫిర్యాదులు రావడంతో విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై చర్యలకు విజిలెన్స్ విభాగం సిఫార్సు చేసింది. నివేదిక ఆధారంగా క్రమశిక్షణ చర్యలకు ఆదేశించి నెలలు గడుస్తోంది. అయినా చర్యలు తీసుకోకపోవడంపై ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఇటీవల ఓ సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ఏఈ, పైస్థాయిలో సీఎండీకి తప్ప మధ్యలో ఎవరికీ బాధ్యతలు పట్టవా అంటూ అసహనం వ్యక్తం చేశారు. అవినీతికి పాల్పడటం, అనుమతి లేకున్నా, సరైన పత్రాలు లేకుండా విద్యుత్తు కనెక్షన్లు, మీటర్లు ఇవ్వడం, ఆక్యుపెన్సీ పత్రం లేకుండా బహుళ అంతస్తులకు కరెంట్ సరఫరా చేయడం వరకు కొందరు సిబ్బంది పలు అక్రమాలకు పాల్పడ్డారు. ప్రతి సర్కిల్‌లో ఓ అండ్ ఎం విభాగంపై ఫిర్యాదులు వచ్చాయి. ఏఈ, డీఈలను బాధ్యులను చేశారు.

**సర్కిళ్ల వారీగా ఆదేశాలు ఇలా..**

హైదరాబాద్ సౌత్ సర్కిల్‌లో చర్యలకు నవంబరు 28న ఎస్‌ఈని ఆదేశించారు. మరో కేసులో అక్టోబరు 10న చర్యలకు సిఫార్సు చేశారు. సంగారెడ్డి సర్కిల్‌లో విజిలెన్స్ విచారణ జరిపి సీఈ చర్యలు తీసుకోవాలని నవంబరు 15న సిఫార్సు చేసినా మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఓసీ లేకుండా బహుళ అంతస్తుల భవనానికి మీటర్ల జారీలో బోయిన్




పల్లి ఆపరేషన్ ఏఈ, ఏడీఈ బోయిన్‌పల్లి ఐఎస్ఎస్‌ఈ ఏడీఈపై చర్యలకు మెట్రోజోన్ సీఈని ఆదేశించారు.

సైబర్‌సిటీ, రాజేంద్రనగర్ సర్కిల్‌లో బాలాజీనగర్ సెక్షన్ లైన్‌మెన్, కేపీహెచ్‌బీ సెక్షన్ లైన్ ఇన్‌స్పెక్టర్, గతంలో అల్లాపూర్ సెక్షన్‌లో పనిచేసిన ఏఈ, ప్రైవేటు మీటర్ రీడర్, ఇబ్రహీంబాగ్ లైన్‌మెన్‌పై చర్యలకు నవంబరు 6న ఆదేశాలు వెళ్లాయి.

హబ్సిగూడ సర్కిల్‌లో చర్యలకు మేడ్చల్ జోన్ సీఈని ఆదేశించారు. మరో కేసులో అల్విన్‌కాలనీ లైన్‌మెన్, పేట్‌బషీరాబాద్ లైన్‌మెన్‌పై చర్యలకు అక్టోబరు 30న ఆదేశించారు.

ఈ నెల 3న సరూర్‌నగర్ సర్కిల్‌లో చర్యలకు రంగారెడ్డి జోన్ సీఈని ఆదేశించారు.మేడ్చల్‌సర్కిల్‌లో కేటగిరీ-8 కింద కాకుండా కేటగిరీ 1, 2 కింద కనెక్షన్ల జారీ, డిస్కం ఆదాయానికి గండి కొట్టడంతో కూకట్‌పల్లి లైన్‌ఇన్‌స్పెక్టర్, ఏఈ, ఏడీఈ, బాచుపల్లి లైన్‌ఇన్‌స్పెక్టర్, ఏఏఈ, ఏడీఈ, మియాపూర్ ఏడీఈపై చర్యలకు ఆదేశించారు.

## జాతీయ వనం.. మురుగు కూపం

మన్సూరాబాద్: విశాలమైన పచ్చని వనంలో వన్యప్రాణులు స్వేచ్ఛగా ఉండే పరిస్థితి క్రమంగా తగ్గిపోతోంది. సమీప ప్రాంతాల మురుగు వెల్లడంతో సరైన డ్రైనేజీలైన్ లేకపోవడంతో మురుగు అడవిలోకి వస్తోంది. జాతీయ వనంలోని కొంత ప్రాంతం మురుగు కూపంగా మారిపోతోంది. మురుగు, వర్షపు నీరు అటవీప్రాంతంలోని చెరువులోకి చేరుతోంది. ఆ నీరు కొన్ని ప్రాంతాల జంతువులకు ప్రాణాంతకంగా మారుతోంది. ఈ సమస్య 20 ఏళ్లుగా ఉన్నా.. ఈ ఏడాది అధిక వర్షాలతో మరింత ఇబ్బందికరంగా మారింది. సమస్యకు పరిష్కారం చూపించడంలో ఆటోనగర్, అటవీశాఖ, జీహెచ్ఎంసీ అధికారులు విఫలమవుతున్నాయి. అక్కడే కొంతమంది ట్యాంకర్లతో రసాయనాలు తీసుకొచ్చి వదిలేస్తున్నారు.

**చెట్లు ఎండిపోయి..:** మురుగు, వ్యర్థాలతో సుమారు 15 ఎకరాల అటవీ స్థలం నిండిపోయింది. మురుగు ఉన్న చోట చెట్లు ఎండిపోయాయి. వన్యప్రాణులకు జరిగే నష్టం వివరాలను అధికారులు బయటపెట్టడం లేదు. ఆటోనగర్ పారిశ్రామిక వాడలో మురుగు శుద్ధి కేంద్రం నిర్మించినా సమస్య పరిష్కారం కాలేదు. దాని సామర్థ్యం తక్కువగా ఉండటం, నిర్వహణ లోపంతో మురుగు అలాగే బహిరంగ ప్రదేశంలోకి వెళ్లిపోతోంది.

ఆటోనగర్ పారిశ్రామికవాడ నుంచి వరద కాలువ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాన్ని సౌత్ ఎండ్ పార్కు కాలనీ దాకా నిర్మించి వదిలేశారు. పనులు పూర్తి చేస్తే అడవిలోకి మురుగు వెళ్లకుండా నివారించవచ్చు. మహవీర్ హరిణ వనస్థలి జాతీయ ఉద్యానవనం: 14.50కి.మీ విస్తీర్ణంలో ఉంది. విజయవాడ జాతీయ రహదారి పక్క నుంచి కుంట్లూర్, బండ్లగూడ, మన్సూరాబాద్, తట్టిఅన్నారం, మర్రిపల్లి, కుత్బుల్లాపూర్ ప్రాంతాల్లో విస్తరించింది.

**వన్యప్రాణులు:** చుక్కల జింకలు: 1000, కృష్ణ జింకలు: 500, దుప్పులు, నెమళ్లు: లెక్కలు లేవు. కుందేళ్లు, పక్షులు ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి.

**బెజవాడ సాయిప్రకాశ్, ఎఫ్ఆర్వో**

మురుగు వద్దకు జంతువులు రాకుండా కంచె ఏర్పాటు చేశాం. రసాయన ట్యాంకర్లు రాకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ప్రహరీ పూర్తయితే మురుగు రాకుండా ఉంటుంది.

## ఆకాశహర్మ్యాల్లో.. అగ్నిని ఆర్పేదెలా?

హైదరాబాద్: బృహత్‌నగరంలో సూపర్ హైరైజ్ భవనాలు రానున్నాయి.. ప్రస్తుతం నగరంలోని అత్యధిక ఎత్తయిన భవనం కోకాపేట్‌లో(60 అంతస్తుల భవనం) ఉండగా త్వరలో ఘట్‌కేసర్‌లో 72 అంతస్తుల భవనం నిర్మించబోతున్నారు. ప్రాథమికంగా ఎన్వోసీ కోసం దరఖాస్తు చేసుకోగా.. అనుమతులు జారీ చేసినట్లు అగ్నిమాపకశాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్‌సింగ్‌మాన్ ఇటీవల వెల్లడించారు. దక్షిణాసియాలోనే ఇంత ఎత్తయిన భవనం కానుంది. ఇలాంటి భవనాల్లో ప్రమాదాల సమయంలో మంటలార్పే అధునాతన పరికరాలు కొనుగోలు చేస్తామని, సాంకేతికతను వినియోగించుకుంటామని తెలిపారు. 850కి పైగా ఎత్తయిన భవనాలు.. ఎత్తయిన భవనాల విషయంలో ముంబయి తర్వాత హైదరాబాద్ రెండోస్థానంలో కొనసాగుతోంది.. ప్రస్తుతం నగరంలో 850కి పైగా ఎత్తయిన భవనాలున్నాయి. అయితే మంటలు ఆర్పే బ్రాంటో స్కైలిఫ్ట్ వాహనాలు కేవలం 54 మీటర్ల ఎత్తు వరకు (18 అంతస్తులు) మాత్రమే సేవలందిస్తాయి. 72 అంతస్తుల భవనం (220 నుంచి 250 మీటర్ల ఎత్తు) సేవలందించే వాహనాలు, పరికరాలు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉంది. 72 అంతస్తుల భవనానికి బయటి నుంచి మంటలార్పే వ్యవస్థ లేనందున పూర్తిగా లోపలి వ్యవస్థలపైనే ఆధారపడాల్సి ఉంది. 2030 నాటికి 112 నుంచి 120 మీటర్ల ఎత్తున్న బ్రాంటో స్కై లిఫ్ట్, 150 మీటర్ల టర్న్‌టేబుల్ లాడర్, ఫైర్ ఫైటింగ్ డ్రోన్లు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యల్లో బరువు మోసేందుకు ఉపయోగపడే ఎక్సోస్కెలిటన్ సూట్లు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉంది. దేశంలో ఏ నగరంలోనూ 100 మీటర్ల పైన మంటలను బయటి నుంచి ఆర్పే వ్యవస్థ లేదు. లోపలున్న స్ప్రింక్లర్, రైజర్, ప్రెజరైజేషన్ వ్యవస్థలపైనే ఆధారపడాలి.

# పర్యాటక శోభ దక్కేనా..?



బూర్గంపాడు : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రాచీన శైవక్షేత్రాల్లో మోతెగడ్డ వీరభద్రుడి ఆలయం ఒకటి. ఇక్కడ వీరభద్రుడు భద్రకాళీ సమేతుడై స్వయంభూగా కొలువై ఉన్నాడు. నిత్యం పరవళ్లు తొక్కే పావన గోదావరి నడుమ ఈ ఆలయం ద్వీపకల్పంలా వెలుగొందుతోంది. సారపాక నుంచి భద్రాచలం వెళ్లే వారికి వంతెన మీద నుంచి ఈ ఆలయం కనిపిస్తూ ఉంటుంది. దర్శించిన వారికి ఆధ్యాత్మికతతో పాటు ఇక్కడి ప్రకృతి అందాలను తిలకించే వీలుంది.


**కాకతీయుల కాలంలో నిర్మాణం..**

ఈ ఆలయాన్ని కాకతీయుల కాలంలో నిర్మించారని ప్రచారంలో ఉంది. శివరాత్రి పర్వదినాన్ని ఇక్కడ అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు ఈ వేడుకకు వస్తారు. లింగోద్భవ సమయాన స్వామివారి కల్యాణాన్ని తిలకించి పులకితులవుతుంటారు. ఈ ఆలయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు గతేడాది వినతిపత్రం అందించారు. అభివృద్ధి చేస్తే భక్తులకు సౌకర్యంగా ఉండటంతో పాటు స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందని విన్నవించినా ఆ దిశగా ముందడుగు పడలేదు. గోదావరి నడుమ కొలువై ఉండటంతో 365 రోజులు భక్తులు వెళ్లే అవకాశం ఉండటం లేదు. గోదావరి నిండుగా ప్రవహించే సమయంలో ఆలయంలో పూజలు సైతం కొనసాగే వీలు లేదు. శివరాత్రి పర్వదినాన మాత్రమే ఈ ఆలయాన్ని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుంటారు. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే నిత్యం స్వామివారి దర్శనానికి ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చే వీలుంది. భద్రాచలం రామాలయానికి వచ్చేవాళ్లు సైతం వీరభద్రుడి ఆలయాన్ని దర్శించుకునే అవకాశం ఉంటుంది.

**ఇవి చేస్తే మేలు..**మోతె పుష్కరఘాట్ నుంచి ఆలయానికి బోటింగ్ ఏర్పాటు చేస్తే స్థానికులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు దర్శించే వీలుంది.భద్రాచలంలోని స్నానఘట్టాల నుంచి మోతెగడ్డ వరకు బోటింగ్ సౌకర్యం కల్పిస్తే రామాలయాన్ని దర్శించుకునే భక్తులు మోతెగడ్డను సందర్శించే అవకాశం ఉంది.

ఈ ఏడాది ముక్కోటి పర్వదినం సందర్భంగా కలెక్టర్ ప్రత్యేక చొరవతో గోదావరిలో ఏరు మహోత్సవం ఏర్పాటు చేశారు. అదే తరహాలో మోతెగడ్డలోనూ ఏర్పాటు చేస్తే పర్యాటకులకు సౌకర్యంగా ఉంటుంది. గోదావరిలో బోటింగ్‌తో పాటు నదీ తీరాన గుడారాలు ఏర్పాటు చేసి అవసరమైన సౌకర్యాలు కల్పించి తగిన ప్రచారం కల్పిస్తే రాష్ట్రం నలుమూలల నుంచి ఇక్కడకు వచ్చే అవకాశం ఉంది.

# ప్రతి పనికీ.. నిబంధనలే అడ్డంకి!




ఖమ్మం : భద్రాద్రి జిల్లాలోని ఓ పాఠశాలలో 20 రకాల క్రీడాసామగ్రి, దుస్తులకు రూ.50వేలు మంజూరయ్యాయి. దుకాణ యజమాని ఖాతాలో నిధులు జమకాకపోవటంతో ఆయన ఆ వస్తువులు ఇవ్వటం లేదు. చెడిపోయిన పరికరాలతో జనవరి 26కు ఆటలు ఆడించేదెలా అని ఉపాధ్యాయులు మదనపడుతున్నారు.

పీఎంశ్రీ పాఠశాలల్లో విద్యార్థుల ప్రగతికి వెచ్చించాల్సిన నిధులకు.. నిబంధనలు ఒకింత అడ్డంకిగా మారుతున్నాయి. ప్రతి చిన్నపనికీ ముందే మూడురకాల బిల్లుల రూపకల్పన, ఆపై నిధుల విడుదల్లో జాప్యం కారణంగా గల్లాపెట్టెలోనే కాసులు మురుగుతున్నాయి. విద్యాసంవత్సరం చివరికొస్తుండగా.. ఇప్పటివరకు ఖమ్మం జిల్లాలో 32.85%, భద్రాద్రి జిల్లాలో 13.96% పైకం వెచ్చించటం గమనార్హం.

**జీఎస్టీ తప్పనిసరి..** పీఎంశ్రీ కింద ఉభయ జిల్లాల్లో 52 పాఠశాలలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆయా పాఠశాలల్లో కెరియర్ గైడెన్స్, బాలికల సాధికారత, ఆర్థిక అక్షరాస్యత, ఆత్మరక్షణ విద్య, యోగాలో శిక్షణ, పర్యాటక, పరిశ్రమల సందర్శన, స్కూల్ గ్రాంట్ కింద కలిపి వరుసగా రూ.2.29కోట్లు, రూ.1.59కోట్లను కేటాయించింది. 2024-25 విద్యాసంవత్సరంలో ఏపనికైనా సంబంధిత ప్రధానోపాధ్యాయులు ముందే డబ్బులు చెల్లించి తరువాత బిల్లులు సమర్పించేవారు. ఈ విధానంలో వేరే జిల్లాలో నిధులు దుర్వినియోగమవటంతో 2025-26లో నిబంధనలను ప్రభుత్వం మార్చింది. ప్రతి పనికి హెచ్ఎం మూడు రకాల బిల్లులు రూపొందించాలి. ప్రతి బిల్లుకు జీఎస్టీ ఉండాలి. వీటితోపాటు దుకాణ యజమాని (వెండర్) ఖాతా వివరాలను ట్రెజరీలో ముందస్తుగా సమర్పించాలి. వీటిని పరిశీలించిన తరువాత వెండర్ ఖాతాలో నిధులను అధికారులు జమచేస్తారు. పల్లెలు, మండలకేంద్రాల్లో జీఎస్టీలతో కూడిన బిల్లులు దొరకటం కష్టంగా మారింది. ఒకవేళ దొరికినా ఒక్కో పనికి మూడు రకాల బిల్లులు ఇవ్వటానికి దుకాణాల యజమానులు ఇష్టపడటం లేదు. శిక్షణ ఇచ్చిన తరువాత కొద్దిరోజులకు డబ్బులు చెల్లిస్తామంటే పిల్లలకు కెరియర్ గైడెన్స్ బోధించేందుకు నిపుణులూ ఆసక్తి చూపటం లేదు.

**ఆగిన బిల్లులు** టూర్ బస్సులు, భోజనాలకు బిల్లుల సేకరణ, చెల్లింపులో జాప్యం కారణంగా ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. బతుకమ్మ వేడుకలకు రూ.10వేలు, పాఠశాల స్థాయి క్రీడలకు రూ.20వేలు లాంటి బిల్లులు రాగా.. క్రీడా పరికరాలు, టూర్ల బిల్లులు ఆగినట్లు సమాచారం. కరాటే, యోగా తరగతులు మొదలైనా నేటికీ శిక్షకులకు జీతాలు ఇవ్వలేదు. రెండు, మూడు నెలలకోసారి చెల్లించే పరిస్థితి దాపురించింది. 'ఇతర జిల్లాలతో పోల్చితే ఖమ్మం జిల్లాలోనే అధికంగా నిధులు ఖర్చు చేశాం' అని ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ తెలిపారు.

# పుష్కరాల సమయం.. నివేదికలు సిద్ధం



భద్రాచలం : భద్రాచలంలోని గోదావరితో పాటు దేశంలోని నదులు మానవ మనుగడకు ఆధారంగా అనాది కాలం నుంచి సహకరిస్తున్నాయి. జలమే జీవనాధారమై నాగరికతను చాటుతోంది. నీటి వనరుల్లో కాలుష్యం అంతగా లేదని అధికారిక సర్వేలు చెబుతున్నా కళ్లకు కనిపిస్తున్న కాలుష్యాన్ని విస్మరించలేం. ఏరు ఉత్సవంలో ఆధ్యాత్మిక వైభవంతో పాటు జల వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఉంది. పుష్కరాల ఉద్దేశం కూడా ఇదేనని అవగాహన కల్పించాలి. నదుల పరిరక్షణే శ్రీరామ రక్ష. దీన్ని గుర్తించి ఆయా ప్రాంతాల యువత చైతన్య శంఖం పూరించాలి.

**నదిని పూజించడం సంస్కృతిలో భాగం**గంగ, గోదావరి, నర్మద, సరస్వతి, యమున, కృష్ణ, కావేరి, సింధు, తుంగభద్ర నదులు రామాయణ కాలంలోనే ఉన్నాయి. రాముడు అయోధ్య నుంచి పర్ణశాలకు వనవాసం కోసం వచ్చినప్పుడు వీటి గురించి ప్రస్తావించారు. 40కి పైగా నదులు గురించి రామాయణంలో పొందుపర్చారు. ప్రతీ పన్నెండేళ్లకోసారి పుష్కరాల పేరిట నదులను పూజించడం సంస్కృతిలో భాగంగా మారింది. గంగానది, నర్మద, సరస్వతి, యమున, గోదావరి, కృష్ణా నది, కావేరి, భీమరథి, పుష్కర నది, తుంగభద్ర, సింధు, ప్రాణహిత నదుల్లో ఒక్కో ఏడాది ఒక్కో నదికి పుష్కరాలు వస్తాయి. గోదావరి నది అనేది గౌతముడి గోహత్యా పాతకాన్ని పోగొట్టేందుకు జన్మించిది. దక్షిణ గంగగా కీర్తికెక్కింది. ఈ నదీ తీరంలో సీతారాముల వారు పర్ణశాల నిర్మించుకున్నారు. రామాయణంలోని ముఖ్య ఘట్టాలకు గోదావరి తీరం వేదికైంది.

**ఉన్నత స్థాయి సమీక్షలు**వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు చేస్తారు. ఈ ఏర్పాట్లపై ప్రభుత్వం ఉన్నత స్థాయి సమీక్షలు చేస్తోంది. భద్రాచలం నుంచి బాసర వరకు గోదావరి ఘాట్‌లకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాల గురించి దేవాదాయశాఖ అధికారులు దృష్టి సారించారు. ఇందుకు నీటిపారుదల శాఖ సహకారం తీసుకుంటున్నారు. ఇదే క్రమంలో గుర్తింపు పొందిన సంస్థల ద్వారా క్షేత్రస్థాయిలో సర్వేలు చేస్తున్నారు. రద్దీ తలెత్తినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమాలోచనలు సాగిస్తున్నారు. సంబంధించిన సర్వే నివేదికలను సిద్ధం చేసి ప్రభుత్వానికి అందించారు. భద్రాచలం గోదావరి ఘాట్ అభివృద్ధితో పాటు రామాలయంలో కల్పించాల్సిన సదుపాయాలపై స్పష్టత రావాల్సి ఉంది.

## లష్కర్ల నియామకం

ఖమ్మం : లష్కర్ల నియామకంతో జిల్లాలో నీటి పారుదల శాఖ జవసత్వాలను నింపుకుంది. దశాబ్దాల నుంచి జరగని లష్కర్ల నియామకాన్ని పొరుగు సేవల విధానంతో ప్రభుత్వం ఇటీవల చేపట్టింది. కొద్ది రోజుల క్రితమే సిబ్బంది విధుల్లో చేరారు. పర్యవేక్షణాధికారుల ఆధ్వర్యంలో పనుల్లో సైతం దిగడంతో పిచ్చి మొక్కలు, ముళ్ల చెట్లతో అస్తవ్యస్తంగా ఉన్న నీటి సరఫరా కాల్వల కట్టలు కొత్తరూపాన్ని సంతరించుకుంటున్నాయి. యాసంగిలో పంటల సాగుకు సక్రమ రీతిలో నీరందించే క్రమంలో లష్కర్ల పాత్ర కీలకం కానుంది.

**ఖమ్మం జిల్లాకు 172 మంది..**

జిల్లాకు 172 మందిని ప్రభుత్వం ఏజెన్సీల ద్వారా నియమించింది. పదో తరగతి విద్యార్హతతో రూ.15,600 వేతనంతో లష్కర్లు విధుల్లో చేరారు. జిల్లాకు నియమితులైన సిబ్బందిని ఖమ్మం, కల్లూరు సర్కిళ్ల పరిధిలో కేటాయించారు. ఖమ్మం సర్కిల్‌కు 73 మంది, కల్లూరు సర్కిల్‌కు 99 మందిని నియమించారు. ఖమ్మం సర్కిల్ పరిధిలోని



పాలేరు డివిజన్‌కు 40 మంది, ఖమ్మం డివిజన్‌కు 11 మంది, వైరా డివిజన్‌కు 22 మంది, కల్లూరు సర్కిల్ పరిధిలోని కల్లూరు డివిజన్‌కు 34 మంది, సత్తుపల్లికి 19 మంది, మధిరకు 46 మంది నియామకం జరిగింది.

**విధులు ఇవే..**

ప్రతి ఒక్క లష్కర్ కనీసం 9 కిలోమీటర్ల పరిధిలోని కాల్వల పరిరక్షణ చేపట్టాల్సి ఉంటుంది. కాల్వలు, కట్టలపై పిచ్చి మొక్కలను తొలగించడం, కట్ట పటిష్ఠత పరిశీలన, నీటి సరఫరాలో ఏమైనా అవాంతరాలు ఉంటే పర్యవేక్షణాధికారుల దృష్టికి తీసుకెళ్లడం లాంటివి చేస్తారు. కాల్వలో నిర్ణీత పరిమాణంలో నీటిని సరఫరా చేస్తూ.. ఆయకట్టుకు సమాంతరంగా నీరు చేరేలా పర్యవేక్షించడం, గేట్లు, షట్టర్ల నిర్వహణ, ఏమైనా మరమ్మతులు అవసరమైతే అధికారుల దృష్టికి తీసుకెళ్లడం తదితరాలను అధికారులకు నివేదిస్తారు.పొరుగుసేవల విధానంతో జిల్లాలో 172 మంది నియామకం జరిగింది. డివిజన్ల వారీగా కేటాయించాం. డీఈఈలు, ఏఈల పర్యవేక్షణలో లష్కర్లు విధుల్లో చేరి కేటాయించిన పనులు చేపడుతున్నారు.

మంగళంపూడి వెంకటేశ్వర్లు. ఎస్ఈ ఖమ్మం సర్కిల్

## ప్రయోగం.. ఆలోచనలకు రూపం

హుజూర్‌నగర్ : సృజనాత్మక ఆలోచనలకు శాస్త్రీయ రూపం కల్పించి వాటి ప్రయోగాత్మక నమూనాలు చేసి ఔరా అనిపించారు విద్యార్థులు. హుజూర్‌నగర్ విజయ విద్యామందిర్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో తమ నమూనాలను ప్రదర్శించారు. శాస్త్ర, సాంకేతికతతో అనేక సమస్యలకు పరిష్కారాలు చూపించిన తీరు సందర్శకులను ఆలోచింపజేసింది. ఇన్‌స్పైర్‌కు ఎంపికైన నమూనాలను తయారు చేసిన వారిని పలకరించగా వాటి ఉపయోగాలను వివరించారు.

**అప్రమత్తం చేసేలా..**

ప్రమాదాలను తగ్గించడానికి, ఆరోగ్య హెచ్చరికలతో కూడిన స్మార్ట్ స్టీరింగ్ ఇది. శరీర, మానసిక దృఢత్వాన్ని నిరంతరం పర్యవేక్షిస్తుంది. నిద్రమత్తు, ధూమపానం, మద్యపానం, వాహనం ముందు అడ్డంకులను స్మార్ట్ స్టీరింగ్ కనిపెడుతుంది. ఇందులోని మైక్రో కంట్రోలర్‌తో అనుసంధానమైన స్మార్ట్ సెన్సార్‌లతో ఇది పనిచేస్తుంది. వాహనం నడిపే సమయంలో అసాధారణ ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ముందుగానే హెచ్చరించి అప్రమత్తంగా వ్యవహరించడానికి, ఇతర హెచ్చరికలను ఇది ముందే చెబుతుంది. దీని ద్వారా ప్రమాదాలను తగ్గించుకోవచ్చు.

కె.మహిధర్, సూర్యాపేట

**ఇంట్లో లేకున్నా మొక్కలకు నీరు..**

నీటిని పొదుపుగా వాడుతూ ఇళ్లలో మొక్కల పెంపకం, వ్యవసాయం ఎలా చేయాలో ఈ నమూనా తెలియజేస్తోంది. ఇందులో మొక్కకు నీరు ఎంత పెట్టాలనుకుంటున్నారో దానికి సెన్సార్ ఏర్పాటు చేసి మోటారు ఆన్ చేయాలి. మొక్కకు నీరు సరిపడా రాగానే ఆటోమేటిక్‌గా మోటారు ఆగిపోతుంది. పెరటి మొక్కలకు, పెద్ద తోటలకు దీన్ని ఉపయోగించుకోవచ్చు. దీనివల్ల మనం ఇంట్లో లేని సమయంలోనూ నీరు పెట్టవచ్చు. నీటి పొదుపుతో పాటు విద్యుత్తు కూడా ఆదా అవుతుంది. ఎస్కే రషీద్, కోదాడ

**ట్రాఫిక్‌ను బట్టి కదిలే డివైడర్**

ట్రాఫిక్ ఇబ్బందులతో అతి తక్కువ దూరం కూడా గంటల తరబడి వెళ్లాల్సి వస్తుంది. అలాంటి సమయాలలో కదిలే డివైడర్లను ఏర్పాటు చేసుకోవడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించి గమ్యాన్ని త్వరగా చేరుకోవచ్చు. కదిలే డివైడర్లు ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్ల సాయంతో రోడ్డు డివైడర్లకు అనుసంధానం చేసి ఎక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు ఉంటాయో అక్కడ డివైడర్లు అనుకూలంగా కదిలే అవకాశం ఉంటుంది. చాలా సందర్భాలలో ఒకవైపు భారీ ట్రాఫిక్ ఉంటుంది. మరో వైపు ఉండదు. అలాంటి సమయాలలో డివైడర్లను నియంత్రించడం ద్వారా ట్రాఫిక్ సమస్యను తగ్గించుకోవచ్చు.ఎస్‌కె సమీర, సూర్యాపేట

## కూరగాయల కుతకుత..

ఎనుమాముల : వరంగల్ లక్ష్మీపురం మార్కెట్‌లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. కొద్దిరోజులుగా ధరలు అమాంతం పెరుగుతుండటంతో.. పేద, మధ్య తరగతి ప్రజలపై ఆర్థిక భారం పడుతోంది. మరోవైపు చలి తీవ్రత కారణంగా.. కోళ్ల ఉత్పత్తి తగ్గడంతో.. చికెన్, గుడ్లు ధరలు సామాన్యుడికి అందనంటున్నాయి. గత అక్టోబరులో వచ్చిన మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు వరంగల్ జిల్లా పరిసర ప్రాంతాల్లో కూరగాయల తోటలు తీవ్రంగా దెబ్బతినడమే ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు.

**రిటైల్ ధరలు మరింత ఘాటు**లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో ధరల నియంత్రణపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో.. రిటైల్ ధరలు మరింత ఎక్కువగా ఉంటున్నాయి. సాధారణంగా ప్రతిరోజు మార్కెట్‌కు వచ్చిన సరకు డిమాండ్‌ను బట్టి ధరలను నిర్ణయించి.. మార్కెట్ అధికారులు ధరల బోర్డులో సరకు ధరలను ప్రదర్శిస్తారు. మార్కెట్ పరిధిలో ఆ ధరలను మించి వ్యాపారులు విక్రయించేందుకు అవకాశం ఉండదు. అయితే మార్కెట్ చుట్టూ చిరు వ్యాపారులు విస్తరించడంతో.. మార్కెట్‌లో తక్కువ ధరకు సరకు కొని.. మార్కెట్ వెలుపల రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. అసలే కూరగాయల ధరలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో చిరు వ్యాపారుల తీరు వినియోగదారులకు భారంగా మారుతోంది. **వామ్మో.. టమాట..**జిల్లా పరిధిలోని వర్ధన్నపేట, ఖిలావరంగల్, ఐనవోలు మండలాల్లోని కొన్ని గ్రామాలు, సంగెం మండలం వంజరపల్లి తదితర గ్రామాల్లో వాతావరణ అనుకూలతల మేరకు డిసెంబరు నుంచి మార్చి వరకు మాత్రమే టమాట పండిస్తారు. అయితే ఈసారి డిసెంబరులో చలితీవ్రత కారణంగా.. టమాట దిగుబడి భారీగా తగ్గిందని రైతులు చెబుతున్నారు. దీంతో వ్యాపారులు ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా మదనపల్లి, కర్ణాటకలోని చింతామణి, భాగ్యపల్లి తదితర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు.

## దాత ఆశయం.. గ్రామ వికాసం

మండపేట : జన్మభూమి రుణం తీర్చుకోవడానికి ఏదైనా మంచిపని చేయాలని భావించిన మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త నామాల పురుషోత్తమరావు ఆ గ్రామాన్ని వివిధ రూపాల్లో అభివృద్ధి చేసి చూపించారు. గ్రామంపై ఉన్న మక్కువతో పాటు స్థానికులు ఆరోగ్యంగా ఉండాలని రూ.5 కోట్ల నిధులతో పంచాయతీ చెరువు చుట్టూ ఉద్యానవనం, వాకింగ్‌ట్రాక్‌ను ఆధునిక హంగులతో నిర్మించారు. ఈ రెండూ ప్రస్తుతం గ్రామస్థులకు ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తున్నాయి.

**సొంత నిధులతో నిర్వహణ..**

దాత పురుషోత్తమరావు సొంత నిధులతో వీటి నిర్వహణ బాధ్యతలు వహిస్తున్నారు. సిబ్బందిని నియమించి పరిశుభ్రతపై ప్రత్యేకంగా దృష్టిసారించి నిత్యం సుందరంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.



రోజూ ఉదయం 4.30 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఇందులో నడకను అనుమతిస్తారు. నిత్యం పార్కులో నడక, వ్యాయామం చేస్తున్నవారి సంఖ్య పెరుగుతోంది.

**ఇవీ ప్రత్యేకతలు..**

పిల్లలు, పెద్దలకు ఆహ్లాదంతో పాటు ఆరోగ్యం కోసం చెరువు చుట్టూ నడకదారి ఏర్పాటుచేశారు. చెరువు మధ్యలో వివేకానందుడి విగ్రహం, నీళ్లలో కలువలు చూపరులను అకర్షిస్తున్నాయి. పిల్లలు ఆడుకునేందుకు పలు రకాల ఆట వస్తువులు, మహిళలు వ్యాయామం చేయడానికి ప్రత్యేక పరికరాలు ఏర్పాటుచేశారు. పెద్దలకు యోగా కేంద్రం, వ్యాయామ పరికరాలు అందుబాటులో ఉన్నాయి. వృద్ధులు కాసేపు కూర్చొని సేదదీరడానికి బల్లలు సిద్ధంగా ఉంటాయి. యువత చరవాణులలో స్వీయచిత్రాలు తీసుకోవడానికి ఉద్యానవనాన్ని అందంగా తీర్చిదిద్దారు. సౌరశక్తి ఫలకాలతో విద్యుత్తు వెలుగులు అమర్చారు. రాత్రివేళల్లో ఈ కాంతులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

**ఎంతోమందికి ప్రయోజనం..**

రోజూ నేను నడకతో పాటు వ్యాయామం చేస్తాను. దీనివల్ల ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఈ పార్కునకు స్థానికులు ఉత్సాహంగా వస్తున్నారు. దీన్ని నిర్మించక ముందు నడవడానికి వీలులేక చాలామంది వీధుల్లో నడిచేవారు. ఉద్యానం అందుబాటులోకి రావడంతో చిన్నపిల్లల నుంచి పెద్దవారి వరకు అందరికి ఉపయుక్తంగా ఉంది.

పసల వెంకట సత్యాదేవి, ఏడిద

**నడకతో ఆరోగ్యం మెరుగు..**

గ్రామస్థులకు నడక, వ్యాయామానికి ఈ పార్కు చాలా ఉపయోగపడుతోంది. వ్యాయామంతో పాటు పిల్లలు, పెద్దలకు ఆహ్లాదం పంచుతోంది. నడకతో గుండె ఆరోగ్యం, బరువు నియంత్రణలో ఉంటుంది. అందుకే నేను రోజూ వాకింగ్ చేస్తాను.పర్వతిన వీర్రాజు, ఏడిద

## గ్రానైట్ బిల్లుల రగడ!

ఒంగోలు: గ్రానైట్ రవాణాలో వే బిల్లుల వ్యవహారం వివాదాలకు దారితీస్తోంది. సీనరేజీ వసూలు చేసే ప్రైవేటు సంస్థ డబ్బులు తీసుకుని రసీదులు ఇవ్వకపోవడం సమస్యకు మూలంగా మారింది. దీంతో పరిశ్రమ యజమానులు, రవాణాదారులు, జీఎస్టీ, గనులశాఖల అధికారుల మధ్య వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. గత రెండు నెలలుగా రసీదులతో పలు సమస్యలు ఎదురవుతున్నా పరిష్కారానికి అధికార యంత్రాంగం చొరవ తీసుకోకపోవడంతో గ్రానైట్ వ్యాపారంపై ప్రభావం చూపుతోంది.

**చీమకుర్తి గ్రానైట్‌కు పెద్ద దెబ్బ**

పేరొందిన చీమకుర్తి గ్రానైట్ దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాలకు రవాణా అవుతోంది.ఇక్కడ నుంచి అన్ని రసీదులు సక్రమంగా తీసుకుని రవాణా చేస్తే ఎలాంటి ఇబ్బందులుండవు. గతంలో 20 శాతం వరకు రసీదుల్లేకుండా సరకు తరలిపోతుండేది. ప్రస్తుతం దానికి భిన్నంగా ఎలాంటి రసీదుల్లేకుండానే మొత్తం జీరో వ్యాపారం అన్నట్లు తెల్ల కాగితంపై అనుమతులు తెరపైకి వచ్చాయి. దీంతో జీఎస్టీ ఆదాయానికి గండి పడుతుండగా, అధికారుల దాడులతో రవాణాదారులు బెంబేలెత్తిపోయే పరిస్థితి నెలకొంది. మరోవైపు సకాలంలో సరకు గమ్యస్థానం చేరక అటు సరకు ఆర్డర్ చేసిన వ్యాపారులు నష్టపోతున్నారు. దీంతో గ్రానైట్ రంగమే మొత్తం అస్తవ్యస్తంగా మారే పరిస్థితి దాపురించింది. తాత్కాలిక ప్రయోజనాలు కాకుండా దీర్ఘకాలికంగా ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రసీదుల సమస్యను పరిష్కరించాలని గ్రానైట్ రంగంపై ఆధారపడినవారు కోరుతున్నారు.

**పోలీసుస్టేషన్లకు పంచాయితీ**

గత వారం ఒంగోలు నుంచి చెన్నై పోర్టుకు గ్రానైట్ తరలిస్తున్న స్లాబుల కంటైనర్‌ను జీఎస్టీ అధికారులు నిలుపుదల చేసి రసీదులు అడిగారు. ఎలాంటి రసీదులు లేకపోవడంతో సరకుతో ఉన్న లారీని గనులశాఖ అధికారులకు అప్పగించారు. రసీదులు లేనందున రూ.5 లక్షలు జరిమానా విధిస్తూ నోటీసులు పంపారు. రవాణాదారు గనులశాఖ కార్యాలయానికి



చేరుకుని రూ.35 వేలు ప్రైవేటు సీనరేజీ సంస్థకు చెల్లించానని, వాళ్లు చిన్న చీటిపై అనుమతులు రాసిచ్చారని అధికారులకు వివరించే ప్రయత్నం చేశారు. డబ్బులు చెల్లిస్తే తానెలా అక్రమంగా తరలిస్తున్నట్లు అవుతుందని ప్రశ్నించారు. ఈ క్రమంలో వ్యక్తిగత దూషణలకు దిగడంతో అసలు వ్యవహారం పక్కకు వెళ్లి వివాదం పోలీసు స్టేషన్‌కు చేరింది. రసీదులు ఇవ్వాల్సిన ప్రైవేటు సీనరేజీ సంస్థ ఇవ్వకపోవడమే అసలు సమస్య అని స్పష్టమవుతోంది.

**రెండు నెలలుగా ఇదే తంతు**

గత నెలలో యర్రగొండపాలెంలో ఇదే మాదిరి హైదరాబాద్‌కు సరకు తరలిస్తున్న రెండు లారీలను జీఎస్టీ అధికారులు నిలిపి రసీదులు అడిగారు. రసీదులు ప్రైవేటు సంస్థ ఇవ్వలేదని, తాము డబ్బులు చెల్లించినట్లు వాళు ఇదే మాదిరి చెప్పారు. గనులశాఖ అధికారులు వాటికి రూ.లక్షల్లో జరిమానా కట్టాలంటూ నోటీసులిచ్చారు. సంస్థాగతంగా ఉన్న విషయంపై ఉన్నతాధికారులు ఎవరూ జోక్యం చేసుకోకపోవడంతో అధికారులు, గ్రానైట్ రంగానికి చెందినవారు రోడ్డెక్కే పరిస్థితి నెలకొంది. వరుస సంఘటనలు చోటు చేసుకుంటున్నా ఉన్నతాధికారులు అసలు సమస్యకు పరిష్కారం చూపడంలేదు. తమకేమీ పట్టన్నట్లు వ్యవహరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## వాహనం ఆపొద్దు.. ఆయువు తీయొద్దు




తిరుపతి : జిల్లాలోని ఏమూలకు వెళ్లినా జాతీయ రహదారులు కనిపిస్తున్నాయి. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలూ పొరుగునే ఉన్న నేపథ్యంలో సరకు రవాణాలో జిల్లా కీలకంగా మారింది. విజయవాడ, బెంగళూరు, చెన్నై మార్గంలో అత్యధికంగా లారీలు, కంటైనర్లు, టిప్పర్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈక్రమంలో వాటి డ్రైవర్లు పలు అవసరాల కోసం రోడ్డుపైనో లేదంటే ఆపక్కనో వాహనాలు ఆపుతున్నారు. దీంతో ఇతర వాహనదారులు వేగంగా ప్రయాణిస్తున్న సమయంలో వాటిని దగ్గరకు వస్తేగాని గుర్తించలేకపోతున్నారు. ఈలోపే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. విలువైన ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి.

**కుప్పం నుంచి నాయుడుపేట వరకూ**

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని అన్ని జాతీయ రహదారులపైనా ఈ పరిస్థితి ఉంది. కుప్పం నుంచి నాయుడుపేట వరకు లారీలు, కంటైనర్లను హోటళ్లు, దాబాలు, టీ దుకాణాల వద్ద అర్ధాంతరంగా నిలిపేస్తున్నారు. రోడ్డు ప్రమాణాలు బాగుండటంతో కార్లలో ప్రయాణించేవారు 120–160 కి.మీ., ద్విచక్ర వాహనదారులు 80–130 కి.మీ వేగంతో వెళ్తున్నారు. కర్ణాటక ఆర్టీసీ బస్సులు సైతం 100 కి.మీ. వేగంతో దూసుకెళ్తున్నాయి. ఈక్రమంలో డ్రైవర్లకు ఆగిన వాహనాలు కనిపించక నేరుగా వెళ్లి ఢీకొడుతున్నారు. దాంతో ప్రమాద తీవ్రత పెరిగి ఏటా వందల కుటుంబాల్లో విషాదం అలుముకుంటోంది.

**వ్యాపారుల ఇష్టారాజ్యం**

ఎన్‌హెచ్ పరిధిలో వ్యాపారాలు చేసుకునేవారు పార్కింగ్ ప్రదేశాలు తప్పక ఏర్పాటు చేసుకోవాలి. చాలావరకు ఆక్రమించినవే కావడంతో దుకాణం తప్పితే అక్కడ ఖాళీ ప్రదేలా ఉండటం లేదు. వీరికి పోలీసు, రవాణాశాఖ, పెట్రోలింగ్ సిబ్బంది అవగాహన కల్పించడం లేదు. కొందరు వసూళ్లకు అలవాటు పడటం సమస్య తీవ్రతను పెంచుతోంది. ఎప్పుడైనా ప్రమాదం జరిగితే మూడునాలుగు రోజులు హడావుడి చేసి తర్వాత పట్టించుకోవడం లేదు.

**సమస్య ఎక్కడంటే..**

పలమనేరు– క్రిష్ణగిరి రహదారిలో నాలుగురోడ్లు

చిత్తూరు– తిరుపతి రోడ్డులో ఇరువారం, రంగంపేట క్రాస్, గాదంకి టోల్‌గేట్

రేణిగుంట– నాయుడుపేట రహదారిలో రేణిగుంట కూడలి

తిరుపతి– చెన్నై రోడ్డులో అంజేరమ్మ కనుమ

చెన్నై– బెంగళూరు రహదారిలో డీటీసీ, గంగాసాగరం, మొగిలిఘాట్

**ఒకే ఘటనలో నలుగురు..**

గత ఏడాది జనవరిలో చిత్తూరు నగర శివారు గంగాసాగరం వద్ద నిలిపి ఉన్న టిప్పర్‌ను తిరుపతి నుంచి మదురై వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టి బోల్తా పడింది. పక్కనే ఉన్న విద్యుత్తు స్తంభం వాహనంపై పడింది. ఈక్రమంలో అక్కడికక్కడే నలుగురు మృతిచెందగా 13 మందికి తీవ్ర గాయాలయ్యాయి.

పీలేరు, చిత్తూరు మార్గంలోనూ మూడేళ్ల కిందట ఇదే తరహా ఘటనలు చోటు చేసుకున్నాయి.

వేగం పెరిగిన నేపథ్యంలో ఈ తరహా ఘటనల్లో ఇద్దరు నుంచి నలుగురి వరకు ప్రాణాలు విడుస్తున్న ఘటనలు ఎక్కువగా ఉంటున్నాయి ఒక్కోసారి కుటుంబమే కడతేరుతోంది. పిల్లలు అనాథలవుతున్నారు. శాశ్వత అంగవైకల్యంతో బాధపడేవారెందరో.

ఏర్పాట్లున్నా..

జాతీయ రహదారులపై ఎక్కడపడితే అక్కడ వాహనం నిలపకూడదు. డ్రైవర్లు విశ్రాంతి తీసుకోవడానికి ఎన్‌హెచ్ఏఐ ప్రత్యేకంగా లే బేలు ఏర్పాటు చేసింది. చిత్తూరు– తిరుపతి జాతీయ రహదారిపై ఇలాంటివి ఆరుచోట్ల ఉన్నాయి. చెన్నై– బెంగళూరు రోడ్డులో జిల్లా పరిధిలో రెండు, రేణిగుంట– నాయుడుపేట మార్గంలో మూడు ప్రాంతాలున్నాయి. సూళ్లూరుపేట పరిధిలోనూ సమస్య ఉంది.

## అక్కడ పూర్తి.. ఇక్కడ నిట్టూర్పు



కుప్పం : 30 కి.మీ. దాటితే అటు కర్ణాటక.. ఇటు తమిళనాడు. చెన్నై–బెంగళూరు ప్రధాన రైల్వే మార్గంలోని కుప్పం రైల్వేస్టేషన్ మీదుగా నిత్యం పదుల సంఖ్యలో రైళ్ల రాకపోకలు సాగుతాయి. మూడు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న కుప్పం రైల్వేస్టేషన్.. ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. ప్రస్తుతం అమృత్ భారత్‌లో భాగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అలాగే కుప్పం–మారికుప్పం రైల్వేట్రాక్ పనులు పూర్తిచేస్తే ప్యాసింజర్ రైళ్ల సంఖ్య పెరిగి సౌకర్యంగా ఉంటుంది. కుప్పం–మారికుప్పం మధ్య 23.7 కి.మీ. నూతన రైల్వే ట్రాక్ ఏర్పాటు కోసం 2011లో రైల్వే అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకోసం గుడుపల్లె మండలంలో 238.50, కుప్పం మండలంలో 9.15 ఎకరాల భూసేకరణ చేయాలని నాలుగేళ్ల క్రితం కలెక్టర్ ఆదేశించారు. కర్ణాటక ప్రాంతంలో భూ సేకరణ పూర్తయి అక్కడి మారికుప్పం నుంచి కర్ణాటక సరిహద్దు వరకు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆంధ్రాలో మాత్రం ఎలాంటి పనులు చేపట్టలేదు. గత వైకాపా పాలనలో రైతులకు నష్టపరిహారం చెల్లించకపోవడంతో పనులు ఆలస్యమయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక పలువురి నష్టపరిహారం చెల్లించారు. మరికొందరికి పరిహారం చెల్లించాల్సి ఉంది.

**కుప్పం–మారికుప్పం ట్రాక్ ఇలా..**

మారికుప్పం రైల్వేస్టేషన్ నుంచి అత్తినత్తం, బిసానత్తం, పొగురుపల్లె, కోటచెంబగిరి, కుప్పిగానిపల్లె, అగరం, కనమనపల్లె, గుండ్లసాగరం, నక్కనపల్లె, మల్దేపల్లె, కుప్పం రైల్వేస్టేషన్‌కు చేరనుంది.

నష్టపరిహారం అందాల్సి ఉంది

కుప్పం–మారికుప్పం నూతన రైల్వేట్రాక్ పనుల నిర్మాణంలో భాగంగా ఆంధ్రాలో గుడుపల్లె, కుప్పం మండలాల్లో భూసేకరణ పనులు పూర్తి చేశాం. ట్రాక్ నిర్మాణంలో నష్టపోయే రైతులకు రూ.1.68 కోట్లు రావాల్సిన ఉంది. నష్టపరిహారం చెల్లించిన తర్వాత పనులు ప్రారంభిస్తాం.శ్రీనివాసరాజు, ఆర్డీవో, కుప్పం

## ర్యాంకులు దక్కేనా..!



పుత్తూరు: నగరి నియోజకవర్గంలో పుత్తూరు, నగరి జంట మున్సిపాలిటీలున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్రపై పోటీలు నిర్వహించి ర్యాంకులు ప్రకటిస్తారు. ఈ నేపథ్యంలో ర్యాంకులు కోసం ప్రభుత్వం నగర పాలికలు, పురపాలికల మధ్య పోటీ పెడుతుంటారు. ఈ పోటీలో అక్కడ జరుగుతున్న పారిశుధ్య పనులు, ఓడీఎస్, పచ్చదనం పెంపు వాటిని పరిగణలోకి తీసుకుం టారు. ప్రస్తుతం ఈ పోటీలకు సంబంధించి నేడో, రేపో ప్రకటన వెలువడనుంది. దీంతో ఆయా మున్సిపాలిటీల్లో అధికారులు ర్యాంకులు దక్కించుకునేందుకు సిద్ధమవుతుండటం గమనార్హం.

**పోటీకి సై..**కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు కలిపి స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం 10 సంవత్సరాలుగా నిర్వహిస్తోంది. ఈ మేరకు ర్యాంకులు కూడా ప్రకటిస్తున్నారు. మున్సిపాలిటీలు, నగర పాలికలిల్లో ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయి. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో తడిచెత్త, పొడిచెత్తపై అవగాహన కల్పించడం, ఇంటింటికి చెత్త సేకరణ కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రస్తుతం పారిశుధ్య కార్యక్రమాలు మెరుగుపర్చేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. **మంచి ర్యాంకులు సాధిస్తాం..**నగరిలో జంట మున్సిపాలిటీలున్నాయి. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చొరవతో రెండు మున్సిపాలిటీలకు ప్రత్యేకంగా రూ.4కోట్లు వరకు నిధులు వచ్చాయి. తుడా నిధులు కోసం ప్రతిపాదనలు పంపాం. ఆ నిధులు వస్తే మున్సిపాలిటీలు మరింత అభివృద్ధి చెందుతాయి.

## అత్యవసరం.. ఇకపై అభయం

విజయనగరం : విజయనగరం జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలలో 50 పడకలతో అత్యవసర చికిత్స విభాగం(క్రిటికల్ కేర్ యూనిట్– సీసీయూ) సిద్ధమవుతోంది. ఇది వినియోగంలోకి వస్తే గుండెపోటు, ప్రమాదాలు, శ్వాసకోశ ఇబ్బందులు, పెద్ద శస్త్ర చికిత్సలు జరిగిన రోగులకు, తీవ్ర అనారోగ్యంతో, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి 24/7 సేవలు అందించేందుకు వీలవుతుంది. వైద్య నిపుణుల పర్యవేక్షణలో సేవలు అందనున్నాయి.


రోగి ప్రాణాలు కాపాడటం, వారి ఆరోగ్యాన్ని నిరంతరం గమనించడం ఈ యూనిట్ ముఖ్యోద్దేశం. నగర శివారులోని గాజులరేగ వద్ద రెండేళ్లుగా కళాశాల నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించి భవనాల నిర్మాణ పనులు నెమ్మదించినా.. కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపడంతో శరవేగంగా జరుగుతున్నాయి. వీటికి అనుబంధంగా కేంద్ర ప్రభుత్వం పీఎం– అభిమ్ పథకం కింద సీసీయూను మంజూరు చేసింది.

**అత్యాధునిక సదుపాయాలు**

సీసీయూ సేవలు ప్రారంభమైతే అత్యాధునిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. వెంటిలేటర్లు, పల్స్ ఆక్సీమీటర్లు, డిఫిబ్రిలేటర్లు, ఇతర అత్యవసర మందులు ఉంచుతారు. ఐసీయూ నిపుణులు, మత్తుమందు నిపుణులు, ప్రత్యేక శిక్షణ పొందిన నర్సులను నియమిస్తారు. ఈ విభాగం ప్రాణాపాయం నుంచి రోగులను రక్షించడంలో కీలకపాత్ర పోషిస్తుంది.

గ్రౌండ్ ఫ్లోర్: మెటర్నిటీ వార్డు, ఎక్సరే గది, అల్ట్రా సౌండ్ రూం, ఐసోలేషన్ గదులు, ఎమర్జెన్సీ వార్డు, ఫార్మసీ.

మొదటి అంతస్తు: పురుషులు, మహిళలకు ఐసోలేషన్ వార్డులు, డయాలసిస్ ఏరియా, స్టాఫ్ రూమ్, డ్యూటీ డాక్టర్ రూమ్, సర్వీసు ఏరియా.



రెండో అంతస్తు: ఆపరేషన్ థియేటర్, ఓటీ స్టోర్, ఆటో క్లేవ్ రూమ్స్, స్టెరిలైజ్డ్ పరికరాల నిల్వ, క్రిటికల్ ఎక్విప్‌మెంట్ , పోస్ట్ ఆపరేషన్, పీఏపీ, ఐసీయూ గదులు, హెచ్‌డీయూ.

**ప్రస్తుతం ఇలా..**

'కింది భవనానికి రంగులు వేస్తున్నారు. మొదటి, రెండో అంతస్తుల్లో రంగులు, విద్యుత్తు పనులు జరుగుతున్నాయి. గ్రానైట్ పలకల అమరిక, విద్యుత్తు నియంత్రిక ప్రక్రియలు ప్రారంభం కావాలి' అని ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ భారతికు తెలిపారు. త్వరలోనే భవనం అందుబాటులోకి వస్తుందని చెప్పారు.

ప్రాజెక్ట్ వివరాలు

అంచనా వ్యయం : రూ.23.75 కోట్లు

భవన నిర్మాణ విస్తీర్ణం : 46,204 చ.అ

భవనం : జీ ప్లస్ 2

## దా'గూడు'మూతలు

వీరవాసరం : పేదల సొంతింటి కల నిజం చేస్తామంటూ గొప్పలు చెప్పింది వైకాపా ప్రభుత్వం. ఇళ్లు నిర్మించుకోలేని వారికి ఆప్షన్–3 కేటగిరీలో కట్టించి అప్పగిస్తామని నమ్మించింది. స్థానిక గుత్తేదారులకు ఆ బాధ్యత అప్పగించింది. ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలతో పాటు లబ్ధిదారులు అదనంగా గుత్తేదారునికి రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. చాలామంది అప్పులు చేసి నగదు చెల్లించి ఏళ్లు గడుస్తున్నా అవి పూర్తి కాకపోవడంతో నేటికీ అద్దె ఇళ్లలో కాలం వెళ్లదీస్తున్నారు. జిల్లాలో 201 లేఅవుట్లలో 6,271 మంది లబ్ధిదారులు ఆప్షన్–3 కేటగిరీలో ఇళ్ల నిర్మాణానికి ముందుకొచ్చారు. వీటిలో ఇప్పటి వరకు 1,197 పూర్తి చేశారు. మిగిలిన వాటిని గుత్తేదారులు 2025 మార్చికి పూర్తి చేయాల్సి ఉంది. వైకాపా హయాంలో అప్పటి నాయకుల అండదండలతో కొందరు గుత్తేదారులు నిర్మాణ దశలు ఎక్కువగా చూపి బిల్లులు కాజేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణాలను పరిశీలించిన తర్వాత మాత్రమే బిల్లులు మంజూరు చేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో గుత్తేదారులకు గత ఐదు నెలలుగా బిల్లులు ఆగడంతో చాలా చోట్ల నిర్మాణాలు మందకొడిగా సాగుతున్నాయి.

**ఎక్కడ ఎలా ఉన్నాయంటే..**

భీమవరం పట్టణం పంపుల చెరువు ప్రాంతంలో 106 ఎకరాలలో 3,434 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. వీరిలో 1,960 మంది ఆప్షన్–3 లబ్ధిదారులు ఉన్నారు. ఇప్పటి వరకు 183 గృహాలే పూర్తి చేయగా 103 అసలు ప్రారంభించలేదు. 1,674 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి.ఆకివీడు నగర పంచాయతీలో 216 గృహాలకు 98, తణుకు పట్టణంలో 1,524 ఇళ్లకు 60 అయ్యాయి. నరసాపురం పట్టణంలో 400కి 41, పాలకొల్లు పట్టణంలో 317కి 27 గృహాలు మాత్రమే పూర్తయ్యాయి. వీరవాసరం మండలం తలతాడితిప్ప లేఅవుట్‌లో 14 మంది 2023లో గుత్తేదారుడితో ఒప్పందం చేసుకున్నారు.



ఒక్కో ఇంటికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు మంజూరు చేయగా గుత్తేదారునికి లబ్ధిదారులు రూ.80 వేలు, రూ.40 వేల చొప్పున చెల్లించారు. ఇక్కడ ఒక్క ఇంటి నిర్మాణం కూడా పూర్తి కాలేదు.

**ఇవీ సమస్యలు** ఆప్షన్–3 నిర్మాణాలకు అంగీకరించిన లబ్ధిదారులు లేఅవుట్లలో ప్రభుత్వం కనీస మౌలిక సౌకర్యాలు కల్పించకపోవడంతో ఇళ్లు నిర్మించు కున్నా భవిష్యత్తు ఎలా ఉంటుందో అనే ఆలోచనతో గుత్తేదారులకు ముఖం చాటేస్తున్నారు. దీనికి తోడు గుత్తేదారులకు నగదు చెల్లించడానికి వెనుకాడుతున్నారు.పలుచోట్ల లబ్ధిదారులు చనిపోవడం, కొందరు ఆచూకీ లేకపోవడం, మరికొందరు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోవడం మరో కారణం.

**పూర్తి చేయకపోతే కేసులు**

మార్చి 18 నాటికి ఇళ్లు పూర్తి చేయాలి. గతంలో బేస్‌మెంట్ వరకు చేయకుండా బిల్లులు విడుదల చేసిన ఏఈలకు షోకాజ్ నోటీసులు అందజేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. పనులు పూర్తి చేసిన గుత్తేదారులకు బిల్లులు మంజూరు చేస్తాం. ఒప్పందం ప్రకారం పూర్తిచేయకపోతే పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయిస్తాం. నెల క్రితం ఒక గుత్తేదారుపై కేసు నమోదు చేశాం.

జి. పిచ్చియ్య, పీడీ, గృహ నిర్మాణ సంస్థ

చురకలు



## ట్రాఫిక్ చిక్కులా?.. ఉండవిక ఆ చికాకులు!

విశాఖపట్నం: ఎన్ఏడీ కూడలికి చేరుకోవడం ఒక ఎత్తైతే... అక్కడి నుంచి విమానాశ్రయం వైపు వెళ్లడం మరో ఎత్తు. ఇక్కడి సమస్యలు తీర్చేలా ఎన్ఏడీ పైవంతెన నుంచి కాకానినగర్ కూడలికి నేరుగా చేరుకునేలా నిర్మిస్తున్న రైల్ ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) పూర్తి కావస్తోంది. దీన్ని త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నారు. దీంతో చాలా వరకు ట్రాఫిక్ ఇబ్బందులు తీరనున్నాయి.

18 మీటర్ల ఎత్తు..210 మీటర్ల పొడవు: ఎన్ఏడీ పైవంతెన ప్రాజెక్టులో భాగంగా నిర్మించాల్సిన ఆర్వోబీ రెండేళ్ల కిందటే పూర్తవ్వాలి. కోల్‌కతా–చెన్నై ప్రధాన లైనులో నిర్మించాల్సి ఉండగా అనుమతులు క్లిష్టమవ్వడంతో ఆలస్యమైంది. ప్రస్తుతం నిర్మించిన ఆర్వోబీ...రైలు పట్టాల నుంచి 18 మీటర్ల ఎత్తులో 210 మీటర్ల పొడవుతో నిర్మించారు.

అనుసంధానంగా: ఆర్వోబీకి అనుసంధానంగా రెండు వైపులా రెండు అప్రోచ్ రోడ్లు నిర్మిస్తున్నారు. ఎన్ఏడీ నుంచి 200 మీటర్లు, విమానాశ్రయం నుంచి వచ్చే మార్గంలో 300 మీటర్ల పొడవుతో అనుసంధానం చేస్తున్నారు. ఈ పనులు చివరి దశలో ఉన్నాయి. విమానాశ్రయం వైపు చాలా వరకు తారు రోడ్డు పనులు జరుగుతుండగా ఎన్ఏడీ నుంచి మట్టి తవ్వి రోడ్డు నిర్మాణం, రెయిలింగ్ పనులు చేస్తున్నారు.



త్వరలో నిర్మించే సర్వీసు రోడ్లతో కలిపి మొత్తంగా ఇక్కడ ఆరు రోడ్లు వస్తాయి. దీంతో ఎన్ఏడీ పైవంతెన కింద, పైనుంచి రాకపోకలకు వీలు కలుగుతుంది.

త్వరలో అందుబాటులోకి 'ఆర్వోబీ ఈ నెల 15 నుంచి అందుబాటులోకి వచ్చేలా 24 గంటలూ పనులు చేయిస్తున్నాం. విప్ గణబాబు సూచన మేరకు కాకానినగర్ కూడలి వద్ద భూగర్భ వంతెన నిర్మిస్తున్నాం. ఆ కూడలికి వంద మీటర్ల ముందు అది వస్తుంది. ఈ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయి. ఇది పూర్తయితే సిగ్నల్ లేకుండానే రాకపోకలు సాగించొచ్చు' అని వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ పేర్కొన్నారు.

## కోడి దిగొస్తోంది.. కేజీ మాంసం రూ.250కి తగ్గుదల

నక్కపల్లి : నెల రోజులపాటు ట్రిపుల్ సెంచరీపై నిలబడిన కోడిమాంసం ధర ఎట్టకేలకు దిగి వచ్చింది. దాదాపు పది రోజులుగా ఈ ధర తగ్గుముఖం పడుతుండటం వినియోగదారులకు ఊరటనిస్తోంది. చేపలు, మేక మాంసం కంటే చికెన్ వినియోగమే అధికంగా ఉంటుంది. ఇది అందరికీ అందుబాటులో ఉండటం ఓ కారణం కాగా, మాంసప్రియులు ఎక్కువగా ఇష్టపడేది కూడా దీన్నే.

జిల్లాలో సుమారు 500 పౌల్ట్రీల ద్వారా లక్షల సంఖ్యలో కోళ్లు ఉత్పత్తి అవుతుండగా సీజన్, ఉత్పత్తి, మాంసం డిమాండ్ ఆధారంగా దీని ధరల్లో హెచ్చుతగ్గులుంటాయి. ఏడాది కాలంలో గతనెలలో మాత్రమే కిలో మాంసం ధర రూ. 300లకు చేరింది. పండగ, తీర్థాలు కావడంతో నిన్నటి వరకు ధర కొనసాగింది. మరోవైపు పౌల్ట్రీల్లో ఉత్పత్తి పెరగడం, డిమాండ్ కూడా తగ్గడంతో కోడి ధరతో పాటు, మాంసం ధర అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం కోడి ధర కిలో రూ. 140, డ్రెస్డ్ మాంసం రూ. 220, స్కిన్‌లెస్ ప్రాంతాన్ని బట్టి రూ. 240 నుంచి రూ. 250 మధ్య విక్రయిస్తున్నారు. జిల్లాలో 1500కి పైగా మాంసం విక్రయ దుకాణాలుంటాయని అంచనా. నిత్యం హోటళ్లకు ప్రత్యేక డిమాండ్ ఉంటుంది. ఇక రోజువారీ ఇళ్లలో వినియోగంతోపాటు వేడుకలు..పండగల వేళ వీటి విక్రయాలు భారీగా ఉంటాయి. ప్రస్తుతం ఫారాల్లో పెంపకాల జోరు పెరగడంతో డిమాండ్‌కు మించి సరకు లభ్యత ఉండటంతో ధరలు అందుబాటులోకి వచ్చినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఉత్పత్తి మరింత పెరిగితే వీటి ధర మరింత తగ్గే అవకాశం ఉన్నట్లు వీరు వెల్లడిస్తున్నారు. మరోవైపు కోడిగుడ్డు ధరలు సైతం దిగి వచ్చాయి. రెండు నెలలపాటు గతంలో ఎన్నడూ లేనంత గరిష్ఠంగా చిల్లర ధర రూ. తొమ్మిదికి చేరింది. ఇది కూడా రెండు వారాలుగా రూ. ఆరుకు తగ్గింది.

## గోదా 'వర్రి'

రాజమహేంద్రవరం : ఏటా డ్రెడ్జింగ్ పనులకు నోచుకోక గోదావరి నది ఊబలతో ప్రమాదకరంగా మారింది. నిబంధనలు ఉల్లంఘించి నదిలో యంత్రాలతో ఇసుకను తవ్వకాలు చేపడుతుండడం తో లోతైన గుంతలు ఏర్పడి.. అవన్నీ సుడిగుండాలుగా మారుతున్నా యి. స్నానాలకు దిగిన వారు నదిలోకి జారిపోతున్నారు. గత ఏడాది పుష్కర, కోటిలింగాల ఘాట్ల వద్ద ఈ పరిస్థితి ఎదురైంది. అఖండ గోదావరి తీరం కలిగిన రాజమహేంద్రవరానికి చుట్టుపక్కల రాష్ట్రాలు, ఉత్తర భారతం నుంచి భక్తులు పుణ్య స్నానాలకు వస్తుంటారు. ఎక్కడ ఊబలున్నాయో, లోతు ఉంటుందో తెలియని పరిస్థితుల్లో వారంతా భయాందోళనకు



గురవుతున్నారు.

**ఇబ్బందికర పరిస్థితులు**

ఏటా వరదల తర్వాత నదిలో 2 శాతం ఇసుక పెరుగుతుంది. భారీగా మేటలు వేస్తాయి. తొలగింపునకు డ్రెడ్జింగ్ పనులు చేపట్టాలి. లేదంటే ఊబలు పెరిగి అగాధాలు ఏర్పడతాయి. గత పుష్కరాలకు ఇలాంటి పరిస్థితి ఎదురైతే ఓఎన్జీసీ సహాయంతో డ్రెడ్జింగ్ చేశారు. వాస్తవానికి ఘాట్ల వద్ద 20 అడుగుల మేర ఇసుక వేస్తే స్నానాలకు దిగినప్పుడు ప్రమాదాలకు ఆస్కారం ఉండదు. డ్రెడ్జింగ్ చేపట్టకపోతే నదిలో ప్రయాణం కూడా ప్రమాదకరంగా మారుతుంది. మేటలు వల్ల చిన్న పడవలు ఇరుక్కుపోయి ఒరిగిపోతాయి.

**సమన్వయలోపం..**గోదావరి నదీ పరిరక్షణ విషయంలో అధికారుల మధ్య సమన్వయం ఉండడం లేదు.ఘాట్ల వద్ద పారిశుద్ధ్య నిర్వహణను నగరపాలక సంస్థ చేపట్టాల్సి ఉండగా ప్రత్యేక సందర్భాల్లో మాత్రం తూతూ మంత్రంగా ఏర్పాట్లు చేసి చేతులు దులుపేసుకుంటోంది. శివరాత్రి సమయంలో ఘాట్‌ల వద్ద కొంత మేర ఇసుక వేసి వదిలేస్తోంది.ఘాట్‌ల కింద నీటి పరిస్థితి, ప్రమాదకర వాతావరణాన్ని అంచనా వేసి ఎప్పటికప్పుడు చక్కదిద్దాల్సిన బాధ్యత ఇరిగేషన శాఖది. ఈ రెండింటి మధ్య సమన్వయ లోపంతో ఇబ్బందులు తప్పడం లేదు.

## మగ్గం 'పట్టు'తప్పుతోంది



ధర్మవరం : పట్టుచీరల తయారీలో వినియోగించే ముడిపట్టు ధర కిలో రూ. 6,700కు చేరింది. దీంతో మగ్గాల నిర్వహణ కష్టంగా మారింది. పట్టుగూళ్ల ఉత్పత్తి నాలుగు నెలలుగా భారీగా తగ్గింది. రీలర్లకు సరిపడా పట్టుగూళ్లు లభించకపోవడంతో ముడిపట్టు ఉత్పత్తి పడిపోయింది. చేనేత పరిశ్రమపై ఆధారపడిన వారు కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు, చిల్లగట్ట నుంచి ముడిపట్టును కొనుగోలు చేస్తున్నారు. డిమాండుకు తగ్గట్టు ముడిపట్టు ఉత్పత్తి జరగకపోవడంతో ధర పెరుగుతోంది.

**చేనేతలపై భారం**

గత ఏడాది నవంబరులో ముడిపట్టు కిలో రూ. 4,700 ఉండేది. ప్రతినెలా రూ. 500 వరకు పెరుగుతూ వస్తోంది. నాలుగు నెలల వ్యవధిలో కిలో ధర రూ. 2 వేలు పెరిగింది. వెండి ధరల పెరుగుదలతో పట్టుచీరల్లో వాడే జరీ ధరలు పెరిగాయి. దీంతో ఒక మగ్గంపై నెలకు ఆరు పట్టుచీరలు తయారు చేయించే నిర్వాహకులు వాటి సంఖ్యను తగ్గిస్తూ వస్తున్నారు. నెలకు 3 నుంచి 4 చీరలు మాత్రమే తయారు చేస్తున్నారు. ఫలితంగా కార్మికుల ఉపాధికి కోత పడుతోంది.

ఉమ్మడి జిల్లాలో 24 వేల చేనేత మగ్గాలు ఉన్నాయి.

ధర్మవరం, సోమందేపల్లి, ముదిరెడ్డిపల్లి, గోరంట్ల, తాడిపత్రి, పెద్దపప్పూరు, సిండికేట్ నగర్, ఉరవకొండ ప్రాంతాల్లో ఎక్కువగా మగ్గాలపై పట్టుచీరలు తయారవుతున్నాయి.

ప్రతి నెలా 1.50 లక్షల పట్టు చీరలు తయారయ్యేవి. ముడిపట్టు ధరల పెరుగుదలతో 40 వేలకు తగ్గిపోయింది.

చీరల తయారీ కష్టం: శంకరచంద్రశేఖర్, చేనేత మగ్గాల నిర్వాహకుడు

ముడిపట్టు, జరీ ధరలు పెరిగాయి. మగ్గాలపై పట్టుచీర తయారు చేసి విక్రయించాలంటే గిట్టుకోవడంలేదు. ధరలు ఇలాగే పెరిగితే కష్టతరం అవుతుంది.

## పరిశ్రమల బూచి.. ఊరు విడిచి



తలుపుల : తలుపుల మండలంలోని దిగువ మైరాడా.. ఒకప్పుడు పచ్చని పొలాలు, పాడిపంటలతో కళకళలాడేది. అలాంటి గ్రామంలో పరిశ్రమలు వస్తాయని, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు దక్కుతాయనే ఆశతో ప్రజలు గ్రామాన్ని ఖాళీ చేశారు. వ్యయప్రయాసాలకోర్చి మరోచోట ఊరును నిర్మించుకున్నారు. గ్రామం చుట్టూ ఉన్న భూములన్నిటిని ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం తీసేసుకొంది. అయితే నేటికీ ఒక్క పరిశ్రమను స్థాపించింది లేదు. భూములు కోల్పోయిన రైతు కుటుంబాలకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు చూపలేదు. ఫలితంగా ప్రజలు ఉపాధి కోసం వలస వెళ్లాల్సిన దుస్థితి.

**1,576 ఎకరాలు సేకరించారు..**

2009–10లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం తలుపుల మండలం పెద్దన్నవారిపల్లి పంచాయతీ మైరాడా గ్రామంలో పరిశ్రమల కల్పన పేరుతో 1,576.8 ఎకరాలను సేకరించింది. అందులో 1,377.45 ఎకరాలు డీకేటీ భూమి కాగా 199.35 ఎకరాలు ప్రభుత్వ భూమిగా గుర్తించారు. ఇందులో 1,154 ఎకరాలను ఏపీఐఐసీకి కేటాయించారు. అందులో 967 ఎకరాల డీకేటీ భూమికి ఎకరాకు రూ. 60 వేలు చొప్పున రైతులకు పరిహారం చెల్లించారు. మరో 187 ఎకరాలకుగాను పరిహారం చెల్లించాల్సి ఉంది. దీంతో ప్రభుత్వం 967 ఎకరాలను మాత్రమే ఏపీఐఐసీకి అప్పగించింది. ఇంకో 422 ఎకరాలకు సంబంధించి కలెక్టరేట్‌లో అప్రూవల్ కాకపోవడంతో ఆపేశారు.

మొత్తం భూమి అప్పగిస్తే పరిశ్రమల స్థాపనకు కృషి

నాగకుమార్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, పెనుకొండ

రెవెన్యూ అధికారులు కేటాయించిన భూమి అంతా ఒక్క చోటలేదు. మధ్యలో ఖాళీగా ఉంది. మాకు రావాల్సిన భూమిని రెవెన్యూ అధికారులు అప్పగిస్తే పార్కులు, పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకొంటాం.

## బడి.. సృజన ఒరవడి




గుంతకల్లు: ఉత్తమం అనే పేరులో ఉన్నది మూడక్షరాలే. శ్రమ, తపన, విలువలు ఉన్నపుడే విజయం రూపంలో ఈపేరు దక్కుతుంది. గుంతకల్లులోని రైల్వే ఆంగ్లమాధ్యమ ఉన్నత పాఠశాల ఇలాంటి ఘనతే సాధించింది. సికింద్రాబాద్ రైల్వేజోన్‌లో ఉత్తమ పాఠశాలగా ఎంపికై.. జనరల్ మేనేజరు నుంచి గత నెల 29న షీల్డును అందుకుంది. ఘనత దక్కడానికి కారణాలను అన్వేషిస్తే..

ప్రాచుర్యం: ఇక్కడ చదువుకున్న వందలాది విద్యార్థులు ఉన్నత స్థానాలు పొందారు. అనంతపురం జిల్లా కలెక్టరుగా పనిచేసిన రాకెల్‌ఛటర్జీ, గుంతకల్లు కోర్టులో న్యాయమూర్తిగా పనిచేసిన తంగమణి ఈ పాఠశాలలో చదువుకున్నవారే. ఎంతోమంది దేశ విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. తెలుగు పట్ల మమకారం.. ప్రార్థన సమయంలో జనరల్ నాలెడ్జ్, సామెత, తెలుగు పద్యం, నీతికథ వంటివి పకడ్బందీగా నిర్వహించి బహుమతులు ప్రకటించడం

పరీక్షల్లో సాధించిన ఫలితాలకు 50మార్కులు, ఇతర అంశాల్లో సాధించిన 50మార్కులు ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేసేందుకు కీలకంగా మారాయి. ఇందులో పాఠశాల 100 మార్కులను సాధించింది. ఇతర కేటగిరీలో ఉన్న అంశాలు..

ఇంటరాక్టివ్ డిజిటల్ స్మార్ట్‌బోర్డు సాయంతో బోధన, చిత్రాలను చూపిస్తూ సులువుగా అర్థం చేసుకునేలా చేయడం. మోడల్ ప్రశ్నపత్రాలను చరవాణులకు పంపడం.

అధునాతన ల్యాబ్‌ల సౌకర్యం, వెనుకబడి ఉన్నవారి విషయంలో శ్రద్ధ, విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించేలా తీర్చిదిద్దడం.

పాఠశాల వెలుపల, తరగతి గదుల్లో సీసీ కెమెరాలు.. పకడ్బందీ నిఘా..

విద్యార్థులందరూ స్కౌటింగ్‌లో పనిచేసే విధంగా ప్రోత్సాహం.. జాతీయ, అంతర్జాతీయ జంబోరీల్లో వివిధ అంశాల్లో పోటీపడుతూ బహుమతులను సాధించేలా చేయడం.. విద్యార్థులు చిత్రలేఖనం, వక్తృత్వం, క్రీడలు, వ్యాసరచన, నృత్యాల్లో ప్రత్యేకత చాటేలా ప్రోత్సహించడం.

ప్రతి విద్యార్థి ధైర్యంగా వేదికలెక్కి మాట్లాడేలా చూడటం..

ప్రారంభం : 1887లో..

ప్రస్తుతం మొత్తం విద్యార్థులు 638

ఉపాధ్యాయులు: 24

ప్రత్యేక దృష్టి: మధుసూదన్, ప్రధానోపాధ్యాయుడు

విద్యార్థి కదలికలు, చదువుపై దృష్టి పెడుతున్నాం. ఇంటరాక్టివ్ డిజిటల్ బోర్డు సాయంతో పాఠాలు బోధిస్తాం. పదోతరగతి పరీక్షల్లో 98శాతం ఫలితాలను సాధిస్తున్నాం. 2014 నుంచి ఇప్పటివరకు రైల్వేపాఠశాల ఏడుసార్లు జోన్‌లో ఉత్తమ పాఠశాలగా ఎంపికైంది. ఉపాధ్యాయుల అంకితభావానికి ఇది నిదర్శనం.

## వణికిన ఊరు.. గడప దాటని కన్నీరు

బుక్కరాయసముద్రం : మొండెం నుంచి తలను వేరుచేసిన ఉదంతం కళ్ల ముందు.. ఇద్దరిని చంపేసిన దుర్ఘటన.. సాక్ష్యం చెబితే అంతు చూస్తామన్న బెదిరింపులు.. వీటన్నింటి మధ్య శింగనమల మండలం.. తరిమెల గ్రామం చిగురుటాకులా వణికింది. ఫలితంగా అక్కడ మౌనం రాజ్యమేలింది.

తరిమెలలో గత జరిగిన జంటహత్యల ఘటన ఉమ్మడి జిల్లాలో పెను సంచలనంగా మారింది. హత్యకు గురైన ఎల్లమ్మ ఆమె కుమారుడు చిన్నా మృతదేహాలకు సీఐ కౌలుట్లయ్య, ఎస్సై సాగర్ దగ్గరుండి అనంతపురం వైద్యశాలలో శవపరీక్షలు నిర్వహించారు. ఇద్దర్నీ హత్య చేసిన తర్వాత నిందితులు ఎల్లమ్మ మొండెం నుంచి తలను వేరు చేసి చేతపట్టుకొని, వేటకొడవళ్లతో గ్రామంలో తిరిగారని ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. ఎవరైనా సాక్షం చెబితే ఊరుకొనేది లేదని, ఎవరైనా సాక్షం చెప్పడానికి వస్తే బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత అంతు చూస్తామని నిందితులు హెచ్చరించినట్లు తెలిసింది. మృతదేహాలకు అంత్యక్రియలు చేయడానికి వారి బంధువులు భయంతో ఎవరూ రాలేదు. ఎస్పీ జగదీశ్ ప్రజలకు ధైర్యం చెప్పినా ప్రయోజనం లేకపోయింది. తోటి అంగన్‌వాడీ ఉద్యోగులతో కలిసి సీఐ కౌలుట్లయ్య, ఎస్సై సాగర్, విజయ్‌కుమార్ మృతదేహాలను తరిమెలకు తరలించి దగ్గరుండి అంత్యక్రియలు చేయించారు.

## గట్టు కొట్టేశారు.. గుట్టు దాచేశారు!

అనకాపల్లి : శాఖల మధ్య సమన్వయ లోపంతో విలువైన ప్రభుత్వ భూమికి రక్షణ లేకుండాపోతోంది. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతున్నా.. అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. అదే అవకాశంగా అక్రమార్కులు చెరువుగట్టు కబ్జాచేసి రోడ్డుగా మార్చుకుని తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. కశింకోట మండలం బయ్యవరంలోని సర్వే నంబర్ 222–1, 222–2, 223లో ఆరున్నర ఎకరాల్లో పేరంటాలమ్మ చెరువు ఉంది. కొన్నేళ్ల క్రితం విశాఖలోని పలు విద్యుత్తు ప్లాంట్లకు అవసరమైన బొగ్గు ఇక్కడ నిల్వచేసేలా యార్డు ఏర్పాటు కోసం అనుమతులు తీసుకున్నారు. ఇక్కడి నుంచి బొగ్గు రవాణా వాహనాలు వేగంగా జాతీయ రహదారిపైకి చేరుకునేందుకు సమీపంలోని పేరంటాలమ్మ చెరువును ఆక్రమించారు. దాదాపు 60 సెంట్ల చెరువు గట్టును చదును చేసి రోడ్డుగా మలుచుకున్నారు. దీంతోపాటు మరో 80 సెంట్ల వరకు చెరువు స్థలంలో సిమెంట్ రోడ్డు, వాహనాల పార్కింగ్ స్థలం, సెక్యూరిటీ సిబ్బంది కోసం షెడ్డు సైతం నిర్మించారు. ఈ స్థలం తమ సొంతం అన్నట్లు వ్యవహరిస్తూ అటువైపు ఎవరినీ అనుమతించడం లేదు.

**మూడు గ్రామాల ప్రజలు అవస్థలు..**

బయ్యవరం బొగ్గు యార్డులో నిరంతరం వ్యాగన్ల నుంచి లోడింగ్, అన్‌లోడింగ్ జరుగుతోంది. దీంతో సమీపంలోని బయ్యవరం, రామన్నపాలెం, జమాదులపాలెం గ్రామాలపై నల్లని బుగ్గి ఎగిసిపడుతోంది. ఊపిరి పీల్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నట్లు ఆయా గ్రామస్థులు వాపోతున్నారు. యార్డును గ్రామాలకు దూరంగా తరలించాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు. జిల్లా, స్థానిక అధికారులకు సమస్యను విన్నవించుకుంటున్నా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**గత ప్రభుత్వంలో అక్రమంగా అనుమతి..**

గత వైకాపా ప్రభుత్వ హయాంలో కశింకోట తహసీల్దారుగా పనిచేసిన ఓ అధికారికి అధిక మొత్తంలో ముట్టజెప్పి చెరువు గట్టుపై బొగ్గులారీలు వెళ్లేందుకు అనుమతి తెచ్చుకున్నారు. కనీసం పంచాయతీ తీర్మానం



కూడా చేయకుండా అనుమతి ఇచ్చేశారు. దీనిపై స్థానిక గ్రామస్థులు కొన్నేళ్లుగా ఆందోళన చేసినా ఫలితం లేకుండా పోయింది. గతంలో దీనిపై రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో వచ్చి సర్వే చేశారు. కొంత స్థలం కబ్జాకు గురైందని నిర్ధారణ చేశారు. కానీ..ఇప్పటికీ చర్యలు తీసుకోలేదు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం..**

– ఆయిషా, ఆర్డీవో, అనకాపల్లి

ఎటువంటి అనుమతులు లేకుండా చెరువు స్థలాన్ని రోడ్డుగా వినియోగించడం నేరం. బయ్యవరం పేరంటాలమ్మ చెరువుపై ఫిర్యాదులు అందాయి. క్షేత్రస్థాయి సిబ్బందిని పంపించి సర్వే చేయిస్తా. వచ్చిన నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటాం.

**శ్వాసకోశ బాధతో ఇబ్బందిపడుతున్నా**

– సాధనాల బాబూరావు, రామన్నపాలెం

బయ్యవరం జాతీయ రహదారికి పక్కన టిఫిన్ దుకాణం పెట్టుకుని జీవించేవాడిని. కొన్నాళ్ల క్రితం తీవ్రంగా ఆరోగ్యం పాడయింది. స్కానింగ్ తీయిస్తే.. ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ సోకిందన్నారు. అప్పటి నుంచి శ్వాస తీసుకునేందుకూ ఇబ్బంది పడుతున్నాను. అక్కడ నుంచి ఖాళీ చేసి వేరేదగ్గరకు వెళ్లిపోవాలని వైద్యులు సూచించారు. సొంతూరు వదిలి వెళ్లలేక మందులు వాడుకుంటూ ఇక్కడే ఉంటున్నాను.

## వడివడిగా అడుగులు

కాకినాడ : జిల్లాలో దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రహదారుల అభివృద్ధికి అడుగులు పడ్డాయి. పది నెలల నుంచి దశల వారీగా ప్లాన్, అడిషనల్ ప్లాన్, నాబార్డు కింద కీలకమైన 33 రహదారులను 208 కి.మీ. పరిధిలో రూ. 87.12 కోట్లతో అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం ఇచ్చింది. వైకాపా ప్రభుత్వంలో పూర్తి చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారులు వీటికి టెండర్ల దాఖలుకు ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వం దశల వారీగా కొన్ని బిల్లులు చెల్లించడంతో ఈ పనులకు టెండర్లు వేసి, అగ్రిమెంట్లు పూర్తి చేశారు. వర్షాకాలం వెళ్లాక పనులు మొదలయ్యాయి. నెల రోజుల వ్యవధిలో 23.5 కి.మీ. మేర నిర్మాణం పూర్తయింది.

**పాత బకాయిలు చెల్లిస్తే..**

జిల్లాలో పాత బిల్లుల బకాయిలు రూ. 30 కోట్ల వరకు ఉన్నాయి. వీటిని దశల వారీగా చెల్లిస్తే.. తాజాగా చేపట్టిన పనులు ఆగకుండా ముందుకు సాగుతాయని ఇంజినీర్లు పేర్కొంటున్నారు. ఒకే గుత్తేదారు మూడు, నాలుగు రోడ్లకు టెండర్లు వేశారు. పూర్తయిన వాటికి సొమ్ములిస్తే మిగతావి చేపట్టే అవకాశం ఉంటుంది.ః కొందరు గుత్తేదారులు టెండర్లు, అగ్రిమెంట్లు పూర్తయిన పనులు చేపట్టడం లేదు. వీరు ఆర్‌అండ్‌బీ నుంచి ఎల్‌వోఏ(లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్సీ) తీసుకుని బ్యాంకుల్లో సమర్పించి, ఓడీలు తెచ్చుకుంటున్నారు. వీరు టెండర్లు వేసిన పనులను త్వరగా చేపట్టేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పిఠాపురం నియోజకవర్గంలోని కుమారపురం–పిఠాపురం– ఉప్పాడ రోడ్డుకు మోక్షం కలిగింది.

కాజులూరు మండలంలోని కాజులూరు–తిప్పరాజు పాలెం రహదారి పూర్తి చేశారు.

జగ్గంపేట నియోజకవర్గంలో జాతీయ రహదారి నుంచి యల్లమిల్లికి వెళ్లే రహదారి పనులు దాదాపు పూర్తికావచ్చాయి.

మార్చి నెలాఖరులోగా పూర్తి చేస్తే బిల్లులు చెల్లిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇవ్వడంతో గుత్తేదారులు పనులు కొనసాగిస్తున్నారు. మే నాటికి పనుల పూర్తికి కార్యాచరణ చేస్తున్నామని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ జి.కంఠు తెలిపారు.

## సర్కారు భూమిపై కబ్జాదారుల కన్ను

కదిరి : కదిరి పట్టణ పరిధిలో భూముల ధరలు అమాంతం పెరగడంతో కబ్జాదారుల కళ్లు ప్రభుత్వ భూములపై పడ్డాయి. కదిరి రెవెన్యూగ్రామం బేరిపల్లికాలనీ సమీపంలోని సర్వేనంబరు 268లో దాదాపు 15సెంట్ల స్థలాన్ని అక్రమార్కులు రాత్రికి రాత్రే చదును చేశారు. బాహ్యావలయ రహదారికి ఆనుకుని ఉన్న ఈస్థలం మీదుగా దేవరచెరువు నుంచి పంట పొలాలకు నీరందించే కాలువను గట్లను ధ్వంసం చేసి భూమిని చదును చేసేశారు. జాతీయ రహదారి 42కు సమీపంలో ఉండటంతో ఈ ప్రాంతంలో సెంటు భూమి ధర 10 లక్షల వరకు పలుకుతోంది. పదిహేనుసెంట్ల భూమి కోటిన్నర రూపాయల పైమాటే. పట్టణానికి సమీపంలోనే ప్రభుత్వ భూమిని కబ్జాచేసేందుకు యత్నిస్తున్నా రెవెన్యూ అధికారులు దృష్టికి రాకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఆక్రమణదారుల పట్ల అధికారులు కఠినచర్యలు తీసుకోని కారణంగానే పెట్రేగిపోతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. బేరిపల్లి వద్ద పొలాలకు



వెళ్లేదారి నుంచి ఉన్న నీటికాలువ వరకు ఉన్న స్థలంపై కన్నేసిన కబ్జాదారులు రాత్రివేళల్లో పొక్లెయిన్ సాయంతో చదును చేసేశారు.

**తగిన చర్యలు తీసుకుంటాం: మురళీకృష్ణ, తహసీల్దార్, కదిరి**

ప్రభుత్వభూమిని చదును చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం. అక్రమార్కులను గుర్తించాలని గ్రామ రెవెన్యూ అధికారికి సూచించా. భూమి అన్యాక్రాంతం కాకుండా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి.. తగిన చర్యలు తీసుకుంటాం.

## ఇరుకు గదుల్లో.. పసిమొగ్గలు మగ్గిపోవాలా?

పాలకొల్లు మండలం వాలమర్రులో 159వ నంబరు అంగన్‌వాడీ కేంద్రం ఇది. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ఈ నిర్మాణం చేపట్టగా తరువాత వచ్చిన వైకాపా సర్కారు పనులను పూర్తి చేయడంలో వివక్ష చూపింది. దీంతో అసంపూర్తి భవనంలోనే కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు.మార్టేరు, అత్తిలి, పాలకొల్లు గ్రామీణ, పోడూరు, బాలల సమగ్ర వికాసానికి బాటలు వేయాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు వైకాపా పాలనలో ప్రాభవం కోల్పోయాయి. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన అంగన్‌వాడీ భవన నిర్మాణాలను విస్మరించడంతో పాటు కొత్తగా ప్రారంభించిన పనులకు సైతం నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలో అధిక శాతం కేంద్రాలు అద్దె గదుల్లో అరకొర వసతులతో కొనసాగుతున్నాయి.

రూ.13.5 లక్షల అంచనా వ్యయంతో మూడేళ్ల క్రితం చేపట్టిన పెనుమంట్ర-3 అంగన్‌వాడీ భవన నిర్మాణం ఇలా అసంపూర్తిగా మిగిలింది. 2023 జూన్‌లో ఈ నిర్మాణాన్ని పరిశీలించిన అప్పటి కలెక్టర్ ప్రశాంతి స్థానిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినా పరిస్థితిలో మార్పు రాలేదు. ఈ భవనం చుట్టూ పిచ్చిమొక్కలు, పొదలు పెరిగిపోవడంతో చిట్టడవిని తలపిస్తోంది.

**ఇదీ పరిస్థితి..**

పశ్చిమగోదావరి జిల్లాలోని ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,626 కేంద్రాలు ఉండగా వీటిలో 600 వరకు అద్దె గదుల్లో నడుస్తున్నాయి. వీటికి పట్టణ పరిధిలో నెలకు రూ.6 వేలు, గ్రామాల్లో అయితే రూ. 2 వేల చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. గతంలో తెదేపా, వైకాపా ప్రభుత్వాల హయాంలో చేపట్టిన 82 కేంద్రాల నిర్మాణాలు వివిధ దశల్లో ఆగిపోయాయి. పెనుగొండ మండలం ములపర్రులో 166వ నంబరు కేంద్రం అద్దె భవనంలో నడుస్తోంది. ఇక్కడ గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేసి భవన నిర్మాణం చేపట్టారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా నిధులను నిలిపేసింది. పెనుగొండలోని 135వ నంబరు కేంద్రానిదీ ఇదే పరిస్థితి. ఈ మండలంలో 71 కేంద్రాలకు గాను 25 అద్దె గదుల్లో కొనసాగుతున్నాయి.అత్తిలి, ఇరగవరం మండల్లాలోని ఈడూరు, కంతేరు, ఏలేటిపాడు గ్రామాల్లో భవన నిర్మాణాలను నిధులు మంజూరు కాకపోవడంతో గుత్తేదారులు మధ్యలోనే వదిలేశారు.

పోడూరు మండలం జిన్నూరు శివారు భూపయ్యచెరువులో నిర్మించిన భవనానికి గుమ్మాలు, పైపులైన్ల ఏర్పాటు, విద్యుదీకరణ పనులు చేయించాల్సి ఉంది. ఈ మండలంలో మూడు భవనాలు అసంపూర్తిగా మిగిలాయి. భవన నిర్మాణాల పరిస్థితిపై ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి తెలిపారు.

## మూడున్నర కోట్లు మురగబెట్టారు

ఏలూరు: 17వ లోక్‌సభలో ఏలూరు నుంచి ప్రాతినిధ్యం వహించిన వైకాపా ఎంపీ కోటగిరి శ్రీధర్ ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకుని, లోక్‌సభ రద్దయ్యే నాటికి కేటాయించిన ఎంపీ లాడ్స్ నిధులను పూర్తిగా వెచ్చించలేకపోయారు. నిధులు ఖర్చు చేసే విషయంలో ఆయన ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో మిగిలిపోయిన నిధులే అందుకు నిదర్శనం. ఖర్చుకాకుండా రూ.3.76 కోట్లు మిగిలిపోయాయి. ఈ నిధులను ప్రస్తుత 18వ లోక్‌సభ సభ్యుడు పుట్టా మహేశ్‌కుమార్ వినియోగించొచ్చు.గ్రామాల్లో సామాజిక భవనాలు, పట్టణ, గ్రామీణంలో రహదారుల నిర్మాణాలు, క్రీడావసతుల కల్పనకు, మున్సిపల్ పట్టణాల్లో తాగునీటి సౌకర్యం కల్పనకు, ఆసుపత్రుల అభివృద్ధికి, పొలాల బాటలకు, కొల్లేరు గ్రామాల అనుసంధాన రహదారుల నిర్మాణాలకు ఖర్చుపెట్టుకోవచ్చు. జిల్లాలో రహదారులు చాలా అధ్వానంగా ఉన్నాయి. అయినా నిధులు ఖర్చు చేయలేదంటే ఎంపీకి చిత్తశుద్ధి కొరవడమే కారణమని చెప్పాలి. ఆయా పనులకు ఎంపీ ఆమోదం తెలపగానే జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి(సీపీవో)కి ప్రతిపాదనలు పంపితే మంజూరు పత్రాలు జారీ చేస్తారు. అధికారులు టెండర్లు పిలిచి వాటిని పూర్తి చేయాలి. అయితే 52 పనులకు కనీసం టెండర్లు పిలవలేదు. వాటి విలువ రూ.3.76 కోట్లు. గతంలో ఎంపీ శ్రీధర్ ప్రతిపాదించిన ఈ పనులు రద్దయిపోయాయి. ప్రస్తుత ఎంపీ ప్రతిపాదిస్తేనే టెండర్లు పిలిచి ప్రారంభిస్తారు.

5 ఏళ్లలో రూ.22.66 కోట్ల పనులు..

కోటగిరి శ్రీధర్‌కు ఎంపీలాడ్స్ కింద మొత్తం 251 పనులకు రూ.22.66 కోట్లు కేటాయించగా ఈ ఏడాది నవంబరు నాటికి 193 పనులు మాత్రమే పూర్తయ్యాయి. వాటి విలువ రూ.17.60 కోట్లు. ఈ బిల్లులు మంజూరు చేశారు. మరికొన్ని పనులు పురోగతిలో ఉన్నాయి. అవి పలు దశల్లో ఉన్నాయి. చింతలపూడి నియోజకవర్గంలో అత్యధిక పనులకు కేటాయింపులు జరిపారు. ఏలూరు నగరంతో సహా పలు చోట్ల నిర్మించిన సామాజిక భవనాల వ్యయం పెరిగి పనులు పూర్తికాక అసంపూర్తిగా నిలిచిపోయాయి.

ఎంపీ లాడ్స్ నిధులు రూ.22.66 కోట్లు
పనుల సంఖ్య: 251
పూర్తయినవి 193
వెచ్చించిన వ్యయం రూ.17.60 కోట్లు
ప్రస్తుతం పురోగతిలో ఉన్న పనులు 6
వెచ్చించాల్సిన వ్యయం రూ.1.29 కోట్లు

## మట్టి మాఫియా.. నిఘా ఏదయా?



మడకశిర : పలువురు యంత్రాలతో మట్టిని తవ్వి తరలిస్తూ రోజుల కొద్ది మట్టి దోపిడీ చేస్తున్నా అధికారులు కన్నెత్తి చూడడం లేదు. మూడు రోజులుగా రొళ్ల కొండ ప్రాంతం నసేపల్లి గొల్లహట్టి వద్ద 8 ట్రాక్టర్ల ద్వారా పొక్లెయిన్‌తో మట్టిని తరలిస్తున్నారు. కొండ ప్రాంతాలు, చెరువులను ఆసరాగా చేసుకుని ఇటుక బట్టీలు, ఇళ్ల నిర్మాణానికి తరలిస్తున్నారు.

**గుంతలు తవ్విందిక్కడ**

రొళ్లకొండ, రత్నగిరి కొండ, దాసప్పపాళ్యంకొండ, అగ్రహారంకొండ, హెచ్.టీ.హళ్లికొండలు, కాకి చెరువు, హులికుంట చెరువు, రొళ్ల చెరువు, హునిసేకుంట చెరువు, సీఎంఘట్ట చెరువుల్లో..

**ఆవేదన పట్టదేం?**


కొండప్రాంతాలు, చెరువులను ఆసరాగా చేసుకుని ఎలాంటి అనుమతులు తీసుకోకుండా మట్టిని తరలించడం ఏంటి? మట్టిని తరలించే సమయంలో పొలాలమీదుగా దారి చేసుకుంటూ ఇబ్బంది కలిగిస్తున్నారు.

స్థానికులు

**అనుమతి ఉండాల్సిందే**

ఈ విషయంపై తహసీల్దార్ షేక్షావలిని వివరణ కోరగా కొండ ప్రాంతాలు, చెరువుల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ పొలాలకు మట్టి కావాల్సిన వారు సంబంధిత అధికారులతో అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

## కాసులిస్తే.. క్రమబద్ధీకరణ!




హిందూపురం : కొత్త దందా : అనుమతి లేని లేఅవుట్లను, భవనాలను క్రమబద్ధీకరించుకోవడానికి ఎల్ఆర్ఎస్, బీపీఎస్ స్కీములను తమకు అనుకూలంగా మలుచుకొని అవినీతికి పాల్పడుతున్నారు. హిందూపురం పట్టణంలోని కొందరు ప్లానింగ్ కార్యదర్శులు వసూల్ రాజాలుగా మారి పట్టణంలో ఎక్కడ నిర్మాణం జరుగుతున్నా వాలి తమ విభాగం అధికారులతో కలిసి బేరాలు సాగిస్తూ అవినీతికి పాల్పడుతున్నారు.

**నిబంధనల ప్రకారమైతే**

అనుమతిలేని వాటిని గుర్తించి, వారు క్రమబద్ధీకరణ చేసుకొనేలా చూడాల్సిన బాధ్యత టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బందిదే. పట్టణాల్లో భవన నిర్మాణాలకు, క్రమబద్ధీకరణ అనుమతి కోసం మున్సిపాలిటీ గుర్తించి, అనుమతి ఇచ్చిన లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ (ఎల్.టి.పి.)లు అయిన ప్రైవేటు సివిల్ ఇంజినీర్ల లాగిన్‌ల నుంచి ప్రజలు దరఖాస్తు చేసుకోవాలి. వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్లాన్ గీసి, అనుమతికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి.

**దందా వెలుగులోకి**

ఇటీవల ఓ కార్యదర్శి లేఅవుట్ క్రమబద్ధీకరణకు దాని యజమాని నుంచి రూ.3 లక్షలు తీసుకొన్నాడు. రూ.2 లక్షలు ఫీజు కట్టి, మరో రూ.లక్ష జేబులో వేసుకున్నాడు. ఎన్ని రోజులు గడిచినా దరఖాస్తు పరిష్కారం కాలేదంటూ యజమాని కార్యాలయానికి రావడంతో ఈ దందా బయటకొచ్చింది. పట్టణంలో పలు ప్రాంతాల్లో బహుళ అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయి. నిబంధనలను పాటించనివారి నుంచి లక్షలు డిమాండ్ చేస్తున్నారు. బెంగళూరు రోడ్డులో భవనాన్ని నిర్మిస్తున్న ఓ వ్యాపారిని రూ.5 లక్షలు అడిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. పరిగి రోడ్డులో దుకాణాల పేరుతో షెడ్లు వెలిశాయి. వాటికి తాత్కాలిక నిర్మాణాల కింద రూ.10 వేలు నుంచి రూ.50 వేలు ఫీజు మున్సిపాలిటీకి కట్టిస్తూ.. లక్షలాది రూపాయలను అధికారులు, సిబ్బంది దండుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి.

**వసూళ్లు ఇలా..**హిందూపురంలో కొందరు ఎల్.టి.పి.లు అనుమతులు రావని, అనేక నిబంధనలను భూతద్దంలో చూపి, మున్సిపల్ అధికారుల పేరు చెప్పి పెద్ద మొత్తంలో వసూలు చేశారని విమర్శలున్నాయి. మరి కొందరు ఎల్.టి.పి.లు భవన నిర్మాణ కాంట్రాక్ట్‌ను తమకు ఇస్తే, అనుమతులు సులభంగా వస్తాయని, లేదంటే కష్టమని చెప్పి, నిర్మాణ పనులను తీసుకొని, భారీగా ఆదాయం పొందేవారు. ఇది గుర్తించిన కొందరు అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులు, ఇంజినీరింగ్ పూర్తి చేసుకొని, బెంగళూరు లాంటి నగరాల్లో ఉద్యోగాలు చేస్తున్న, తమ మాట వినేవారిని గుర్తించి, ఎల్.టి.పి.లుగా మార్చారు.క్రమబద్ధీకరించుకో వడానికి వచ్చే యజమానులతో అధికారులు, కార్యదర్శులు మాట్లాడు కొని, తమ బినామీ ఎల్.టి.పి.ల లాగిన్, పాస్‌వర్డులను ఉపయోగించి, దరఖాస్తులు చేయడం, తమ లాగిన్‌ల నుంచి వారికి అనుమతులు వెంటనే మంజూరు చేయిస్తున్నారు. ఇందుకు భారీగా దండుకొంటున్నారు.

## బతుకు దైన్యం.. సాగు గగనం!



అనంతపురం : రబీలో పంటల సాగు విస్తీర్ణం ఐదేళ్లలో పరిశీలిస్తే ఏటా తగ్గుతూనే ఉంది. ప్రధాన పంటగా ఉన్న పప్పుసెనగ విస్తీర్ణం సైతం బాగా పడిపోతూ ఉంది. కారణాలు : జిల్లాలో రబీ సీజన్ నల్లరేగడి నేలల్లో ప్రధాన పంట పప్పుసెనగ. వర్షాధార పంట కూడా. మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడం, ధరలు తగ్గడం, విపరీతంగా తెగుళ్లు ఆశించడం, పెట్టుబడి ఖర్చులు పెరగడం వంటివి రైతులను కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయి. పప్పుసెనగ పంటకు ప్రత్యామ్నాయంగా తెల్ల, పచ్చజొన్నతోపాటు గత ఖరీఫ్‌లో కంది వంటి పంటలను అధికంగా సాగయ్యాయని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఎర్రనేలల్లో బోర్ల కింద మాత్రమే పంటలు సాగు చేస్తారు. ఇక్కడ కూడా రానురాను వ్యవసాయంలో నష్టాలు పెరుగుతుండటంతో రైతులు సాగును వదిలేస్తున్నాయి. జిల్లాలో.. రబీలో పప్పుసెనగ సాధారణ సాగు లక్ష్యం 75 వేల హెక్టార్లు. ఏటా పప్పుసెనగ సాగు తగ్గుతూనే ఉంది. దాని స్థానంలో ఇతర పంటలు సాగులోకి వచ్చాయని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

**నల్లనేలల్లో ప్రత్యామ్నాయ పంటలు**రవి - జేడీఏ (అనంతపురం)

ఈ ఏడాది రబీలో రేగడి భూముల్లో పప్పుసెనగ పంట సాగుకు బదులుగా పత్తి, జొన్న, ఖరీఫ్‌లో కంది పంటలు సాగు చేశారు. గత అక్టోబరు, నవంబరులో పత్తి, జొన్న, కుసుమ వంటి పంటలు సాగయ్యాయి. బోర్ల కింద ఎర్రనేలల్లో మొక్కజొన్న సాగు పెరిగింది. ఖరీఫ్‌లో నల్లనేలల్లో కంది సాగులోకి రావడంతో పప్పుసెనగ సాగు కొంత మేరకు తగ్గింది వాస్తవమే.

## ఆటలకు మంచిరోజులు

కుప్పం : కుప్పం పట్టణానికి ఏళ్ల కిందట మంజూరైన క్రీడా మైదానం వైకాపా పాలనలో కొండలు, గుట్టలకే పరిమితమైంది. మైదానం అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో గ్యాలరీలోని షెడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కుప్పం అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టిసారించారు. పురపాలిక పరిధిలోని వడ్డేపల్లె వద్ద అధికారులు 'ఎన్టీఆర్ క్రీడా మైదానం' అభివృద్ధికి రూ.76 కోట్లతో ప్రభుత్వానికి అధికారులు ప్రణాళికలు పంపారు. ఇందులో భాగంగా రూ.22 కోట్లు మొదట ప్రత్యేక గ్రాంటు కింద మంజూరు చేయడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

**శరవేగంగా పనులు** ప్రస్తుతం ఓపెన్ స్టేడియంతో పాటు ఇండోర్ క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేస్తున్నారు. మంజూరైన రూ.22 కోట్లతో ప్రహరీ, 20 ఎకరాల భూమిని చదును పనులు చేస్తున్నారు. ఖేలో ఇండియా పథకంలో భాగంగా మల్టీ పర్పస్ ఇండోర్ బ్లాకు నిర్మాణానికి రూ.14 కోట్లు మంజూరు చేశారు. మరికొన్ని పనులకు ప్రతిపాదనలు పెట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది మార్చి నాటికి మైదానంలోని బండరాళ్లను పూర్తిగా తొలగించి చదును చేస్తామని, తర్వాత స్పోర్ట్స్ కాంప్లెక్స్, క్రీడాకారుల వసతి గృహ నిర్మాణం చేపడతామని పుర కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు.

## పగలు సేకరణ.. రాత్రుళ్లు రవాణా!

అనకాపల్లి : జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ప్రజాప్రతినిధులు, పోలీసులు తప్పితే.. అక్రమ రవాణాను అరికట్టాల్సిన పౌరసరఫరాల శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. పేదలకు అందాల్సిన చౌక బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రతి నెలా రేషన్ బియ్యం లబ్ధిదారుల ఇళ్లకు చేరక ముందే అక్రమార్కుల పరమవుతోంది. జిల్లా వ్యాప్తంగా ఈ దందాను కట్టడి చేయాల్సిన సంబంధిత అధికారులే దళారులకు సహకరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

ప్రతి మండలంలోనూ రేషన్ బియ్యం కొనుగోలు చేసేందుకు ముఠాలున్నాయి. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. వీరి హవానే సాగుతోంది. చోడవరం, ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల్లో వీరికి ఎదురే లేదు. ఆయా మండలాల్లో రేషన్ బియ్యాన్ని దళారులే కొనుగోలు చేయాలన్న ఆదేశాలున్నాయి. పగలు దండటం, సమీపంలోని రైస్ మిల్లుల్లో నిల్వ చేయడం చేస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో లోడ్ చేసి కాకినాడ పోర్టుకు తరలిస్తున్నారు. అధికారులు తమ టార్గెట్‌కు అనుగుణంగా.. దాడులు చేసి దళారుల సూచనల మేరకు నామమాత్రంగా కేసులు నమోదు చేస్తూ చేతులు దులిపేసుకుంటున్నారు. జిల్లాలో కార్డుదారుల నుంచి రేషన్ డీలర్లు కేజీ బియ్యం రూ.18 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. వీరు బియ్యం వ్యాపారులకు రూ.20 చొప్పున అమ్ముతున్నారు. వ్యాపారులు పాలిష్ పట్టి కేజీకి రూ.30 ధర నిర్ణయించి కాకినాడకు తరలిస్తున్నారు.

జిల్లాలో పౌరసరఫరాల శాఖ డీటీలు ఆరుగురు ఉన్నారు. వీరెవరూ ఎక్కడా ఒక్క బియ్యం కేసు పట్టుకున్న దాఖలాల్లేవు. స్థానికులు పట్టుకుని అప్పగించే సందర్భాల్లో మాత్రమే కేసులు నమోదు చేస్తున్నారు. ఎలమంచిలి పౌర సరఫరాల శాఖ డీటీకి గ్రామాల నుంచి ఎవరైనా



ఫోన్ చేసి సమాచారం ఇచ్చినా.. ఆ ప్రాంత వ్యాపారులకు సమాచారం చేరవేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఎలమంచిలిలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ శనివారం 2,625 కేజీల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఎమ్మెల్యే ఫోన్ చేసి చెప్పాక రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకున్నారు.

**ప్రత్యేక నిఘా పెట్టాం...** ప్రతి నెలా రేషన్ అందించే సమయాల్లో.. బియ్యం పక్కదారి పట్టకుండా దాడులు చేస్తున్నాం. డీటీలు, తహసీల్దార్లు తనిఖీలు చేయాలని ఆదేశాలిచ్చాం. ప్రభుత్వం ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తోంది. రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై ప్రత్యేక నిఘా పెట్టాం.కేవీఎన్ మూర్తి, డీఎస్‌వో, అనకాపల్లి


## భవిత మార్చేలా... నైపుణ్యం నేర్పేలా...

విశాఖపట్నం: చదువు పూర్తయిన తర్వాత మంచి ఉద్యోగం సాధించాలంటే నైపుణ్యం అవసరం. ఉద్యోగంలో చేరిన తర్వాత ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నా నైపుణ్యాలే కీలకం. దీన్ని గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు వృత్తి విద్య నైపుణ్యాలు నేర్పిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు స్వయం ఉపాధికి బాటలు వేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం, సమగ్ర శిక్షా (ఎస్ఎస్) భాగస్వామ్యంతో జిల్లాలోని పాఠశాలలకు ప్రయోగ, శిక్షణ సామగ్రి అందజేశారు. కోర్సులు నేర్పించడానికి ప్రత్యేకంగా నిపుణులను నియమించారు. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకున్న విద్యార్థులకు నైపుణ్యాలు నేర్పిస్తున్నారు.

**ఇంటర్న్‌షిప్, పరిశ్రమల సందర్శన**

జిల్లాలో 31 పీఎంశ్రీ, కేజీబీవీ, ఆదర్శ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో విద్యార్థులకు వృత్తి విద్య నైపుణ్యాలు నేర్పిస్తున్నారు. పీఎం శ్రీ పాఠశాలల్లో మూడేసి, మిగిలిన పాఠశాలలో ఒక్కో కోర్సు బోధిస్తున్నారు. 6 నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు ప్రీ ఒకేషనల్ కింద కౌశల్ బుద్ధ్ పేరిట నిర్వహిస్తున్నారు. వారికి పుస్తకాల్లో వృత్తి నైపుణ్యాలను నేర్పిస్తారు. వీరికి ఎక్స్‌పోజర్ విజిట్‌లో భాగంగా వృత్తి నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఫలితంగా వారికి ఏదో ఒక అంశంపై ఆసక్తి మొదలవుతుంది.

9 నుంచి 12వ తరగతి విద్యార్థులకు శిక్షణతోపాటు ఇంటర్న్‌షిప్,



పరిశ్రమల సందర్శన ఉంటుంది. వీరికి ప్రాక్టికల్ పరీక్షలు కూడా నిర్వహిస్తారు.ప్రతి పాఠశాలలో టైమ్ టేబుల్‌లో వారానికి నాలుగు పీరియడ్స్ కేటాయిస్తున్నారు. సంక్రాంతి, దసరా, ఇతర సెలవుల సమయంలో విద్యార్థులతో ఇంటర్న్‌షిప్ చేయిస్తున్నారు.

పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తయిన తర్వాత వారికి ప్రాక్టికల్స్ ఉంటాయి.

చదువుకుంటూనే ఉపాధి విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా నైపుణ్యాలు నేర్చుకోవడానికి ఒకేషనల్ విద్య ఉపకరిస్తుంది. ఇంటర్ పూర్తయిన తర్వాత విద్యార్థులు ఖాళీ సమయాల్లో నేర్చుకున్న నైపుణ్యాలతో ఉపాధి పొందగలరు. అవసరమైతే చదువుకుంటూనే పని చేసుకోవడానికి వీలుంటుంది. కొన్ని కోర్సులో చేరిన విద్యార్థినులు సెలవుల్లో ఆ నైపుణ్యాలతో కొంత మొత్తం సంపాదిస్తున్నారు.

డా.జె.చంద్రశేఖర్‌రావు, ఏపీసీ, సమగ్రశిక్ష

జిల్లాలో కోర్సులు ఆటోమోటివ్
వ్యవసాయం అపెరల్ (దుస్తులు కుట్టడం)
బ్యూటీ అండ్ వెల్‌నెస్
ఎలక్ట్రానిక్స్
ఫుడ్ ప్రాసెసింగ్
హెల్త్‌కేర్‌జి ఐటీ-ఐటీఈఎస్
రిటైల్‌జి బ్యాకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్

చురకలు



# అత్యవసర వేళ ఆపసోపాలు..!

విశాఖపట్నం : గమ్యనగరిగా పేరుగాంచిన విశాఖకు ఇటీవల పర్యాటకుల తాకిడి పెరిగింది. ఆర్కేబీచ్, కైలాసగిరి, వుడా పార్కు, రుషికొండ వంటి ప్రాంతాలు ప్రస్తుతం సందర్శకులతో కిటకిటలాడుతున్నాయి. అయితే అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించడంలో వీఎంఆర్డీఏ యంత్రాంగం విఫలమవుతోందనే విమర్శలు వస్తున్నాయి. ఆదివారం నగరంలోని పలు ప్రాంతాలను 'ఈనాడు' పరిశీలించగా పర్యాటకులు పడుతున్న ఇబ్బందులు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా మరుగుదొడ్లు అందుబాటులో లేక, ఎక్కడికి వెళ్లాలో తెలియక మహిళలు అవస్థలు పడటం కనిపించింది.

**రుషికొండలో కేవలం రెండు మరుగుదొడ్లు:** బ్లూఫ్లాగ్ గుర్తింపు పొందిన రుషికొండ బీచ్‌ను నిత్యం 10వేల మందికిపైగా సందర్శిస్తుంటారు. ఇలాంటి ప్రాంతంలో కేవలం రెండు మరుగుదొడ్లు మాత్రమే ఉండటం గమనార్హం. దీంతో పర్యాటకులు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. జీవీఎంసీ నిధులు రూ.55 లక్షలతో 22 మరుగుదొడ్ల నిర్మాణానికి జులైలో శంకుస్థాపన చేశారు. ఆయా పనులు నత్తనడకన సాగుతున్నాయి. సాగర్‌నగర్ బీచ్‌లో గతంలో ఉన్న కంటైనర్ మరుగుదొడ్లను తొలగించేశారు. బీచ్ రోడ్డులో వుడా పార్కు నుంచి కోస్టల్‌బ్యాటరీ వరకు నాలుగు చోట్ల జీవీఎంసీ ఆధ్వర్యంలో నడిచే ప్రజామరుగుదొడ్లు ఉన్నాయి. కోస్టల్‌బ్యాటరీ నుంచి ఆర్కే బీచ్ వరకు ప్రస్తుతం ఒకటి ఉండగా మరో రెండు ఏర్పాటు చేయాల్సి ఉంది. వుడా పార్కు నుంచి కోస్టల్‌బ్యాటరీ మధ్య ప్రస్తుతం నాలుగు ఉండగా, వాటిని రెట్టింపు చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



**ఇతర ప్రాంతాల్లో ఇలా..:** వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో కురుసురా జలంతర్గామి, టీయూ-142, సీహారియర్ యుద్ధ విమానం, యూహెచ్-3హెచ్ హెలికాప్టర్ మ్యూజియం ఉన్నాయి. వీటి నుంచి ఏటా రూ.5 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకంగా మరుగుదొడ్లు లేకపోవడం గమనార్హం.

ఆర్కేబీచ్ కాళీమాత ఆలయం సమీపంలోని మరుగుదొడ్లు నిత్యం రద్దీగా ఉంటున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని అదనంగా రెండు యూనిట్లు ఏర్పాటు చేయాలి.

దీనిపై వీఎంఆర్డీఏ కార్యదర్శి మురళీకృష్ణను సంప్రదించగా పర్యాటక ప్రాంతాలను పరిశీలించి అవసరమైన చోట అదనపు మరుగుదొడ్లు ఏర్పాటు చేయిస్తామని చెప్పారు.


ప్రజా మరుగుదొడ్లు ఉన్న ప్రాంతాలు..కోస్టల్‌బ్యాటరీ: 2 తెన్నేటి పార్క్: 1 ఆర్కే బీచ్: 2 పాండురంగా పురం: 1 వైఎంసీఏ: 1 రుషికొండ కూడలి: 1 జోడుగుళ్ల పాలెం: 1

# అడ్డురోడ్డుకు మహర్దశ!

అనకాపల్లి : నక్కపల్లి కేంద్రంగా ఏర్పాటు చేయాల్సిన కొత్త రెవెన్యూ డివిజన్‌ను ప్రభుత్వం మార్చింది. ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు కూడలిలో దీనిని ఏర్పాటు చేయడానికి నిర్ణయించింది. మంత్రులు, అధికారులతో సీఎం చంద్రబాబునాయుడు అమరావతిలో ఇటీవల నిర్వహించిన మంత్రివర్గ ఉపసంఘం సమీక్షలో రెవెన్యూ డివిజన్ మార్పుపై నిర్ణయం తీసుకున్నారు. దీంతో నక్కపల్లికి బదులు అడ్డురోడ్డు కేంద్రంగా డివిజన్ ఏర్పాటు కానుంది.

పారిశ్రామికాభివృద్ధి పరంగా శరవేగంగా అడుగులు వేస్తున్న నక్కపల్లిలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు మంత్రి అనిత చొరవ చూపారు. ఇందుకు మంత్రివర్గ ఉపసంఘంలోనూ ఆమోదం లభించింది. ప్రాథమిక నోటిఫికేషన్ తర్వాత.. రాష్ట్రవ్యాప్తంగా నూతన జిల్లాలు, డివిజన్ల ఏర్పాటుపై అభ్యంతరాలను స్వీకరించింది. ఈ క్రమంలో నక్కపల్లి డివిజన్‌ను తప్పించి.. ఎలమంచిలి కేంద్రంగా నూతన రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయాలంటూ ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలు నిరసనలు తెలిపారు. స్థానిక కూటమి నేతలు సైతం ఎలమంచిలి కేంద్రంగా డివిజన్ ఏర్పాటు చేయాలంటూ ప్రతిపాదించడంతో దీంతో ఇక్కడి ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని నక్కపల్లికి బదులుగా దీనికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న అడ్డురోడ్డు జంక్షన్‌ను డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు సీఎం సుముఖత వ్యక్తం చేశారు. తద్వారా ఆయా ప్రాంతాల వారికి మరింత అందుబాటులో ఉంటుందని ఆలోచన.

**మునగపాక అనకాపల్లిలోనే:** జిల్లా కేంద్రానికి అతి దగ్గరగా ఉన్న మునగపాక మండలాన్ని అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లోనే ఉంచాలని



స్థానిక నేతలు, ప్రజలు విన్నవించారు. ఇటీవల జిల్లా డీఆర్‌సీ సమావేశంలోనూ అనకాపల్లిలోనే మునగపాక మండలాన్ని కొనసాగించాలని తీర్మానించారు. మరోవైపు చీడికాడ మండలాన్ని నర్సీపట్నం నుంచి అనకాపల్లి డివిజన్‌లో కలిపేలా మారుస్తున్నారు. దీంతో అనకాపల్లిలో 10, నర్సీపట్నం, అడ్డురోడ్డు రెవెన్యూ డివిజన్లలో ఏడేసి మండలాల చొప్పున కొనసాగనున్నాయి. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల, ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలతో అడ్డురోడ్డు కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటు కానుంది. ఈ నెలాఖరున ప్రభుత్వ తుది నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉంది.

**అభివృద్ధిలో వేగంగా ..** తుని, పాయకరావుపేట తర్వాత అడ్డురోడ్డు వాణిజ్యపరంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. పేరుకే తిమ్మాపురం పంచాయతీలో ఉన్నా.. అందరికీ అడ్డురోడ్డు పేరే సుపరిచితం. ఇక్కడ అనేక విద్యా సంస్థలు, ఆసుపత్రులు, వస్త్ర, ఇతర వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్లు, స్థిరాస్తి వ్యాపారం.. ఇలా అన్నివిధాలా అభివృద్ధి చెందుతోంది. దీనికి తోడు పర్యాటక ప్రాంతమైన రేవుపోలవరం తీరం కూడా ఇదే మండలంలో ఉంది. మరోవైపు ఆది నుంచి నక్కపల్లి పేరును తెరపైకి తెచ్చి చివరిలో అడ్డురోడ్డు డివిజన్ ఏర్పాటు చేయడంపై స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

# వద్దన్నా.. 'బరి'తెగింపే!



అనకాపల్లి : ఒకప్పుడు గోదావరి జిల్లాలకు పరిమితమైన కోడిపందేలు ఇప్పుడు జిల్లాలోనూ ఏర్పాటు చేస్తున్నారు. గతేడాది జిల్లాలో అక్కడక్కడ నిర్వహించగా.. ఈసారి పెద్దసంఖ్యలో బరులు ఏర్పాటు చేస్తున్నారు. సంప్రదాయం ముసుగులో కోడి పందేలు నిర్వహించడం నేరమని, నిబంధలకు విరుద్ధంగా ఎక్కడైనా నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతోపాలు పందేలు నిర్వహిస్తే కేసులు పెడతామని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ఇటీవల బుచ్చెయ్యపేట మండలం బంగారయ్యపేటలో సన్నాహక కోడిపందేలపై పోలీసులు దాడి చేసి పందెంరాయుళ్లను, కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. జూద శిబిరంపై దాడి నలుగురిని అరెస్టు చేసి రూ. 72 వేలు స్వాధీనం చేసుకున్నారు. అయినా.. పందెంరాయుళ్లు నేతల అండదండలతో జిల్లాలో బరులు సిద్ధం చేస్తున్నారు. దీంతోపాటు గుండాట, పిక్కాటకు ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. పాస్‌లు, స్టాళ్లకు వేలం సైతం నిర్వహించారు. పందెం శిబిరాల ఆవరణలో గొలుసు దుకాణాల నిర్వహణకు రోజుకు రూ. 7 వేల నుంచి రూ. 10 వేల వరకు ధర నిర్ణయించినట్లు సమాచారం.

**ఎక్కడెక్కడంటే..**

పాయకరావుపేట మండలంలోని శ్రీరాంపురం, వెంకట నగరం, సత్యవరం, పాల్మన్‌పేట, కుమారపురం, నామవరం, పి.ఎల్.పురంలో బరులు సిద్ధం చేస్తున్నారు. నక్కపల్లి మండలం వేంపాడులో భారీ స్థాయిలో ఫ్లడ్‌లైట్లు, స్టేజీలు, ఎల్ఈడీ దీపాలు, షామియానాతో ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు, రాయవరం, లింగరాజుపాలెం, కోటవురట్ల, వెంకటాపురంలో పోటీలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అచ్యుతాపురం మండలం చోడపల్లి, రాంబిల్లి మండలం వెంకటాపురంలో అన్ని హంగులతో బరులను తీర్చిదిద్దుతున్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు సహించం... సంక్రాంతి ముసుగులో కోడిపందేలు, జూదం నిర్వహించరాదు. ఇప్పటికే అన్ని పోలీస్ స్టేషన్ల ద్వారా హెచ్చరికలు పంపాం. మారుమూల ప్రాంతాలు, పొలాలపై నిరంతరం డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెడతాం. తనిఖీలకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశాం. పట్టుబడితే కఠిన చర్యలు తప్పవు.

– తుహిన్‌సిన్హా, ఎస్పీ, అనకాపల్లి

# సేంద్రియ పంట.. తింటే వదలరంట



సింహాచలం : సింహాచలం కొండకు జల పర్వతంగా పేరు. ఈ కొండపై పండే ఏ పంటైనా అద్భుతంగా ఉంటుందని భక్తులు చెబుతుంటారు. సింహాచలం సంపెంగలకు చారిత్రక నేపథ్యం సైతం ఉంది. ఈ క్రమంలో గతంలో సుమారు వంద ఎకరాల్లో కృష్ణాపురంలోని సింహాచలం దేవస్థానానికి చెందిన స్థలాన్ని అభివృద్ధి చేసి నృసింహవనంగా పేరు పెట్టారు. అతిపెద్ద గోశాలను ఏర్పాటు చేసి 250 పైగా మేలుజాతి గోవులను సంరక్షిస్తున్నారు. కొవిడ్ అనంతరం ముడసర్లోవ సమీపంలోని సుమారు 25 ఎకరాల దేవస్థానం స్థలాన్ని అభివృద్ధి చేశారు. ఇక్కడ పశువులకు గ్రాసం, సేంద్రియ వ్యవసాయం ద్వారా కూరగాయలు పండిస్తున్నారు.

కొండవాలును సారవంతం చేసి..: సింహాచలం కొండవాలు ప్రాంతాల్లోని భూమి పోడు వ్యవసాయానికి మాత్రమే పనికొస్తుంది. ఎక్కువగా రాళ్లు, బండలు ఉండే ఈ ప్రాంతాన్ని అధికారులు సారవంతంగా మార్చారు. ఇక్కడ పంటలకు వీలుగా మూడు చోట్ల బోర్లు వేసి నీటి కొరత లేకుండా చేశారు.

సుమారు 20 ఎకరాల్లో గోశాలలోని పశువులకు అవసరమయ్యే పచ్చగడ్డిని పెంచుతున్నారు. దీనికి వాటర్ గన్ విధానం ద్వారా నీటిని అందిస్తూ పొదుపు పాటిస్తున్నారు. మరో అయిదు ఎకరాల్లో పదమూడు రకాల కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. దీని కోసం బిందు సేద్యం విధానాన్ని అమలు చేస్తున్నారు. గోశాలలోని పశువుల వ్యర్థాలతో ఎరువులు తయారు సేంద్రియ విధానంలో పంటలు పండిస్తున్నారు.

**9 నెలల్లో.. 32 వేల కిలోలు..:** కొత్తగా అభివృద్ధి చేసిన నృసింహవనంలో గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు తొమ్మిది నెలల్లో 32,479 కిలోల కూరగాయలను పండించారు. దీంతో పాటు 3,700 అరటి గెలలను సరఫరా చేశారు. ఇక్కడ పండించిన కూరగాయలు, ఆకుకూరలను అప్పన్న స్వామి అన్నప్రసాద తయారీలో వినియోగిస్తున్నారు. భక్తులకు సేంద్రియ కూరగాయలతో వండి వడ్డిస్తున్నారు. దేవస్థానానికి చెందిన విద్యార్థుల వసతి గృహాలకు కూడా వీటినే సరఫరా చేస్తున్నారు. ఈ వనంలో డాక్టర్ పీవీజీ రాజు (రాజా సాహెబ్) వ్యవసాయ క్షేత్రం పేరిట సింహాచలానికి ప్రత్యేకమైన సంపెంగ, పనస తోటల పెంపకానికి శ్రీకారం చుట్టారు. ఇటీవల పాత నృసింహవనంతో పాటు ఇక్కడ కూడా ఆయా మొక్కలను నాటించారు. గూగుల్ డేటా సెంటర్‌కు ప్రతిపాదించిన భూమిని ఆనుకుని ఉన్న ఈ వనం ఎంతగానో ఆకట్టుకుంటోంది.

# తిప్పలకు 'ఎర్ర'వేశారు

నంద్యాల : గతేడాది భారీ వర్షాలు కురిశాయి. చెరువులన్నీ నిండాయి. వాగులు, నదుల్లో పెద్దఎత్తున నీరు చేరడంతో మట్టి తవ్వకాలకు ఆటంకం ఏర్పడింది. ప్రస్తుతం ప్రవాహం ఆగిపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. మట్టి, ఇసుకను తవ్వి సొమ్ము చేసుకున్నారు. గత ఆరు నెలలుగా నెమ్మదించిన తవ్వకాలు మళ్లీ ఊపందుకున్నాయి. ప్రత్యేకించి ఇటుక బట్టీలు, లేఅవుట్లు, స్థలాల చదునుకు ఉపయోగపడే ఎర్రమట్టికి గిరాకీ ఎక్కువగా ఉండడంతో వాటిపై కన్నేశారు. యథేచ్ఛగా తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు చోద్యం చూస్తున్నారు. రాళ్లు, గులకలు, మట్టితో కలిసి ఉండే మొరం కోసం నంద్యాల, ఆళ్లగడ్డ ప్రాంతాల్లోని స్థిరాస్తి వ్యాపారులు అక్రమార్కులను సంప్రదిస్తున్నారు. నంద్యాల పట్టణంలోని కుందూ ఒడ్డు, గాజులపల్లి, గోపవరం తదితర ప్రాంతాల్లోని చెరువులను తవ్వేస్తున్నారు. టిప్పరు ఎర్రమట్టి రూ.10 వేలు, ట్రాక్టరు లోడు రూ.4 వేల వరకు విక్రయిస్తున్నారు. యంత్రాలతో తవ్విన మొరుసును నేరుగా వెంచర్ల వద్దకు తరలిస్తున్నారు. విచ్చలవిడిగా తవ్వకాలు జరుగుతున్నా రెవెన్యూ, గనులు, పోలీసు శాఖ అధికారులు చోద్యం చూస్తుండటం గమనార్హం.

**అనుమతులు లేకనే..**

రుద్రవరం మండలం టి.లింగందిన్నె, తువ్వపల్లి, ఆలమూరు ఎర్రమట్టి తిప్పల్లో తవ్వకాలు సాగుతున్నాయి. వీటికి ఎలాంటి అనుమతులు లేవు. తవ్విన మట్టిని ఇటుక బట్టీలతోపాటు స్థిరాస్తి వెంచర్లకు తరలిస్తున్నారు. మరికొంత మట్టిని గుంతలు పూడ్చేందుకు వినియోగిస్తున్నారు.

మహానంది మండలం అంకిరెడ్డిపల్లె చెరువులో పెద్దఎత్తున మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. ఫలితంగా చెరువు రూపు కోల్పోయింది. శిఖం భూమి.. పెద్దపెద్ద గుంతలతో లోయలను తలపిస్తోంది. చెరువు ఆనుకుని నంద్యాల-ఒంగోలు రహదారి పక్కన భారీగా తవ్వకాలు చేపట్టడంతో కట్టకు ముప్పు పొంచి ఉంది.



మహానంది, రుద్రవరం మండలాల్లో లభ్యమయ్యే ఎర్రమట్టికి మంచి ఆదరణ ఉంది. కుండల తయారీతోపాటు పంట పొలాలు, ఉద్యానవన పంటలకు ఉపయోగిస్తారు. ఫలితంగా ఈ మట్టిపై అక్రమార్కుల కన్ను పడింది. శిరివెళ్ల మండలం మహదేవపురం గ్రామంలో పంట పొలాలకు ఉపయోగపడే రహదారిని సైతం యంత్రాలతో ఇష్టానుసారంగా తవ్వేయడం గమనార్హం.

**జనం అడ్డుకుంటున్నా..**

శిరివెళ్ల మండలం మహదేవపురం బంజరు భూములు, చెరువుల్లో ఎర్రమట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. పోలేరమ్మ, సర్వ నరసింహస్వామి ఆలయానికి వెళ్లే ప్రాంతాల్లోనూ తవ్వేస్తున్నారు. టిప్పర్లు, ట్రాక్టర్లలో మట్టిని నింపి నంద్యాల పట్టణ శివారులోని అయ్యలూరుమెట్ట, పెద్ద కొట్టాల, పొన్నాపురం ప్రాంతాల్లోని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. వాహనాలు అతివేగంగా వెళుతుండటం.. పరిమితికి మించి మట్టిని తరలిస్తుండటంతో ఆయా ప్రాంత ప్రజలు పలుమార్లు అడ్డుకున్నారు.

నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలోని గాజులపల్లె మెట్టపై ఎర్రమట్టిని తరలిస్తున్న టిప్పర్లను ప్రజలు అర్ధరాత్రి వేళ అడ్డుకోవడం చూస్తుంటే పరిస్థితి తీవ్రతను చెప్పకనే చెబుతోంది.

# కార్మికులకు కార్డు.. భద్రతకు రివార్డు!

తిరుపతి : అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందడగు వేస్తున్నాయి. ఈ - శ్రమ్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. కార్మికుల గుర్తింపునకు పోర్టల్‌లో నమోదుకు అవకాశం కల్పిస్తోంది. ఈ కార్డుతో అనేక ప్రయోజనాలు ఉన్నా.. చాలామంది నమోదు చేసుకోలేదు.

**అర్హులు ఎవరు:**

18- 59 ఏళ్లలోపు వారు అర్హులు. ఈ- శ్రమ్ కార్డులతో అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత లభిస్తుంది.

ఇప్పటివరకు కొన్ని పథకాలు కుటుంబంలో ఒక్కరికే వర్తించేవి. ఫలితంగా కుటుంబంలో ఒకరిద్దరు కార్మికులుంటే నష్టపోయే పరిస్థితి. ఈ - శ్రమ్‌తో ప్రతి అసంఘటిత కార్మికుడికి సామాజిక భద్రతతోపాటు వివిధ పథకాలు అందుతాయి.

దరఖాస్తు ఇలా..: ఈ - శ్రమ్ గుర్తింపు కార్డు కోసం చరవాణిలో సొంతంగా దరఖాస్తు చేసుకోవచ్చు. తిరుపతి, చిత్తూరు కార్మిక శాఖ కార్యాలయాలలో ప్రత్యేకంగా సెంటర్లు ఏర్పాటు చేశారు. సీఎస్‌ఈ




కేంద్రాల్లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఫొటో గుర్తింపు కార్డుతోపాటు వివరాలు నింపి కార్డులు పొందవచ్చు. ఒకసారి తీసుకుంటే ఐదేళ్లు అమలులో ఉంటుంది. జిల్లా కార్మిక శాఖ అధికారులు అవగాహన సదస్సులు.. ప్రత్యేక శిబిరాల ద్వారా నమోదు ప్రక్రియ చేపట్టారు.

మాన్‌ధనం: పీఎం - శ్రమ యోగి మాన్ ధన్ (ఎస్‌వైఎం) పథకానికి 18 - 40 ఏళ్ల వయస్సున్న కార్మికులు అర్హులు. కార్మికులు వయస్సు ఆధారంగా కొంత నగదు చెల్లిస్తే అందుకు సరిపడా డబ్బును ప్రభుత్వం చెల్లిస్తాయి. 61 ఏళ్లు దాటిన తర్వాత కార్మికులకు పింఛను వర్తిస్తుంది. కనిష్ఠంగా రూ.55.. గరిష్ఠంగా రూ.200 చెల్లించాల్సి ఉంటుంది.

**ఆర్థిక ప్రయోజనం:**

ఈ - శ్రమ్‌తో ప్రతి అసంఘటిత రంగ కార్మికుడికి ఏడాదిపాటు సురక్షా బీమా యోజన ద్వారా రూ.2 లక్షల ప్రమాద మరణ, అంగ వైకల్య బీమా ఉచితంగా వర్తిస్తుంది.

వలస కార్మికులు ఎక్కడ ఉన్నారో గుర్తించి వారికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటారు.

కార్మికుడు ప్రమాదవశాత్తు చనిపోతే చంద్రన్న బీమా సాయం కింద రూ.ఐదు లక్షల సాయం చేస్తారు.

కార్మికురాలు, కార్మికుడి కుమార్తె వివాహానికి రూ.20 వేలను మూడేళ్ల తర్వాత ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో అందిస్తారు.

ఉమ్మడి జిల్లాలో కార్మికులు: 9 లక్షల మంది ఇందులో భవన నిర్మాణ కార్మికులు: 1,45,341 మందిఈ శ్రమ్‌లో నమోదైన కార్మికులు

చిత్తూరు: 4,66,831

తిరుపతి: 78,912

మదనపల్లె: 1,08,117

# తెలుగు అకా'డమ్మీ'

తిరుపతి : రాష్ట్ర విభజన నేపథ్యంలో వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి రాష్ట్రస్థాయి ప్రభుత్వ సంస్థ కేటాయించాలని నిర్ణయించారు. తిరుపతి కేంద్రంగా ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీని తిరుపతికి 2020 జూన్ 16న నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేశారు. తెలుగు, సంస్కృత భాషల అభివృద్ధి బాధ్యతల్ని తెలుగు అకాడమీకి అప్పగిస్తూ తిరుపతిలో తెలుగు, సంస్కృత అకాడమీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అంతర్గత సమస్యలతో అకాడమీ ఏర్పాటులో జాప్యం చోటు చేసుకోగా.. 2022 జూన్ 1 ఎట్టకేలకు తిరుపతిలోని తుమ్మలగుంట మార్గంలో తితిదే గోశాలకు చెందిన భవనంలో ప్రారంభమైంది. వైకాపా ప్రభుత్వ పాలనలో అకాడమీని విజయవాడ నుంచి తరలింపు ప్రక్రియ కూడా ప్రారంభం కాలేదు. దీంతో తిరుపతిలో అకాడమీ కాగితాలకే పరిమితమైంది.

**ఉద్యోగులు విజయవాడలో..**అకాడమీని అధికారికంగా తిరుపతిలో ఏర్పాటు చేసినప్పటికీ అనధికారికంగా ఇప్పటికీ విజయవాడ నుంచే కార్యకలాపాలు జరుగుతున్నాయి.

**స్థలాన్వేషణతో సరి**

విభజిత ఆంధ్రప్రదేశ్ తొలి ఛైర్‌పర్సన్‌గా లక్ష్మీపార్వతిని గత ప్రభుత్వం నియమించగా ఆమె అకాడమీ భవన నిర్మాణ స్థలాన్వేషణకే పరిమితమయ్యారు.

**వారు తిరుపతి వస్తే ఒట్టు**

తెలుగు అకాడమీ కార్యాలయ నిర్వహణ కోసం కేటాయించిన రీసెర్చ్, సేల్స్, పరిపాలనాధికారులతో సహా 14 మంది ఉద్యోగులు తిరుపతిలోని కార్యాలయంలో ఇప్పటి వరకు అడుగుపెట్టిన దాఖలాలు లేవు.

**అక్కడి నుంచి అటే..**

విజయవాడలో పుస్తకాలను ముద్రించి వాటిని అక్కడి నుంచే రాష్ట్రంలోని అనంతపురం, విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం, గుంటూరు ప్రాంతీయ కేంద్రాలకు చేరవేసి విక్రయాలు సాగిస్తున్నారు. తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్‌గా నియమితులైన ఆర్.డి.విల్సన్ సైతం తిరుపతిలోని అకాడమీ ప్రధాన కార్యాలయాన్ని కన్నెత్తి చూడలేదు.

**ఇంటర్ పాఠ్యపుస్తకాలకే పరిమితం**

ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ ఇంటర్, డిగ్రీ, పీజీ, డీఎడ్, బీఎడ్, ఆధునిక తెలుగుబోధన, ఎంసెట్ పుస్తకాలతో పాటు వివిధ అనువాదాలు, మోనోగ్రాఫులు, జనరంజక గ్రంథాలు, వ్యాసావళి, పోటీ పరీక్షల పుస్తకాలతో పాటు నిఘంటువులు, పరిపాలన న్యాయ పదకోశం వంటి 158కి పైగా ప్రచురణలు ముద్రించేది. ప్రస్తుతం కేవలం ఇంటర్, డీఎడ్, బీఎడ్, పాఠ్యపుస్తకాలు, పరిమిత సంఖ్యలో టెట్, డీఎస్సీ స్టడీ మెటీరియల్ మాత్రమే ముద్రించి సరఫరా చేస్తోంది.

ప్రస్తుతం తిరుపతి ప్రాంతీయ కేంద్రం తరహాలో పనిచేసే అసిస్టెంట్ మేనేజర్, పొరుగుసేవల విధానంలో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్, ముగ్గురు సహాయకులే తిరుపతి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు.

**భాషాభిమానుల ఆకాంక్షలివీ..**

ఉమ్మడి రాష్ట్రంలో ఏటా రూ.250 కోట్లకు పైగా లావాదేవీలు జరిగే తెలుగు అకాడమీ, ప్రస్తుతం రూ.15 కోట్లకు మించలేదని అంటున్నారు. త్వరలో పాఠశాలల పాఠ్యపుస్తకాలు, డిగ్రీ, పోటీ పరీక్షల పుస్తకాలు, సివిల్స్‌కు సిద్ధం అవుతున్న వారికి అకాడమీ పుస్తకాలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్న నేపథ్యంలో తెలుగు, సంస్కృత అకాడమీ వ్యవహారంపై స్పష్టతను భాషాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

చురకలు



## బ్లూ అవుట్ ఫిట్ లో మేనిఛాయతో మైమరిపిస్తున్న నభా నటేష్!

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న అందాల నటి నభా నటేష్. 'ఇస్మార్ట్ శంకర్' సినిమాతో 'చాందినీ'గా కుర్రకారు గుండెల్లో గంటలు కొట్టిన ఈ కన్నడ బ్యూటీ, సోషల్ మీడియాలో కూడా అంతే యాక్టివ్‌గా ఉంటుంది. తాజాగా నీలి రంగు దుస్తుల్లో మెరిసిపోతూ ఆమె పంచుకున్న ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఆమె గ్లామర్ మరియు అభినయంతో ప్రేక్షకులను కట్టిపడేస్తుంది. మెరిసిపోతున్న అందం – నీలి రంగులో నభా మెరుపులు: ఇన్‌స్టాగ్రామ్‌లో నభా నటేష్ షేర్ చేసిన తాజా ఫొటోషూట్ అభిమానులను మంత్రముగ్ధులను చేస్తోంది. రాయల్ బ్లూ కలర్ అవుట్‌ఫిట్‌లో ఆమె మెరిసిపోతున్న తీరు అద్భుతంగా ఉంది. తన మేనిఛాయకు ఆ నీలి రంగు మరింత నిగారింపును ఇచ్చింది. ఈ ఫొటోల్లో ఆమె చూపిస్తున్న హావభావాలు, స్టైలిష్ లుక్ నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. కేవలం గ్లామర్ మాత్రమే కాదు, ఫ్యాషన్ సెన్స్‌లో కూడా తనకు సాటిలేరని ఈ అమ్మడు మరోసారి



నిరూపించింది. ఈ ఫొటోలకు లైకులు, కామెంట్ల వర్షం కురుస్తోంది, 'బ్లూ ఏంజెల్' అంటూ అభిమానులు సోషల్ మీడియాలో రచ్చ చేస్తున్నారు. ఇస్మార్ట్ బ్యూటీ సినీ ప్రయాణం – సక్సెస్ బాట: ఇక నభా నటేష్ కెరీర్ విషయానికి వస్తే, కన్నడ సినిమా 'వజ్రకాయ'తో పరిచయమైనా, తెలుగులో 'నన్ను దోచుకుందువటే' సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. అయితే పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది. ఆ సినిమాలో తన తెలంగాణ యాసతో, మాస్ డైలాగులతో అందరినీ ఆకట్టుకుంది. ఆ తర్వాత 'డిస్కో రాజా', 'సోలో బ్రతుకే సో బెటర్', 'అల్లుడు అదుర్స్' వంటి సినిమాల్లో నటించి తన నటనతో మెప్పించింది. మధ్యలో ఒక ప్రమాదం కారణంగా విరామం తీసుకున్న ఈ భామ, ఇప్పుడు మళ్ళీ రెట్టింపు ఉత్సాహంతో సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టి వరుస అవకాశాలతో దూసుకుపోతోంది. రాబోయే చిత్రాలు: ప్రస్తుతం నభా నటేష్ తన తదుపరి సినిమాలతో బిజీగా ఉంది. ముఖ్యంగా నిఖిల్ హీరోగా నటిస్తున్న భారీ పీరియడ్ డ్రామా 'స్వయంభూ'లో ఆమె ఒక కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సినిమా కోసం ఆమె ప్రత్యేకంగా శిక్షణ కూడా తీసుకుంది. ఇక సోషల్ మీడియాలో నిరంతరం ఫొటోలు షేర్ చేస్తూ ఫ్యాన్స్ కు టచ్ లో ఉండే నభా, తన అద్భుతమైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకులను అలరిస్తూనే ఉంది. ఇక కేవలం అందం మాత్రమే కాకుండా, ఏ పాత్రలోనైనా ఇమిడిపోయే ఆమె నైపుణ్యం చూస్తుంటే భవిష్యత్తులో స్టార్ హీరోయిన్‌గా ఆమె మరింత ఎత్తుకు ఎదుగుతుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. గ్లామర్ మరియు టాలెంట్ కలగలిసిన నభా నటేష్, తన స్టైలిష్ లుక్స్‌తో మరియు వైవిధ్యమైన పాత్రలతో టాలీవుడ్‌లో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటోంది. ఆమె మరిన్ని విజయాలు అందుకోవాలని కోరుకుందాం.

## కొత్త కాంబో.. నారా, అల్లరి సక్సెస్ అందుకుంటారా?

టాలీవుడ్ లో కొత్త కాంబినేషన్లకు ఎప్పుడూ మంచి రెస్పాన్స్ ఉంటుందన్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఓ ఇంట్రెస్టింగ్ కాంబో సెట్ అవుతున్నట్లు సోషల్ మీడియాలో గుసగుసలు వినిపిస్తున్నాయి. హీరోలు నారా రోహిత్, అల్లరి నరేష్ కలిసి ఓ సినిమా చేయడానికి సిద్ధమవుతున్నారని వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే అన్నీ ఫిక్స్ అయ్యాయని.. త్వరలో అనౌన్స్మెంట్ రానుందని టాక్ వినిపిస్తోంది. నిజానికి.. ఇద్దరూ ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్నారని చెప్పాలి. రీసెంట్ గా పలు సినిమాలు చేసినా.. బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలు అందుకోలేకపోయారు. దీంతో మంచి కథ, బలమైన స్క్రిప్ట్ తో ఆడియన్స్ ముందుకు వస్తే కమ్ బ్యాక్ ఇచ్చే మూవీ దక్కుతుందనే ప్లాన్ లో ఇప్పుడు ఉన్నట్లు తెలుస్తోంది. వెంకటేష్ నిమ్మలపూడి ఆ సినిమాకు దర్శకత్వం వహించనున్నారని సమాచారం. రీసెంట్ గా నారా రోహిత్ లీడ్ రోల్ లో నటించిన



సుందరకాండ మూవీతోనే డైరెక్టర్ గా వెంకటేష్ టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చారు. కానీ సరైన రిజల్ట్ ను మాత్రం అందుకోలేకపోయారు. ఇప్పుడు నారా రోహిత్, అల్లరి నరేష్ నటించనున్న మూవీని కంప్లీట్ హిలేరియస్ ఎంటర్టైనర్ గా రూపొందించనున్నట్లు తెలుస్తోంది. కామెడీ, ఫ్యామిలీ ఎమోషన్స్, ఎంటర్టైన్మెంట్ ఎలిమెంట్స్ తో సినిమా తెరకెక్కించనున్నారని టాక్ వినిపిస్తోంది. అదే సమయంలో నారా రోహిత్ ఇప్పటి వరకు సీరియస్, కంటెంట్ ఓరియెంటెడ్ పాత్రలతో మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. అల్లరి నరేష్ కామెడీ టైమింగ్, నేచురల్ యాక్టింగ్ తో ప్రేక్షకులను నవ్వించడంతో తనకంటూ ప్రత్యేక స్థానం సొంతం చేసుకున్నారు. ఆ తర్వాత మాస్ జోనర్ లో ప్రయోగాలు చేస్తున్నారు. ఇప్పుడు వీరిద్దరూ కలిసి స్క్రీన్ పై కనిపిస్తే ఆడియన్స్ కు కొత్త ఫీల్ రావడం పక్కా అని చెప్పాలి.కాగా.. సుందరకాండ మూవీ తర్వాత నారా రోహిత్ కొత్త సినిమా సైన్ చేయలేదు. కొంతకాలంగా సరైన కథ కోసం వెయిట్ చేస్తున్నారు. ఇప్పుడు వెంకటేష్ నిమ్మలపూడి స్టోరీ విని ఓకే చెప్పారట. మరోవైపు అల్లరి నరేష్ మాత్రం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారని చెప్పాలి. ఇటీవల ఆల్కహాల్ మూవీ షూటింగ్ ను పూర్తి చేసిన ఆయన.. తన లైనప్ లో ఇప్పటికే ఉన్న పలు చిత్రాల షూటింగ్స్ లో పాల్గొంటున్నారు. వెంకటేష్ కూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు! ఏదేమైనా నారా రోహిత్, అల్లరి నరేష్ కాంబినేషన్ లో మూవీ అంటే.. ఎంటర్టైన్మెంట్ గ్యారెంటీ అన్న అభిప్రాయం ఇప్పుడు సినీ ప్రియుల్లో కనిపిస్తోంది. సరైన కథ, టైమింగ్ కలిస్తే ఆ కాంబినేషన్ ఇద్దరికీ హిట్ ట్రాక్ లోకి తీసుకురావడం ఖాయమని నెటిజన్లు అంచనా వేస్తున్నారు. నారా – అల్లరి మూవీని నిర్మాత హరీష్ పెద్ది ప్రొడ్యూస్ చేయనున్నట్లు తెలుస్తుండగా.. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు. మరెప్పుడు వస్తుందో చూడాలి.




## పవన్ కోసం చరణ్..చరణ్ కోసం అఖిల్!



టాలీవుడ్‌కు బాగా కలిసొచ్చే సీజన్‌లు సంక్రాంతి, సమ్మర్, దసరా, దీపావళి. ఈ ఏడాది సంక్రాంతి సీజన్ అయిపోయింది. ఈ సీజన్‌లో బరిలోకి దిగిన మెగాస్టార్ –మన శంకరవరప్రసాద్ గారు– బ్లాక్ బస్టర్ హిట్ అనిపించుకుని సంక్రాంతి విజేతగా నిలిచింది. ఇక ఇదే సీజన్‌లో యంగ్ హీరోలో శర్వానంద్ –నారీ నారీ నడుమ మురారి–తో, నవీన్ పొలిశెట్టి –అనగనగ ఒక రాజు– సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. ఈ రెండు సినిమాలు కూడా మంచి విజయాన్ని అందుకున్నాయి. రవితేజ –భర్త మహాశయులకు విజ్ఞప్తి– అంటూ హడావిడి చేసినా ఫలితం లేకుండా పోయింది. ఈ సినిమాలతో సంక్రాంతి ఫైట్ ముగిసిపోవడంతో ఇప్పుడు అందరి దృష్టి సమ్మర్ సమరంపై పడింది. సంక్రాంతి సమరం తరహాలోనే వేసవి యుద్ధం కూడా టాలీవుడ్‌కు సంబరాల్ని తెచ్చి పెడుతుందా? అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే వేసవి బరిలోకి ఏ స్టార్ దిగబోతున్నాడు? ఇంతకీ ఏ ఏ సినిమాలు పోటీపడబోతున్నాయన్నది నిన్న మొన్నటి వరకు సస్పెన్స్‌గానే ఉంది. ఈ సస్పెన్స్‌కు పవన్‌కల్యాణ్, రామ్‌చరణ్ తాజాగా తెరదించారు. పవన్ కోసం చరణ్ వెనక్కి తగ్గి దారిచ్చేశాడు. ఇంత వరకు రామ్ చరణ్ నటిస్తున్న–పెద్ది– మూవీని మార్చి 27న రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. రిలీజ్ డేట్‌ని కూడా అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే బాబాయ్ పవన్ కల్యాణ్ నటిస్తున్న –ఉస్తాద్ భగత్‌సింగ్– కోసం చరణ్ తన –పెద్ది– మూవీని వెనక్కి నెట్టి మార్చి 27న కాకుండా ఏప్రిల్ 30కి వెళ్లిపోవడం తెలిసిందే. అబ్బాయ్ తప్పుకోవడంతో పవన్ కల్యాణ్ –ఉస్తాద్ భగత్‌సింగ్–ని మార్చి 26న భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.'చాశ్రీంశీ =ఖుఃు – సీక్వెల్ కోసం తరుణ్ ఏదో గట్టిగానే ప్లాన్ చేశాడుగా! ముందుగా తమమూవీని మార్చి 26న రిలీజ్ చేస్తున్నామంటూ –ఉస్తాద్ భగత్‌సింగ్– టీమ్ ప్రకటించడంతో ఆ వెంటనే రామ్ చరణ్ –పెద్ది– టీమ్ కూడా తమ రిలీజ్ డేట్‌ని మార్చేసుకున్నామని, మార్చి 27న కాకుండా ఏప్రిల్ 30న వచ్చేస్తున్నామని ప్రకటించడంతో బాబాయ్ కోసం అబ్బాయ్ తగ్గాడని అందరికి తెలియడమే కాకుండా సమ్మర్ సమరంపై ఓ క్లారిటీ వచ్చేసింది. అయితే చరణ్ –పెద్ది– ఏప్రిల్ 30న వస్తుండటం ఇప్పుడు అఖిల్‌కు ఇబ్బందికరంగా మారింది. వరుస డిజాస్టర్ల తరువాత ఈ సారి ఎలాగైనా బ్లాక్ బస్టర్ హిట్‌ని దక్కించుకోవాలని విశ్వప్రయత్నాలు చేస్తున్న అఖిల్ మే 1న –లెనిన్– మూవీతో రానున్న విషయం తెలిసిందే. అయితే –పెద్ది– రిలీజ్ ఏప్రిల్ 30కి మారడంతో అఖిల్ సినిమా రిలీజ్ ఇప్పుడు ఇరకాటంలో పడింది. –పెద్ద– రిలీజ్ తరువాత ఒకే ఒక్క రోజు మాత్రమే గ్యాప్ ఉండటంతో –లెనిన్– కలెక్షన్స్‌పై తీవ్ర ప్రభావం పడుతుందని భావించిన టీమ్ తమ సినిమాని వాయిదా వేసుకోవాలనే నిర్ణయానికి వచ్చినట్టుగా తెలుస్తోంది.

మే యూడవ వారానికి వాయిదా వేయాలని భావిస్తున్నారట. చరణ్‌తో అఖిల్‌కున్న అనుబంధాన్ని దృష్టిలో పెట్టుకుని మేకర్స్ సినిమా రిలీజ్‌ని పోస్ట్ పోన్ చేస్తున్నారని ఇన్ సైడ్ టాక్.

## లైఫ్ లో అదొక్కటే చాలంటున్న హీరోయిన్



మూవీ ఇండస్ట్రీలో ఉండాలంటే సెలబ్రిటీలు తమ యాక్టింగ్ తోనే కాదు, తమ అందం, ఫిట్‌నెస్ తో కూడా ఆడియన్స్ ను ఎప్పటికప్పుడు మెప్పిస్తూనే ఉండాలి. అలా చేయలేకపోతే దర్శకనిర్మాతలతో పాటూ ఆడియన్స్ దృష్టి కూడా వేరే వారివైపు మళ్లుతుంది. అందుకే అందంగా, ఫిట్‌గా కనిపించడానికి నటీనటులు చాలా కష్టపడుతూ ఉంటారు.

బరువు కొంచెం కూడా పెరగకుండా, తగ్గకుండా ఎప్పుడూ ఒకే లుక్ ను మెయిన్‌టెయిన్ చేస్తూ ఎంతో కష్టపడుతుంటారు. అందులో భాగంగానే సెలబ్రిటీలు ఎక్కువగా జిమ్ లో తమ సమయాన్ని గడుపుతూ ఉంటారు. ఇంకా చెప్పాలంటే పేరుకే సెలబ్రిటీలు కానీ వాళ్లు కావాలనుకున్నది వాళ్లు తినడానికి ఎన్నో విషయాలు అడ్డొస్తుంటాయి. ఫుడ్ విషయంలో నో రూల్స్ ఇది తింటే ఏమవుతుందో? అది తింటే ఏమవుతుందో అని క్యాలరీలు లెక్కేసుకుని మరీ తింటారు. అందుకే చాలా మంది తమకు ఇష్టమైనవన్నీ తినకుండా నోరు కట్టేసుకుని ఉంటారు. కానీ టాలీవుడ్ లక్కీ హీరోయిన్ గా పేరు తెచ్చుకున్న మీనాక్షి చౌదరి మాత్రం ఫుడ్ విషయంలో ఎలాంటి రిస్ట్రిక్షన్స్ వద్దంటున్నారు. రీసెంట్ గా ఆమె ఫుడ్ గురించి మాట్లాడుతున్న వీడియో ఒకటి ఇప్పుడు సోషల్ మీడియాలో వైరలవుతోంది. స్ట్రెస్ వద్దంటున్న మీనాక్షి రీసెంట్ గా మీనాక్షి ఓ పార్టీకి వెళ్లగా, అక్కడ తీసిన వీడియో బయటికొచ్చింది. ఈ వీడియోలో మీనాక్షి సెలబ్రిటీలాగా కాకుండా అందరిలాగానే చాలా నేచురల్ గా భోజనం చేస్తూ కనిపించారు.

అంతేకాదు, భోజనం చేస్తూ మీనాక్షి చెప్పిన మాటలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఆ వీడియోలో మీనాక్షి, లైఫ్ లో స్ట్రెస్ ఇదంతా ఏమీ వద్దు, ఓన్లీ ఫుడ్డు అని నవ్వుతూ చెప్పగా, వీడియో తీస్తున్న వ్యక్తి ఇది ఈ డికేడ్ లోనే బెస్ట్ మోటివేషనల్ వీడియో అంటుంటే, కాదు, సెంచరీ అంటూ మీనాక్షి మళ్లీ తినడం కంటిన్యూ చేయడంతో ఈ వీడియో అందరినీ తెగ ఎట్రాక్ట్ చేస్తుండగా, నెటిజన్లు ఈ వీడియోను లైక్ చేస్తూ వైరల్ చేస్తున్నారు. 'చాశ్రీంశీ =ఖుఃు – శేఖరుడు ఆ సీట్‌ని భర్తీ చేస్తే ఇక తిరుగే ఉండదు! సెలబ్రిటీ అయినప్పటికీ మీనాక్షి ఇలా సింపుల్ గా ఫుడ్ గురించి చెప్పిన మోటివేషన్ బావుందని ఆమె ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. ఇక కెరీర్ విషయానికొస్తే, రీసెంట్ గా అనగనగా ఒక రాజు మూవీతో బ్లాక్ బస్టర్ ను అందుకున్న మీనాక్షి చేతిలో ప్రస్తుతం పలు క్రేజీ ప్రాజెక్టులున్నాయి. అక్కినేని నాగ చైతన్యతో పాటూ ప్రదీప్ రంగనాథన్ తో కూడా మీనాక్షి సినిమాలు చేస్తూ కెరీర్లో బిజీగా ఉన్నారు.

## పెళ్లి తరువాత సామ్‌లో కొత్త కళ బావుందే!

కెరీర్ పరంగా కొంత విరామం తీసుకున్న సమంత మళ్లీ తనదైన మార్కు సినిమాలతో ప్రేక్షకుల్ని అలరించడానికి రెడీ అవుతోంది. తాను నిర్మించిన థ్రిల్లర్ ఎంటర్‌టైనర్ –శుభం–లో గెస్ట్ క్యారెక్టర్ చేసిన సామ్ త్వరలో పూర్తి స్థాయి క్యారెక్టర్‌తో యాక్షన్ మోడ్‌లో ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతోంది. ఆమె నటిస్తున్న భారీ యాక్షన్ ఫ్యామిలీ డ్రామా –మా ఇంటి బంగారం–. నందిని రెడ్డి డైరెక్టర్. సామ్ తన సొంత బ్యానర్ ట్రాలాలా మూవీంగ్ పిక్చర్స్ బ్యానర్‌పై సమంత నిర్మిస్తున్న రెండవ సినిమా ఇది. నందినిరెడ్డి డైరెక్టర్ అయినా సామ్ భర్త రాజ్ నిడిమోర్ క్రియేటర్‌గా వ్యవహరిస్తున్నారు. గత నెల విడుదల చేసిన ఈ మూవీ టీజర్ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య కీలక పాత్రలో నటిస్తున్న ఈ మూవీని 1980వ దశకం నేపథ్యంలో క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్నారు. ఇష్టం లేకుండానే ఓ కుటుంబంలోకి ప్రవేశించిన కోడలిని ఆ ఇంటి వారు ఎలా బయటకి వెళ్లగొట్టాలను కున్నారు? ఇందులో వారు చేసిన ప్రయత్నాలని సామ్ ఎలా తిప్పి కొట్టింది అన్నదే



ఈ చిత్ర ప్రధాన కథగా తెలుస్తోంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ మూవీని త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇదిలా ఉంటే నాగాచైతన్యతో విడాకులు తీసుకుని కొంత కాలం ఆరోగ్య సమస్యలతో సతమతమైన సామ్ ఇటీవల డైరెక్టర్ రాజ్ నిడిమోర్‌ని వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. పెళ్లి తరువాత నుంచి ప్రొఫెషనల్ వర్క్‌లో సామ్‌బిజీగా మారిపోయింది. రాజ్ నిడిమోర్ సహకారంతో –శుభం– మూవీని నిర్మించి సక్సెస్ సాధించిన సమంత అదే జోష్‌తో ఇప్పుడు –మా ఇంటి బంగారం–లో నటిస్తూ నిర్మిస్తోంది. ఓ పక్క సినిమాల్లో నటిస్తూనే గతంలో సోషల్ మీడియాలో బిజీగా ఉన్నట్టే ఇప్పుడూ అదే పంథాని కొనసాగిస్తూ చాలా చలాకీగా వ్యవహరిస్తోంది. రాజ్‌తో కలిసి క్రిస్మస్ వేడుకలని హ్యాపీగా సెలబ్రేట్ చేసుకున్న సామ్ ఇప్పుడు కొత్త కళని సంతరించుకుని అంతరిని ఆశ్చర్య పరుస్తోంది. తాజాగా సామ్ లంగాఓణీ తరహా డ్రెస్‌లో కనిపిస్తున్న ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ ఫొటోల్లో సామ్ గతంలో కోల్పోయిన గ్లో మళ్లీ కనిపిస్తుండటంతో సామ్‌లో కొత్త కళ బాగుందని కామెంట్‌లు చేస్తున్నారు. ఇదిలా ఉంటే సమంత –మా ఇంటి బంగారం–తో పాటు మరో క్రేజీ మూవీలోనూ నటిస్తోంది. రాజ్ అండ్ డీకె సంయుక్తంగా రూపొందిస్తున్న –రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్ లోనూ సమంత కీలక పాత్రలో నటిస్తోంది.

ఇందులోని ఇతర ప్రధాన పాత్రల్లో ఆదిత్యరాయ్ కపూర్, అలీ ఫజల్ తదితరులు నటిస్తున్నారు. దీన్ని ఓ పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రాజ్ అండ్ డీకె తెరకెక్కిస్తున్నారు. –మా ఇంటి బంగారం– తరువాత ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది.

## పోలీస్ స్టేషన్ లో ఈషా రెబ్బ.. అసలేం జరిగిందంటే?

సోషల్ మీడియాలో సెలబ్రిటీలకు అభిమానుల నుంచి ఎంతటి ప్రేమ లభిస్తుందో, కొందరు వికృత మనస్తత్వం ఉన్నవారి వల్ల అంతే వేధింపులు కూడా ఎదురవుతుంటాయి. తాజాగా టాలీవుడ్ బ్యూటీ ఈషా రెబ్బకు ఇలాంటి చేదు అనుభవమే ఎదురైంది. తనపై జరుగుతున్న అసభ్యకర దాడులను మౌనంగా భరించకుండా, ధైర్యంగా పోలీసులను ఆశ్రయించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ సైబర్ వేధింపుల వెనుక ఉన్న అసలు కథ ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది.

**అసలేం జరిగిందంటే?:** గత కొన్ని రోజులుగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఈషా రెబ్బ పోస్ట్ చేసే ఫొటోలు, వీడియోల కింద ఒక వ్యక్తి వరుసగా అత్యంత అసభ్యకరమైన కామెంట్స్ చేస్తున్నట్లు ఆమె గుర్తించారు. సాధారణంగా సెలబ్రిటీలు ఇలాంటి నెగెటివ్ కామెంట్లను పెద్దగా పట్టించుకోరు. ఈషా కూడా మొదట్లో వీటిని విస్మరించి వదిలేశారు. కానీ, ఆ వ్యక్తి రోజురోజుకూ తన పరిధి దాటి, అత్యంత హేయమైన రీతిలో కామెంట్స్ చేస్తుండటంతో అది తన గౌరవానికి భంగం కలిగిస్తుందని ఆమె భావించారు. తనను వేధిస్తున్నది ఒక ఫేక్ అకౌంట్ అని తెలిసినప్పటికీ, చట్టపరంగా సమాధానం చెప్పాలని ఆమె



నిర్ణయించుకున్నారు. రంగంలోకి దిగిన సైబర్ క్రైమ్: తన గౌరవానికి భంగం కలిగిస్తున్న సదరు వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఈషా రెబ్బ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేవలం ఫిర్యాదు చేయడమే కాకుండా, సదరు వ్యక్తి ప్రొఫైల్ ఐడీతో పాటు, అతను పెట్టిన అభ్యంతరకర కామెంట్లను స్క్రీన్ షాట్స్ తీసి పక్కా ఆధారాలుగా పోలీసులకు సమర్పించారు. సైబర్ క్రైమ్ పోలీసులు ఈ ఫిర్యాదును స్వీకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. టెక్నాలజీ సాయంతో ఆ ఫేక్ అకౌంట్ వెనుక ఉన్న అసలు వ్యక్తిని గుర్తించేందుకు పోలీసులు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. కేసు దర్యాప్తు జరుగుతుంది.నెటిజన్ల మద్దతు: సైబర్ వేధింపులపై ఈషా రెబ్బ తీసుకున్న ఈ గట్టి నిర్ణయానికి నెటిజన్ల నుంచి భారీగా మద్దతు లభిస్తోంది. "సెలబ్రిటీలైనా, సాధారణ మహిళలైనా ఇలాంటి వేధింపులను అస్సలు ఉపేక్షించకూడదు" అని చాలామంది కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్ల మాటున దాక్కుని ఇలాంటి వికృత చేష్టలకు పాల్పడే వారికి ఈ కేసు ఒక హెచ్చరికలా మారుతుందని నెటిజన్లు భావిస్తున్నారు. ఈషా చూపిన ఈ ధైర్యం వేధింపులకు గురవుతున్న ఇతర మహిళల్లో కూడా స్ఫూర్తిని నింపుతోంది. ఇక ఇటీవల జనవరి 30 న ఇషా రెబ్బా, తరుణ్ భాస్కర్, నటించిన ఫ్యామిలీ డ్రామా ఓం శాంతి శాంతి శాంతి: రిలీజ్ అయింది. సోషల్ మీడియా అంటే కేవలం ఫొటోలు షేర్ చేసుకోవడమే కాదు, అది ఒక బాధ్యతతో కూడిన వేదిక అని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. ఈషా రెబ్బ ఫిర్యాదుతో పోలీసులు ఆ నిందితుడిని పట్టుకుని తగిన గుణపాఠం చెప్పాలని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు .

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536